కంచి పరమాచార్య
శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారి
అమృతవాణి తృతీయ భాగము

షట్పదీస్తోత్రం

అనువక్త:

దేవరకొండ శేషగిరిరావు

ప్రకాశకులు

మహా విద్యాపీఠం

హైదరాబాద్

కంచి మహాస్వామి అమృతవాణి తృతీయ భాగము

అనువక్త : దేవరకొండ శేషగిరిరావు

ప్రథమ ముద్రణ : మే 2012

ప్రకాశకులు : మహావిద్యా పీఠం,
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్,
హైదరాబాద్-500 043, సెల్: 98854 44428

వెల : రూ. 125/-

ప్రతులకు : అన్ని ముఖ్యమైన పుస్తక విక్రయ కేంద్రాలు

టైటిల్ డిజైన్ : కె. రామకృష్ణ

ప్రింటింగ్ :కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్

అనుగ్రహం

1967లో మహాస్వామి వారు కొంతకాలం కాకినాడలో ఉండగా వారిని చూసి ఆశ్చర్యపడి అంజలి ఘటించారు. "మనవి మృణ్మయ శరీరాలు, వారిది చిన్మయ శరీరం'అని అన్నారు, స్వర్గస్థులైన శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రి గారు. ఆ చిన్మయ శరీరం నుండే అమృతవాణి వెలువడింది. ఆ శరీరం అజరం, అమరం. అక్షరాలమయం. ఆ అక్షరాలను ఆసరగా చేసికొని అక్షర స్వరూపుణ్ణి చేరుకోవడమే అంతిమ లక్ష్యం.

స్వామివారి తమిళ ఉపన్యాసాలను 'దైవత్తిన్ కురల్' పేరిట సంకలనం చేసారు, శ్రీ రా. గణపతి గారు. 2006లో శ్రీ కంచి మహాస్వామి పీఠారోహణ శతాబ్ది మహోత్సవ ట్రస్టు వారు 'వాయిస్ ఆఫ్ గాడ్' పేరుతో ఏడు సంపుటాలలో ఆరువేలపైబడ పుటలతో ఆంగ్లంలోకి అనువదింపచేసి ప్రచురించారు.

చాలా సంవత్సరాల వెనుక సాధన గ్రంథ మండలి, తెనాలి వారు 'జగద్గురు బోధల' పేరిట పది సంపుటాలను ప్రచురించారు.

తెలుగులో ఇంతవరకు రాని వాటిని, అసమగ్రమైన వాటిని అందించడమే లక్ష్యంగా అనువాదానికి పూనుకొన్నాను.

వృత్తిరీత్యా ప్రసిద్ధ చార్టర్డ్ ఎకౌంటెంట్ అయినా, ప్రవృత్తి సనాతన ధర్మారాధన మగుటచే, సహృదయత్వంతో స్వామి వారి (1) అద్వైత సాధన (2) గురుసంప్రదాయము (3) అమృతవాణి: 1-అద్వైతం (4) అమృతవాణి: 2-నమోనమః మొదలగు నాల్గు గ్రంథాలను వెలయింప చేసిన శ్రీవావిలాల ఉమాపతి గార్కి నా హృదయ పూర్వక నమస్కారములు. మీ ముందున్నది స్వామివారి అమృతవాణిలో తృతీయ భాగము.

శంకరుల షట్పదీస్తోత్రం గురించి, జగద్గురు బోధలలో పది పుటలుండగా ఆంగ్లంలోనే, నూరు పుటలుంది.

నిరంతరం భగవత్ చింతన చేయడం కుదరకపోతే మహాత్ముల చరిత్రలు చదవండని, చూసి వ్రాయండని ఒకమారు స్వామి వారే హితోపదేశం చేసారు. అందుకే కామకోటి స్వామివారి అమృతవాణిని సేవిస్తున్నాను.

మన ఆంధ్రదేశంలో కొన్ని వేల మంది ఆంగ్లం నుండి తెలుగు చేయగలరు. అయినా ఈ భాగ్యం నాకు దక్కింది. లోగడ జగద్గురు బోధల అనువాదకులకూ దక్కింది. ఇంతవరకూ తెలుగులోనికి రాని విషయాలెన్నో ఉన్నాయి. స్వామివారు అనుగ్రహిస్తే, కాలం అనుకూలిస్తే ఇంకా కొన్ని సంపుటాలు రావచ్చు. అందుకే ఈ శీర్షికకు 'అనుగ్రహం' ఉంచాను.

"పిబరే కామకోటి రసం"

ఇట్లు

అనువక్త

సూచన

1. అమృతవాణి ప్రథమభాగము - అద్వైతంలో 28,29 పుటలు 'జగద్గురు బోధ'లనుంచి గ్రహింపబడినవనే మాట ప్రచురింపబడలేదు.

2. అమృతవాణి ద్వితీయ భాగము - నమోనమః లోని కవులు-కావ్యాల శీర్షిక, 53 పుటలో 'త్యాగరాజయోగ వైభవం' కృతి త్యాగరాజు వ్రాసినట్లు పడింది. కాని వ్రాసినది ముత్తుస్వామి దీక్షితులు.

పాఠకులు గమనింపగలరు

ఇట్లు

ప్రకాశకులు

విషయ సూచిక

I. షట్పదీస్తోత్రం

II. ఉపవేదములు

షట్పదీస్తోత్రం

శంకరుల షట్పదీస్తోత్రం

శంకరుల స్తోత్రాలు

బ్రహ్మసూత్రాలు, గీత, ఉపనిషత్తులపై ఆది శంకరులు అద్వైతపరంగా వ్యాఖ్యానం చేసినట్లు జగత్ప్రసిద్ధం. వివేక చూడామణి, ఉపదేశ సాహస్రి వంటి ప్రకరణ గ్రంథాలను స్వతంత్రంగా వ్రాసేరు.

పరమాత్మయే సత్యమని, జగత్తు మిథ్యయని; జీవుడే పరబ్రహ్మయని చెప్పేది అద్వైతం. ఇది వేద సమ్మతమని నిరూపించారు.

అయితే ఈ సిద్ధాంతం సామాన్య జనులకు అందుబాటులో ఉండదు కదా! బౌద్ధికంగా జీవ పరమాత్మలను తెలుసుకొని ప్రయోజనం ఏమిటి? శాంత మనస్కులమై దీనిని ఒంట పట్టించుకొనే స్థితిలో లేం. మనకు అనుభవంలో ఉన్నది ఈ జగత్తు. పరుగులెత్తే మనస్సుతో కాక స్తిమితమనస్కులకు మాత్రమే అద్వైతానుభూతి కల్గుతుంది. కనబడేదంతా భ్రాంతియనే భావన అంత చటుక్కున అనుభవంలోకి వస్తుందా? అట్టి అనుభవం రావడానికి సత్కర్మలు, అనుష్ఠానం, తద్వారా చిత్తశుద్ధి ఏర్పడగా అద్వైత సిద్ధి.

అయితే సామాన్య జనులకు మార్గమేమిటి? సామాన్యులకు భాష్యాలు, ప్రకరణ గ్రంథాలు ఆమడ దూరంలో ఉంటాయని పరమకరుణతో వేదాంత శిఖరాన్ని అధిరోహించిన శంకరులు మనకై దిగివచ్చి అనేక ఉపాయాలను, క్రమమార్గాన్ని అందించారు.

ముందుగా ప్రత్యేకమైన కోరికలు, కోపతాపాలు లేకుండా శాస్త్రం విధించిన కర్మలను చేయాలన్నారు. కర్మలను చేస్తున్న కొద్దీ చంచలమైన మనస్సు కొంత కట్టుబడుతుంది. అది ఇంకా అదుపులో ఉండాలంటే సగుణ

మూర్తియైన అనగా ఒక ఆకారం, కల్యాణ గుణాలు కలిగిన మూర్తిని ఆరాధించాలన్నారు. సంతోష పూర్వకంగా అట్టి రూపాన్ని సాధకుడు ధ్యానిస్తాడు. ఇష్టదేవతా మూర్తి తన కృపను చూపించి ఆరాధించేవాడు, అరాధింపబడే వాడనే భేదభావం క్రమక్రమంగా తొలగిపోయి నిర్గుణ బ్రహ్మానుభవం కల్గుతుందని మార్గం చూపించారు.

అందువల్ల భక్తి ఉపాసనను మనబోంట్లకు కర్మనుష్ఠానంతో బాటు విధించారు. ఎట్లా ఉపాసించాలో, ఎట్లా ప్రార్థించాలో సామాన్యులకు తెలియజేయడం కోసం వారే అనేక దేవతలపై అనేక స్తోత్రాలు చేసారు.

శివానందలహరి, సౌందర్యలహరి వంటి శతకాలే కాకుండా అనేక సోత్రాలను అందించారు. ఈ సోత్రాలు సులభశైలిలో ఉంటాయి. భావగర్భితంగా ఉంటాయి. విద్వాంసులకే పరిమితమైన భాష్యాలను ఎట్లా వ్రాసేరో అట్లాగే చిన్న పిల్లలు కూడా కంఠస్థం చేయదగిన శ్లోకాలనూ అందించారు.

షట్పదీస్తోత్రం

సర్వజగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువు నుద్దేశించి షట్పదీస్తోత్రాన్ని వ్రాసేరు. ఇది మనస్సులో నిలపగలిగితే శంకరులను, మహావిష్ణువును, మనలను మనం గుర్తించగలం. మనలను మనం తెలిసికొనడమే అద్వైతం. ఈ స్తోత్రమూ అద్వైతానికి దారి చూపిస్తుంది.

పదం - కవిత్వంలో భాగం

షట్పదియనగా ఆరు పదములు లేదా ఆరు కాళ్లు ఉన్నది. ఆరుకాళ్లతో ఉన్నదేమిటి?

పదం అనగా పాదమని, ఒక పదమని అర్థం కదా! శ్లోకంలో నాల్గవ వంతు పదము, లేక పాదము. మన శరీరంలో కాళ్లు నాల్గవవంతున్నాయి కదా! అట్లాగే నాల్గవ వంతు, పాదము లేక పదం.

ఇట్లా నాల్గు పాదాలతో ఉండడం వల్ల శ్లోకాన్ని పద్యమన్నాం. పదమనే దానికి కొన్ని అక్షరములు కలిగినదనే అర్థం గ్రహిస్తే, గద్యం కూడా పద్యమై పోతుంది. అదీ పదాలతోనే ఉంటుంది కదా! కనుక వచనాన్ని గద్యమన్నారు. గద్ అనగా మాట్లాడుట. కనుక సంభాషణ గద్యంలోనే సాగుతుంది. పద్యంలోని ఒక్కొక్క పాదము ఇన్నిన్ని అక్షరాలతో లేదా గణాలతో ఉండడం వల్ల శ్లోకాలను పద్యమని అన్నారు. నాల్గు పాదాలూ ఉంటాయి ఇందులో. పాటలు కవిత్వంతో ఉంటాయి. కనుక అవీ పద్యములే. కనుక గద్యమనగా వచనం, సంభాషణలకు చెందగా, పద్యమనగా పాటలు, సంగీతానికి చెందినవైనాయి.

శ్లోకంలో నాల్గవవంతు పాదం. మనకు తెలిసిన "శుక్లాంబరధరం" శ్లోకం అనుష్టుప్ ఛందస్సులో ఉంటుంది. ఇందు 32 అక్షరాలుంటాయి. ఇది నాల్గుగా చీలితే నాల్గు పాదాలవుతున్నాయి.

ఇది తమిళ అక్షరాలతో వ్రాస్తే 32 అక్షరాలకంటే ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే సంస్కృతంలో 'క్లీం' అనే అక్షరం ఉంది. అచ్చులనే లెక్కపెడితే 32 ఉంటాయి. అట్లాగే 'ష్ఠుం' సంస్కృతంలో ఒకే అక్షరం. అది తమిళంలో మూడు అక్షరాలుగా ఉంటుంది. ష్ఠుంలో అచ్చు ఉకారమే కదా!

అచ్చులు - హల్లులు; ప్రాణము - శరీరము

అచ్చులు, హల్లులంటే శైవసిద్ధాంతం గుర్తుకు వస్తోంది. వైష్ణవులు జీవాత్మ - పరమాత్మలను శరీర-శరీరి సంబంధంతో చెబుతారు. శైవ సిద్ధాంతులు కూడా ఇంచుమించు అంతే. మన శరీరంలో ప్రాణం ఉంది కదా! అది పోతే శరీరము, శవమైపోతుంది. అట్లాగే సమస్త జీవుల శరీరాలు,

పరమాత్మునకు శరీరం వంటిది. పరమాత్మయే అందరిలో ప్రాణంగా ఉంటాడు. అనగా అందరికీ ప్రాణానికి ప్రాణమైయుంటాడు. తమిళంలో శరీరాన్ని 'మై' అంటారు. శరీరం (ప్రాణం) పోతే 'మై పోయ్' అనగా అబద్ధమౌతోందనే అర్థంలో వాడుతారు. అట్లాగే లోనున్న అంతర్యామియైన భగవానుడు విడిచిపెడితే జీవలోకం, శవమై పోతోంది.

ఇది 'అబద్ధం' అయినా, ఈ శరీరం అసత్యమని అద్వైతులన్నట్లుగా శైవ సిద్ధాంతులనరు. పరబ్రహ్మ కంటే మిగిలినదంతా అసత్యమని, మాయమని అద్వైతులంటారు. శైవ సిద్ధాంతులేమంటారో వినండి. జీవ ప్రపంచంలో ఈశ్వరుడు, అంతర్యామిగా ఉండి నడుపుతున్నాడని అచ్చుల-హల్లుల ప్రస్తావన తీసికొని వస్తారు. అచ్చులు, హల్లులు కలిపిన అక్షరాలుంటాయి కదా, అక్షరాలలో హల్లులు 'మై' వంటివయినా, విడిగా అచ్చులనే ఉపయోగించి మాట్లాడుతున్నామా? అనగా కేవలం అ, ఆలతో వ్యవహారం సాగుతోందా? హల్లులు (క్,గ్ వంటివి) శరీరం వంటివి.

శరీరంలో ప్రాణం లేకపోతే పనికిరానట్లు అచ్చులతో లేని హల్లులూ నిర్జీవములే. అంత మాత్రంచే అచ్చులులేని కేవలం హల్లులు, ఎందుకూ పనికిరానివై పోతాయా? అవి అబద్ధములా? అవి అచ్చులతో కలిసి ఉపయోగించడం లేదా? అవి భిన్న భిన్నంగా నాదంతో వినిపించడం లేదా? అచ్చులు లేకుండా హల్లులూ విడిగా ఉండగలవు. అందువల్ల వాటికీ అస్తిత్వం ఉంది. అయితే అబద్ధమని చెప్పలేం కదా! అందువల్ల పరమాత్మకంటే జీవులు భిన్నులై, హల్లుల మాదిరిగా విడిగా వ్యక్తిత్వాన్ని కల్గియుంటారు. కనుక కేవలం అవి అబద్ధములని కొట్టి పారవేయలేం. అయినా ప్రాణం లేకపోతే అంతా శవమే. అందువల్ల మొత్తం అంతా ఆత్మయని చెప్పడానికి బదులు ద్వైతుల మాదిరిగా కొంత భేదాన్ని శైవసిద్ధాంతులు చూపిస్తారు. పరమాత్మ అచ్చు అని; జీవాత్మ – హల్లు అని అంటారు.

అట్లాగే శంకరులు మొత్తం లోకం అంతా అబద్ధమని చెప్పలేదు. సత్యంలో తరతమ భేదాలుంటాయని అన్నారు. సిద్ధాంత చర్చ, ఇప్పుడు చేయదలుచుకోలేదు. వ్యావహారిక, ప్రాతిభాసిక, పరమార్థ సత్యాలను పేర్కొన్నారు. కొంతకాలం ఉండి కనుమరుగైపోయే వ్యావహారిక, ప్రాతిభాసిక సత్యాలను పేర్కొన్నారు. ప్రస్తుతం మనం షట్పదీస్తోత్రం గురించి మాట్లాడుతున్నాం. వారే వాద ప్రతివాదాలతో కాలం వృథా చేయరాదని భక్తిని గురించి చెప్పారు కదా! షట్పది గురించి మాట్లాడుతూ శైవసిద్ధాంతంలోకి అనుకోకుండా అడుగు పెట్టాం.

ఆరుశ్లోకాలున్న స్తోత్రం

ఇది జాతి ఛందస్సులో వ్రాయబడింది. అద్వైతియైనా భిన్న భిన్న ఛందస్సులలో శంకరులు సుతించారు. ఈ స్తోత్రం ఆర్యా వృత్తంతో ఉంటుంది. ఇందు ఒకటి, మూడు పంక్తులు 12 మాత్రలతో డంటాయి. రెండవ పాదంలో 18 మాత్రలు, నాల్గవ పాదంలో 15 మాత్రలుంటాయి. ఈ లెక్కబెట్టడం చిత్రంగా డంటుంది. మాత్ర అంటే తెప్పపాటు కాలంలో డచ్చరింపదగింది.

అక్షరాలు కాకుండా లఘు, గురు మార్గంలో లెక్కబెట్టడమా? మనం సాధారణంగా వృత్తపద్ధతికి అలవాటు పడ్డాం. ఈ జాతి ఛందస్సు రీతి, భిన్నంగా ఉంటుంది. ఇందలి అక్షరాలను వల్లిస్తూ ఉంటే ఒక చక్కని నడకతో ఉంటాయి. చిన్న పిల్లలు కూడా కంఠస్థం చేయవచ్చు.

ఇందు చివరి శ్లోకం, ఫలశ్రుతిని మినహాయిస్తే ఉండేవి ఆరు శ్లోకాలే. ఫలశ్రుతి కూడా పై మాదిరిగా ఒకే ఛందస్సులో ఉంది.

ఇది ఫలశ్రుతి వంటిదే. కాని ఫలశ్రుతి కాదు. ఇది నిజమైన ఫలశ్రుతియైతే పై శ్లోకాలు చదివిన వారికి ఫలానా కోరికలు సిద్ధిస్తాయని సాధారణంగా ఉంటుంది. కాని ఇందులో అట్టి మాటలుండవు. తరువాత వివరిస్తా, వరుసగా శ్లోకాలను అందిస్తాను.

షట్పదియంటే ఆరు పదాలుంటాయని అనుకొంటాం. కాని మొత్తం శ్లోకాన్ని ఒక పదంగా భావించారే గాని శ్లోకంలోని పాదమనే అర్థంలో వాడలేదు. పదం అనే దానికి చాలా అర్థాలున్నాయి. వేదంలో పదం, క్రమం, ఘన అని ఉంటాయి కదా! ఘనపాఠాన్ని వల్లించగలిగితే ఘనపాఠి అంటాం. అట్లా క్రమమైతే క్రమపాఠి అంటాం. ఇక్కడ పదం అంటే మంత్రంలోని విడివిడిగా పదాలను విభజించి చూపించుట.

పదం అనే మాట శ్లోకంలో నాల్గవవంతని కాక, పూర్తి శ్లోకమనే అర్థంలోనూ వాడబడింది. జయదేవుని గీతగోవిందం ప్రతిపాటలో ఎనిమిది పూర్తి శ్లోకాలతో ఉన్నదనే అర్థంలో అష్టపదులు అని అంటారు.

తమిళంలో పదిగం, లేక పాశారాలు ఉన్నాయి. ఎన్ని పద్యాలున్నాయని అడగడానికి బదులు ఎన్ని 'ఆదులు' (మెట్లు) ఉన్నాయని అడుగుతారు. ఇక్కడ ఆది, పద్యభాగమనే అర్థంలో కాకుండా ఎన్ని పద్యాలున్నాయనే అర్థంలో వాడుతారు. కీర్తనలో అనేక చరణాలుంటాయి. ఇందెన్ని ఆదులున్నాయని అడుగుతారు. శ్లోకమైతే ఎన్ని పాదాలు, ఎన్ని పదాలని అడుగుతారు. పదం, చరణం అన్నా పాదాలు, మెట్లు అని అర్థం.

నిమ్మదిగా నడిచేటపుడు పదే-పదే అంటాం. అందుకే భక్తిలో ఒక్కొక్క అడుగూ వేస్తూ ఉండగా అనగా ఒక్కొక్క శ్లోకం గడచినట్లు షట్పది కూడా అట్టిదే.

ఇందలి శ్లేష

ఇక్కడొక శ్లేషార్థం ఉంది. పదం అంటే పాదము, లేదా కాలు అని కదా! షట్పది యనగా ఆరు కాళ్ల జంతువు.

ఆరుకాళ్లుండడమేమిటి? ప్రశ్న క్రొత్తగా ఉందే! మనిషికి రెండు కాళ్లే కదా! జంతువునకు నాల్గు కాళ్లు కదా! ఎనిమిది కాళ్లున్న జంతువూ ఉంది.

(శరభం) పాముకి కాళ్లేలేవు. జెర్రిని శతపది అంటారు. అయితే ఆరుకాళ్ల జంతువేమిటి?

అదే తుమ్మెద. అదే షట్పది. షట్పదిస్తోత్రం దానికి చెందింది.

ఆరు పదములు లేక శ్లోకాలున్న స్తోత్రమేమిటి? ఇందలి శ్లేష ఏమిటి? దీనిని ఏడవ శ్లోకంలో శంకరులు వివరించారు. మొట్టమొదట చెప్పలేదు. మనలో ఉత్సాహం రేకెత్తించడానికి ముందు చెప్పలేదన్న మాట. ఎందుకీ నామకరణం చేసారో చివర పేర్కొన్నారు. సాహిత్య విద్యార్థులు భక్తి సాహిత్యంతో పరిచయమున్న వారికి తెలుసు.

మొదటి శ్లోకంలో మనం ఎట్లా ప్రార్థించాలో దేనిని ప్రార్థించాలో వివరించారు.

దేనికోసం ప్రార్థిస్తాం?

దేని కోసం ప్రార్థించాలి? ఇందనేక అభిప్రాయభేదాలున్నాయి.

మనం బ్రతికేలోకంలో ఎన్నో బాధలు, సమస్యలు, మానసికమైన ఒత్తిళ్లు, శారీరక రోగాలు, మనస్తాపాలు, ఆర్థిక సమస్యలు మొదలైన ఎన్నింటితో బాధపడుతున్నాం. నివారణోపాయాలను వెదుకుతున్నాం. ఒంట్లో బాగాలేకపోతే వైద్యుణ్ణి సంప్రదిస్తాం. డబ్బుకి ఇబ్బందియైతే అప్పులిచ్చే వాని దగ్గరకు, అట్లాగే కొన్ని పనులకై ప్రభుత్వోద్యోగుల వద్దకూ ఇట్లా వెడుతూ ఉంటాం. ఇట్లా వెడుతూ బాధల నుండి విముక్తుణ్ణి చేయవయ్యా అని భగవానుని వేడుకొంటాం. పై వారందరూ మనపట్ల దయచూపించేటట్లు అనుగ్రహించుమని ప్రార్థిస్తాం. వైద్యుడు మనలను పరీక్ష చేసి మందులు వ్రాసి ఇస్తాడు. అవి పనిచేస్తాయో లేదో తెలియదు. అపుడు దేవుడు గుర్తుకు వస్తాడు. పనిలో అప్రయత్నంగా ఆపద రావచ్చు. అట్టివి లేకుండా చూడుమని వేడుకొంటాం.

ఇట్లా ప్రతి విషయానికి భగవంతుణ్ణి ప్రార్థించడం సబబుకాదని కొందరంటారు. ఇంకా ఏమంటారో వినండి. మన గతకర్మల వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. మనం అనుభవించడానికే ఈ కష్టాలనిస్తున్నాడు. అంటే మనం అనుభవించడం వల్ల కర్మ ఫలాలను తగ్గిస్తున్నాడు కూడా. అతనికి ఏమి ఇయ్యాలో తెలుసు. ఎప్పుడు ఎంత, ఏమి ఇయ్యాలో తెలుసు. కనుక ప్రత్యేకంగా మనమేమీ అడుగనవసరం లేదని అంటారు. అతణ్ణి స్మరిస్తేనే ఆనందం కల్గుతోంది కదా! అది చాలు. భక్తి యొక్క ఫలం తృప్తియే కదా! అది భక్తి మార్గంలో ఉంది కదా! చిన్న చిన్న కోరికలకు ఈ భక్తిని వినియోగించడం ఏమిటి? అధికానందం మన లక్ష్యం కదా. కనుక అదిచేయి, ఇది చేయి అనడం కంటే మన చిత్తశుద్ధికై ప్రయత్నించాలని సుదీర్ఘోపన్యాసం ఇస్తారు.

అయితే భగవానుని అభిప్రాయమేమిటి?

గీతలో ఈ విషయమై భగవానుడు చెప్పాడు.

చతుర్విధాః భజంతే మామ్ జనాః సుకృతినోఽర్జున

ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ.

అనగా నాల్గు రకాల వారు నన్ను భజిస్తారు. ఎవరువారు? ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని.

ఎవడు దుఃఖంతో బాధపడుతూ ఉంటాడో వాడు ఆర్తుడు. అతనికి మానసిక తాపం, శారీరక బాధలుండవచ్చు. అనగా రోగం, బాధ, దారిద్ర్యం, అంతుచిక్కని సమస్యలు, ఒత్తిళ్లు – ఈ బాపతు బాధలు పడేవాడు ఆర్తుడు. ఈ బరువును దింపవయ్యా అని ప్రార్థిస్తాడు.

రెండవవాడు జిజ్ఞాసువు అనగా జ్ఞానాన్ని కావాలనేవాడు. జ్ఞానమనే విత్తులు వేసినవాణ్ణి ప్రార్థిస్తాడు. జ్ఞానమనే పాలనిచ్చేది అమ్మవారు. ఆర్తుని

మాదిరిగా జ్ఞానమనే పాలనొసగుమని ప్రార్థించవచ్చు. లేదా భగవానుని కల్యాణ గుణాలను చింతించ వచ్చు. మన మనస్సునకు పట్టు తప్పకుండా చూసేవాడు భగవానుడు. ఇట్టి చిత్త ఏకాగ్రత కోసం శంకరులు అనేక ఉపాసనలను సూచించారు. నాకు జ్ఞాన మిమ్మని జిజ్ఞాసువు వేడుకోనవసరం లేదు. భగవంతుణ్ణి చింతిస్తూ హాయిగా ఉంటాడు. అతని మనస్సునకు ఏకాగ్రత సిద్ధించే వరకూ నిర్గుణ బ్రహ్మంలో లీనం కావడానికి ప్రయత్నిస్తాడు. చివరదశలో జీవాత్మ, పరమాత్మలో లీనమౌతుంది. చివర దశలో పూజలేదు, ధ్యానమూ ఉండదు. అట్టి స్థితికై జిజ్ఞాసువు ప్రయత్నిస్తాడు. అతనికి కావలసినది పరమార్థ సత్యం.

ఇక మూడవవాడు అర్థార్థి, అర్థం అంటే డబ్బు కదా! దాని వల్ల కూడా ఆర్తుడు బాధ పడతాడు. అయితే అర్థార్థియని ఎందుకన్నారంటే బీద తనంతో బాధపడుతున్నాడని కాదు. సాదాసీదా జీవనానికి ఇతనికేమీ ఇబ్బంది యుండదు. అయినా తృప్తి పడకుండా ఇంకా ఎక్కువ సౌఖ్యాలు కావాలని వెంపర్లాడుతూ ఉంటాడు. ఒక్కొక్క ఉద్యోగి, ఉన్నత ఉద్యోగం రావాలని కోరుతాడు కదా! సబ్ కలక్టర్, కలక్టర్ కావాలని కోరడా? కనుక అర్థం అంటే కేవలం డబ్బే కాకుండా అధికారం, గౌరవం, కీర్తి మొదలైన వాటిని అపేక్షిస్తాడు అర్థార్థి. అది ఏ కోరికైనా కావచ్చు.

నాల్గవ వాడు జ్ఞాని. ఇతడూ పూజిస్తాడు. జ్ఞానియైన వానికి భగవానుడని, భక్తుడని లేదా లేదు. జ్ఞాని, పరమార్థంలో మునిగిపోతాడు. అపుడు పూజ లేదు, ధ్యానమూ లేదు. అయితే ఇతణ్ణి కూడా భక్తుడని భగవానుడెందుకన్నాడు? అయితే జ్ఞాని, నిరంతరం నిర్వికల్ప సమాధిలో ఉండిపోతాడా? అసలు ప్రపంచాన్ని పట్టించుకోడా? ప్రపంచాన్ని పట్టించుకోనట్లు ఇతరులకు కనబడతాడు, లేదా పట్టించుకొంటాడు. ప్రపంచం ఉందని అతనికి తెలిసినా నిర్గుణ బ్రహ్మానుభవం అతనికి నిరంతరమూ ఉండనే ఉంటుంది.

బ్రహ్మము యొక్క లీలను చూసి ఆనందిస్తాడు. సగుణ రూపంలో ఉన్న అతని క్రీడను చూసి ఆనందిస్తాడు. అతని స్థితిని "వాసుదేవః సర్వమితి" అని చెప్పాడు. అనగా చరాచర వస్తు ప్రపంచంలో భగవంతుణ్ణి వీక్షిస్తాడన్న మాట. ఇట్లా నామరూపాలతో ఉన్నాడని సంతోషిస్తాడు. శంకరులీ స్థితిని "నందతి నందతి నందత్యేవ" అని మూడుసార్లన్నారు. పరమాత్మరసాన్ని అన్నిటిని చూసి గ్రోలుతాడు. అట్టివాడు సమాధిలో ఉన్నా, మరల ప్రపంచంలోకి అడుగుబెట్టినా రెండు స్థితులకూ భేదాన్ని చూడడు. నారాయణుడే, వాసుదేవుడే అన్నిటా ఉన్నాడనే స్ఫురణతో ఉంటాడు. లోనున్న వాడే బయటా ఉన్నాడనే భావమది.

జ్ఞాని పొందవలసిందంటూ ఏమీలేదు. దేని కోసమో ప్రార్థించ నవసరం లేదు. ఏ కోరిక లేకుండా భగవానుణ్ణి భజిస్తాడు. ప్రేమిస్తాడు. ఇదే పరాభక్తి. స్వచ్ఛమైన భక్తి. దీనిని అహైతుకీ భక్తియని పిలుస్తారు. శుకుడంతటి వాడే కొనియాడాడు. అంటే ఏ కారణమూ లేని భక్తి. ఎవడైనా అతనిపై కత్తినెత్తినా, రక్షించుమని ప్రార్థించడు. నేను శరీరాన్ని కాను, ఆత్మనే అనే భావంతో ఉంటాడు. అట్టి దశలోనూ పరిపూర్ణ ప్రేమతో ఉంటాడు. వేడి కోల్లుందవు సుమా!

ఇటువంటి భక్తి ఎక్కడుందని ప్రశ్నిస్తాం. సమస్యలను తరిమేయమని ప్రార్థించే ఆర్తుడెక్కడ? అన్నీ ఉన్నా ఇంకా కావాలనే అర్థార్థి ఎక్కడ? అట్టి స్థితిని భక్తియని పిలుస్తామా?

ఆర్తుడు, అర్థార్థి ఒక తరగతికి చెందిన వారైతే; జిజ్ఞాసువు, జ్ఞాని మరొక తరగతికి చెందినట్లుగా ఉంటారు. అయితే ఆర్తుడు, అర్థార్థి తనను భజిస్తారని అన్నాడు కదా! అంతే కాదు, ఈ నల్గురిని ప్రశంసించాడు పరమాత్మ. వీరిని సుకృతినో జనాః అన్నాడు. అంటే పుణ్యాత్ములుగానే పరిగణించాడు. వీరు కీర్తింపదగినవారని కితాబు ఇచ్చాడు.

ఉదారాః సర్వ ఏవైతే. ఎందుకిట్లా అన్నాడు. జ్ఞాని, జిజ్ఞాసువులతో బాటు అర్థార్థిని, ఆర్తుణ్ణి ఎందుకు ప్రశంసించాడు?

జీవిత సుఖాలనడగడంలో తప్పులేదు

తొంభై బాధలున్నాయి. వీటిని విస్మరించడం మంచిదే. ఇట్లా సమస్యలతో ఉండడం అతని సంకల్పమేమో అనుకోవడమూ మంచిదే. అట్లా ఉంటూ భరించడము చేయవలసిందే. ఇట్లా అందరూ ఉండగలరా? మాయ మనలను గుప్పిట్లో పెట్టుకొని ఉంది. ఈ జగత్తు సత్యమని, మన శరీరాలు నిత్యమని భావిస్తూ ఉంటాం. మన కోరికలు తీరకపోతే బాధలు పడడమూ మామూలే కదా! అట్లా బాధపడకుండా ఉండడము మంచిదే. మాయను మాయగా అర్థంచేసికొని జీవించాలి. ఒకనాటికైనా నిస్సంగత్వం రావద్దా? దానికై మనం ఇప్పటి నుండి ప్రయత్నం చేయవద్దా? ఆ మాటలట్లా ఉంచితే ప్రస్తుతం బాధపడడం నిజమే కదా! సమస్యలు లేనివాడు లేడు. ఒక ముల్లు గుచ్చుకుంటే కుయ్యో అననివాడు లేడు. రోగం వచ్చినా, అవమానం జరిగినా, కార్యాలయంలో చికాకులున్నా బాధపడక తప్పుతోందా? సంసారాన్ని సాకవద్దా?

పొందవలసిన దానిని పొందకపోతే నిరుత్సాహపడమా? ఎంత మనస్సును సముదాయించుకొన్నా, అంతా మన కర్మ అంటూ తిట్టుకొన్నా ఏదో మనలను ఊరకే కూర్చోనీయదు. అన్నిటికీ పరిష్కారం కావాలి. దానికై వెదుకుతాం. ఏదో ఒక అతీతశక్తి యుందని నమ్ముతాం. సృష్టి, స్థితి, సంహారకర్త్రి స్మరిస్తాం. జీవుల కర్మలకు అనుగుణంగా ఫలాలనిచ్చినా అతడు దయామయుడని నమ్ముతాం.

మన తప్పులను క్షమిస్తాడని, అతడు దయాసింధువని కీర్తిస్తాం. మహాత్ములూ అట్లా కీర్తించినవారే. పాటలూ, పద్యాలూ వ్రాసినవారే. ఈ మాయయనే వలలో పడవేసింది అతడే కదా! అటువంటప్పుడు ఈ బంధాన్ని త్రెంపవయ్యా అని అడగడంలో తప్పేముంది! ఇట్లా సమర్థించుకోవడం ఒక అభిప్రాయం.

జరిగేది, జరుగుతుంది, మనకేల యనే నిర్లిప్త భావంతో తామరాకు మీద నీటి బొట్టు మాదిరిగా ఉండేవారు కొందరే ఉంటారు. నూటికి 99 మంది బాధలు పడేవారే. బాధలనుండి తప్పించుమని ప్రార్థించేవారే అందరూ. అతడు దయా సముద్రుడు కనుక ఏనాటికో ఒక నాటికి ప్రేమామృతాన్ని వర్షించకపోడనే విశ్వాసంతో ఉంటారు.

ఇంకా ఏమంటారో చూడండి, ఈ శరీరాన్ని, సంసారాన్ని ఇచ్చాడు. దీనిని జాగరూకతతో కాపాడుకోవడము మనవంతే. రోగం వస్తే వైద్యుని దగ్గరకు వెళ్లడం లేదా? డబ్బులేకపోతే అప్పిచ్చే వాణ్ణి అడగడం లేదా? అట్లాగే భగవంతుణ్ణి అడిగితే తప్పేమిటి? నీ మీద జాలిచూపించి ఇతరులు నీకు సాయం చేయడం చేసేవాడూ భగవానుడే కనుక నీలో పరిపక్వత వచ్చినపుడు ఇతరుల కాళ్ల మీద పడదానికి బదులు ఆ పరమేశ్వర పాదాలనే పట్టుకోవచ్చు కదా! అని ఇతరులితనితో అంటారు.

మనంతట మనమేమీ సాధించలేం. అంతా ఈశ్వర శక్తియే అనే మాట వినబడుతోంది. అట్లాగే అర్తుడు భగవానుని పట్ల ఉంటాడు. అట్లా ప్రార్థించడం తప్పుకాదు కదా! ఆ దశలో భగవానుణ్ణి గుర్తిస్తున్నాడు కనుక అట్టి వానిని అనగా ఆర్తుణ్ణి, సుకృతియే అని అన్నాడు గీతాకారుడు.

ఇట్లా మనకంటే అతీతమైనది ఒకటుందని, అతని దయలేకపోతే ఏమీ సాధించలేమని భావించగలిగితే వినయవంతుడైతే అట్టి ధోరణి ప్రశంసింపదగిందే కదా. మనకంటే అతీతమైన, అనంతమైన శక్తిని ప్రార్థించడంలో తప్పులేదు. ధర్మానికి విరుద్ధం కాని కామాన్ని నేను అని గీతలో అన్నాడు పరమాత్మ.

ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ అటువంటప్పుడు అధార్మికమైన కోరికలు మాత్రం కోరకూడదు. సబబైన వాటిని భగవానుడంగీకరిస్తాడు.

అయితే అర్థార్థిని గురించి ఏం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. అతడు కావలసిన దాని కంటే ఎక్కువగా కోరేవాడు కదా! అతణ్ణి భక్త గణంలో చేర్చడం సబబుగా ఉందా?

సాదాసీదా జీవనం గడుపుతూ అవసరానికి మించకుండా జీవించాలని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. దీనినే విపులార్థంలో అపరిగ్రహమన్నారు. అటువంటప్పుడు అవసరానికి మించి ప్రయత్నించడం, దానికై భగవానుని కోరడమూ తప్పే. అతడు లోభి అవుతాడు. అటువంటి వాణ్ణి భక్తులలో ఎందుకు చేర్చారని శంక.

డబ్బు ఉండడం వల్ల కేవలం భోగాలను అనుభవించడమే కాదు. దానితో అనేక దానధర్మాలు చేయవచ్చు. జీర్ణాలయాలను ఉద్ధరించవచ్చు. విద్య, వైద్యాలయాలు నిర్మించవచ్చు. అట్లాగే అనాథాశ్రమాలు, వేద విద్యా పోషణ - ఇట్లా ఎన్నో పనులను చేయవచ్చు. వీటినంతటికీ డబ్బు కావాలి కదా! దయాగుణం వల్ల ధనవంతులే నిర్వహించగలరు. డబ్బును తానువాడుకోవడమే కాక సంఘానికి వెచ్చించాలని భావించిన అర్థార్థి భగవానుని ఎక్కువ డబ్బు కోసం అర్థించడాన్ని తప్పుపట్టలేము. అట్టి ప్రార్థనను భగవానుడు ఆలకించడా?

పూర్వకాలంలో వర్ణాశ్రమ ధర్మాలు పాటింపబడే సమయంలో బ్రాహ్మణునకు అపరిగ్రహాన్ని, సముద్ర యానాన్ని నిషేధించాయి శాస్త్రాలు. అదే శాస్త్రము, వైశ్యుణ్ణి సముద్రయానం చేయవచ్చని చెప్పింది. కారణం ఏమిటి? వర్తకాదులు చేసి సంపాదించిన డబ్బును సంఘ కార్యక్రమాలకై వినియోగించేవాడు. కొంత అనుభవిస్తూ ఉండవచ్చు. దానధర్మ బుద్ధి, పెరిగిన కొలదీ విందులు వినోదాలను తగ్గించి యుండే వారు. అంతేకాదు, ఎవరికైనా ఒక కారు ఉన్నా, విశాలమైన భవంతి ఉన్నా మిగిలిన వారికి వినియోగించే అవకాశమూ ఏర్పడుతుంది కదా!

ప్రతి వ్యక్తి జ్ఞాని, జిజ్ఞాసువు కాకపోవచ్చు. ఆర్తుడు, అర్థార్థులే ఇంచుమించుందరూ. ఉన్నవారిలో భగవద్భక్తి యుంటే ప్రశంసింపదగిందే. ముందుగా అట్టివారు డబ్బుకోసం ప్రాకులాడినా క్రమక్రమంగా కోరికలు తగ్గించుకొని జ్ఞాన వైరాగ్యాలు కల్గించమని ప్రార్థిస్తారు. బాధలను, రోగాలను

పట్టించుకోని పరిస్థితి వారికి వస్తుంది. కనుక భౌతిక ప్రయోజనాలు నెరవేరాలని ప్రార్థించడంలో తప్పులేదు.

శంకరులు సౌందర్య లహరిలో చిట్టచివర శ్లోకంలో సరస్వత్యా, లక్ష్మ్యా అని ఉంది. దాని వల్ల అమ్మ వారు జ్ఞానాన్ని, ధనాన్ని మంచి రూపాన్ని ప్రసాదిస్తుందని ఉందికదా! చివరకు వాటిపై మోజును పోగొట్టేది అమ్మవారని, పరమానందాన్ని స్తుందని చెప్పబడింది కదా! కనుక ఒక దశలో పరిమితిని మించకుండా ఫలానాది కావాలని కోరడంలో తప్పులేదు. ఏదో కావాలని కోరడానికే భగవంతుని పట్ల భక్తిని చూపించినా క్రమక్రమంగా ఆత్మాభివృద్ధికి దోహదం చేస్తుంది.

నెరవేరని ప్రార్థన - నాస్తికత

ప్రార్థన చేసినంత మాత్రంచే అన్ని కోరికలూ నెరవేరుతున్నాయా? నెరవేరాలనే నియమం లేదు. కొన్ని తీరుతాయి. కొన్ని తీరవు. తీరనంత మాత్రంచే స్మరించకుండా ఉండకూడదు కూడా. నెరవేరకపోయినా భక్తిని కొనసాగించవలసిందే. భక్తి వల్ల కలిగే ఆనందాన్ని రుచి చూస్తాడు సాధకుడు.

రకరకాల కోరికలతో నా దగ్గరకు చాలా మంది వస్తారు. పిల్లలకు పెళ్లి, ఉద్యోగం, రోగ నివృత్తి, న్యాయస్థానంలో విజయం – ఇట్లా వందల కొద్దీ కోరికలకై అన్ని ప్రార్థనలు సఫలమౌతున్నాయా? కావు. అయినా మాతో అనుబంధం, గౌరవం తగ్గిపోవు. నెరవేరకపోయినా వస్తూ ఉంటారు. అట్లాగే కోరికలు నెరవేరనంత మాత్రంచే భగవానుని విస్మరించడం సబబు కాదు.

కోరికలు నెరవేరకపోతే కొందరు నాస్తికులైపోతారు. సహజంగా నాస్తిక భావంతో ఉండేవారు కొందరు, పై బాబతు నిరుత్సాహంతో పూర్తిగా నాస్తికులౌతారు. మామూలు కోరికలపై భక్తిని చూపించినా అది పూర్తిగా నశించదు. వారి భక్తి పరిపక్వం కాకపోవచ్చు. కాని సమూల నాశనం మాత్రం కాదు.

అందుకే పరమాత్మ ఏమన్నాడు? ఆర్తునిగా, అర్థార్థిగా వచ్చినా ఫరవాలేదు. జిజ్ఞాసువు, జ్ఞానికాక పోవచ్చు. ఏదో కారణం వల్ల నన్ను నమ్మావు కదా! అది చాలని ఆర్తుణ్ణి, అర్థార్థిని చేరదీసాడు.

ఆత్మశ్రేయస్సుకై ప్రార్థన

నాకే కోరికలు లేవు, నేను దేనికీ ప్రార్థించనవసరం లేదనే దశ వచ్చినా ఆత్మ శ్రేయస్సుకై తప్పక ప్రార్థించాలి. ఆత్మాభివృద్ధికి ఏది కావాలో భగవానునకు తెలుసు. సరియైన సమయంలో అనుగ్రహం చూపిస్తాడు. అడుగకపోయినా కృపావర్షాన్ని కురిపిస్తాడు. అయినా మన సమస్యలను ఏకరువు పెడితే మనకొక మానసిక తృప్తి ఏర్పడుతుంది. దేనికోసం ప్రార్థించాలో, ఏ అర్హతలుంటే ప్రార్థన సఫలమౌతుందో మొదటి శ్లోకంలో శంకరులు వివరించారు. ఆత్మ శ్రేయస్సునకు మొదటి మెట్టును సూచించారు.

శంకరులు, సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రంలో రోగ విముక్తికై పత్ర విభూతి మహిమను కొనియాడారు. అక్కడ ఆర్తుడు, భక్తినెందుకు చూపిస్తాడో సూచించారు. కనకధారాస్తవంలో మహాలక్ష్మిని మేఘాలు వర్షం కురిపిస్తున్నట్లుగా, సంపదను దరిద్రంతో బాధపడే స్త్రీకి, ఇమ్మని ప్రార్థించారు. ఇక్కడ అర్థార్థి ప్రస్తావన వస్తుంది. ద్రవిణాంబుధారాం అన్నారు.

షట్పదీస్తోత్రంలో ఆర్త, అర్థార్థులను ప్రక్కనపెట్టి జిజ్ఞాసువెట్లా ప్రార్థించాలో సూచించారు. జ్ఞానానికై అన్వేషించువాడే కదా జిజ్ఞాసువు.

జ్ఞానానికి విష్ణువును కూడా

విష్ణువు, జగద్రక్షకుడు కదా! అతడు ఆర్త, అర్థార్థుల పని చూచుగాక! అంతమాత్రంచే జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించడా? అది అతని పని కాదా? అద్వైతులు ముందుగా బ్రహ్మ విద్యా సంప్రదాయ ప్రవర్తకులకు నమస్కరిస్తారు

కదా! వారి స్తుతి, "నారాయణం పద్మభువం"తో ప్రారంభమౌతుంది. ఆయన లోకపాలకుడైనా తత్త్వ జ్ఞానాన్ని అందించేవాడూ ఆయనే. అందుకే ప్రార్థించాలి.

ఎందుకిట్లా అన్నారు? లోకంలో శివుడు జ్ఞానాన్ని, మోక్షాన్ని ప్రసాదిస్తాడని, ప్రాపంచిక విషయ తృప్తికై విష్ణువును భజించాలనే దురభిప్రాయం లోకులలో ఉంది. అట్టిది కాదని భక్తులలో ముందుగా చిత్తశుద్ధిని కల్గించుమని మొదటి శ్లోకంలో ప్రార్థించారు. అతడు ఇహపరాలను, భోగ జ్ఞానాలను ప్రసాదిస్తాడని అన్నారు. మొదటి శ్లోకంలో జ్ఞానం కలగడానికి సాధనలను చెప్పారు. ఈ స్తోత్రంలోనే కాదు, అనేక స్తోత్రాలలో విష్ణువును జ్ఞానదాతగా నుతించారు. భజగోవింద స్తోత్రంలో గోవిందుణ్ణి నుతించలేదా? "హరిమీడేస్తవం" అంతా అద్వైతానికి చెందిందే కదా! అందు ప్రతి శ్లోకం చివర తం సంసారధ్వాంత వినాశం హరిమీడే అని ఉంటుంది. అనగా సంసారమనే చీకటిని పోగొట్టేవాడని నోరార కీర్తించారు. ఇంకా అనేక ఉదాహరణలను చూపించవచ్చు.

మనస్సును సరిదిద్దడానికై

మనస్సును సరిదిద్దకపోతే ఎవరికీ సుఖశాంతులుండవు. అందుకై మొదటి శ్లోకం వ్రాయబడింది. సుఖ శాంతులు లేకపోతే మిగిలేది దుఃఖం, బాధలు, కన్నీళ్లు, సంశయాలే. భోగాలు లేకపోయినా మనస్సు ఆందోళన చెందకపోతే అన్ని అతనికి ఉన్నట్లే కదా! అట్లా ఉన్నవాడు సదానందంతో ఉంటాడని అప్పర్ స్వామి కీర్తించాడు. అంతా ఆనందమే, దుఃఖం అణుమాత్రం లేదని అన్నాడు.

మనస్సు ఏం చేస్తుంది? అది కావాలి, ఇది కావాలి, ఉన్నవి సరిపోవని, ఇంకా కావాలని పరుగులు పెడుతూ ఉంటుంది. ఎప్పుడూ అసంతృప్తే. ఏదైనా వచ్చినా ఊరుకొంటుందా? ఇంకా క్రొత్త కొత్తవి రావాలి. ఎప్పుడు

కోరిక, అసంతృప్తి ప్రబలిందో ఇక శత్రుత్వం, ఈర్ష్య, దుఃఖం వెంటవెంటనే అనుసరిస్తాయి. అంటే కోటీశ్వరుడైనా మహా విద్వాంసుడైనా తృప్తి పొందడంలేదు. శాంతములేక సౌఖ్యము లేదని త్యాగరాజ స్వామి వారు అనలేదా? కనుక అశాంతస్యకుతస్సుఖం అని కృష్ణుడు అనలేదా? గీతలోని మాటలనే గుర్తుంచుకొని త్యాగరాజు ఆ కీర్తనను వ్రాసి ఉంటాడు. ఇద్దరూ, తృప్తి పడని మనస్సున్న వానికి శాంతి లేదని ఘోషించారు.

చూడడానికి పాత్ర నిగనిగలాడుతూనే ఉంటుంది. దానికి చిల్లులుంటే అమృతం పోసినా నేలపాలు కావలసిందే. అట్లాగే పైపై చూడడానికి బాగున్నా లోపల అసంతృప్తి, క్రోధం, ఈర్ష్య, కన్నీళ్లు అనే చిల్లులుంటే సుఖమెక్కడ? ఈ గుణాలు కంటికి కనిపిస్తాయా? కనుక సుఖామృతం వీడికి దక్కదు.

అందువల్ల దుష్టభావాలు, అపవిత్రాల నుండి దూరం చేయుమని, పవిత్రునిగా తీర్చి దిద్దుమని ముందుగా ప్రార్థించాలి. దీనికోసం ముందుగా భగవానుని ఎట్లా ప్రార్థించాలో సూచించారు:

అవినయ మపనయ విష్ణో
దమయ మనః శమయ విషయ మృగతృష్ణాం
భూతదయాం విస్తారయ
తారయ సంసార సాగరతః

ముందుగా అవినయాన్ని పోగొట్టుమన్నారు. వినయానికి విరుద్ధం అవినయం. వినయం; నమ్రత, మర్యాద, గౌరవాన్ని సూచిస్తుంది. అవినయం, దానికి విరుద్ధం.

ఉపనయమని మాట వింటాం. దగ్గరగా చేర్చునదని అర్థం. యజ్ఞోపవీతం వేసి గురువు దగ్గరకు తీసికొని వెడతారు. అనగా దగ్గరగా తీసికొని వచ్చేది ఉపనయనం. దీనికి విరుద్ధం అపనయనం. అంటే ఉన్న దానిని తొలగించుట. ఏమిటి తొలగించుట? అహంకారం, పొగరు మోతుతనం మొదలైన లక్షణాలను తొలగించాలి. ఇట్టి దానిని తొలగించుమని అర్థం. ఇది ఈ స్తోత్రానికి మొదలు.

అవినయమపనయ విష్ణో – భగవానుని హేవిష్ణో అని సంబోధించారు. అందరి దోషాలను తొలగించుమని ప్రార్థించలేదు. తనలో ఉన్న దోషాలను తొలగించుమని అన్నట్లుగా ఉంది. తనలో దోషాలా! లోకుల దోషాలా అని స్పష్టంగా చెప్పకుండా అవినయాన్ని పోగొట్టుమని అన్నారు.

అవినయాన్ని పోగొట్టుమంటే వినయాన్ని కల్గించుమని అర్థమే కదా! మనలో కావాలసినంత అవినయం ఉంది. అంటే లేనిది కాదు, ఉన్న అవినయాన్ని తొలగించుమని అర్థం.

వినయం - మహోత్తమగుణం

ఈనాడు సంప్రదాయం, సంస్కృతి వంటి పదాలను వాడుతున్నాం. ఇన్ని మాట్లాడుతున్నా ఎవ్వడూ వినయాన్ని గురించి ప్రస్తావించడు. పూర్వకాలంలో దీనికే అధిక ప్రాధాన్యమిచ్చారు. ఆంగ్లంలోని Culture (సంస్కృతికి) తమిళంలోని 'కల్వి'కి (విద్య)కి ఎంతో సంబంధం ఉంది. రెండు పదాలలోనూ 'కల్' ఉంది. అంటే విద్యావంతులు, సంస్కృతీ సంపన్నులన్న మాట వస్తుంది. విద్య అంటే కేవలం చదువు కాదు. ఏదో వ్రాసే నేర్పు, చదివే నేర్పు అని కాదు. మంచి విషయాలను గ్రహించేది. విద్య అదే. విద్య యొక్క లక్షం వినయమే. (విద్య నొసగును వినయమని తెలుగులో పద్యం). అంటే నేను చదివిన దాని కంటే ఇంకా చదవాలని అనడమే. అంతేనే కాని నేను సర్వజ్ఞుడనని విఱ్ఱవీగడం కాదు.

ఆనాడు శిష్యుడు గురువుల పట్ల వినయంతో ఉండేవాడు. అంతేకాదు, విద్యపట్ల, భగవానునిపట్ల అన్నిటి పట్ల వినయంతో శోభిల్లేవాడు. అందువల్లనే చివరకు ఆత్మవిద్యలో ఉత్తీర్ణుడయ్యేవాడు. ఆనాటి గురుకుల వాసంలో కొన్ని ఇండ్లకు వెళ్లి భిక్షనడిగి తెచ్చుకొనుట ఉండేది. భవతి భిక్షాం దేహి అనే వాడు. ఈ బిచ్చమెత్తడం మహారాజు కుమారుడైనా చేయవలసిందే. అంటే చిన్నప్పటి నుండి వినయాన్ని నేర్పేవారు.

గురువు, ఆత్మ గుణాలతో శోభిల్లే వాడు. అతడు శిష్యులకు ఆదర్శప్రాయంగా ఉండేవాడు, కేవలం చదువు చెప్పడమే కాదు. కాని ఈనాడు చేదలోనూ చిల్లులున్నాయి. నీరుతోడే త్రాడూ చివికిపోయింది.

అట్లాగే రాజు ప్రజలలో వినయాన్ని కల్గించాలట. వారికి సౌకర్యాలు సంకల్పించడంతోనే అతని పని పూర్తి కాదు. ముందు వినయం, తరువాత రక్షణం, వృత్తులకు భంగం లేకుండా సుఖశాంతులతో ప్రజలు జీవించడానికి దోహదం చేయడం అతని విధులు. దేశవిదేశాలనుండి రక్షించుట రక్షణం. వీటికి ముందు వినాయాధానముంది. అనగా వినయము నుంచుట. ఎట్లా? సరియైన విద్య, మంచి సలహా, భగవానుని పట్ల భక్తి ప్రపత్తులతో నుండుట వల్ల వినయం ప్రాప్తిస్తుంది.

వినయం, ఎన్నో గుణాలతో కూడియుంది. నమ్రత, ఇతరుల పట్ల గౌరవం, తిన్ననైన నడక, దయ, క్రోధరాహిత్యంతో కూడినది. అవి ఉంటేనే విద్య యొక్క లక్ష్యం నెరవేరినట్లు.

అందువల్ల శిష్యుణ్ణి వినేయుడనే వారు. వినయం కలిగినవాడు వినేయుడు. శిష్యపదం కంటే దీనిని ఎక్కువగా వాడేవారు.

శంకరులు - శిష్యులు - నమ్రత

పద్మపాదుడు, తన గురువైన శంకరులపై ఒక శ్లోకం వ్రాసేడు. యతః వక్త్ర మానససారఃతో అనే దానితో ఆరంభమవుతుంది. దాంట్లో వినేయభృంగాః అని వస్తుంది. ప్రస్తుతం మనకిది కావాలి.

శంకరుల మనస్సు ఎలా ఉంది? అది విస్తారంగా, స్వచ్ఛంగా, చల్లగా ఉందట. అనగా మానస సరోవరంలా ఉంది. మనం మనస్సును చూడలేం. ముఖాన్ని చూడగలం. మనస్సునకు అద్దంవంటిది మనస్సని ఆంగ్లంలో సామెత. "Mind is the mirror of Mind. Face is the index of the Mind" అని కూడా ఉంటారు. సాధారణంగా మనస్సులో దాగిన వాటిని వ్యక్తీకరించకుండా

ఉంటాం. శంకరుల వంటి మహాపురుషుల మనస్సు వారి ముఖంలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. మానసిక సౌందర్యాన్ని చూపే అద్దాల వంటివి ముఖాలు. కనుక శంకరుల మనస్సు స్వచ్ఛంగా ఉన్నట్లే వారి ముఖమూ స్వచ్ఛంగా ఉంటుంది. అది ఎట్లా? మానస సరోవరంలా. సరస్సుంటే అందు పద్మాలుంటాయి. ఆచార్యుల ముఖంలో పద్మమేది? తత్త్వ జ్ఞానం అందించేది, శిష్యుల బాధలను పోగొట్టేది వారి నోరే కదా! పద్మంలో మకరందం ఉంటుంది. నోట్లో మకరందం ఏమిటి? వారి భాష్యాలే మకరందం. మన కోసం భాష్యాలు వ్రాసేరు. భాష్ అంటే మాట్లాడడం. అంతేకాని వ్రాయడం కాదు. సంభాషణం అనే పదం ఉంది కదా! భాష్య ప్రవచనం చేస్తూ ఉండేవారు.

శ్లోకం "యత్రవక్త్ర"తో ఆరంభం. వక్త్రమనగా ముఖం. ముఖం మానస సరోవరం. ముఖంలోని నోరు అనే పద్మం నుండి భాష్యం అనే మకరందం స్రవిస్తూ ఉంటుంది. అయినా శ్లోకంలో ముఖాన్ని సరస్సుతో, పద్మాలనుండి వెలువడే మకరందంతో భాష్యాలను పోల్చారు. ముఖం మానస సరస్సు, భాష్యాలు మకరందం అనుట తిన్ననైన పోలిక. నోటిని సరస్సులోని పద్మమని తిన్నగా అనలేదు. భాష్యాలను అరవింద మకరందమన్నారు. నోరు, పద్మమని మనం ఊహించేటట్లు వ్రాసేరు. దీనికొక కారణాన్ని ఊహిస్తున్నాను.

సంస్కృతంలో తమిళంలో చెప్పుకోదగింది ఒకటుంది. నోరునకు ప్రత్యేకంగా పదం లేకపోయినా ముఖం, వక్త్రం, వదనం, ఆననం, ఆస్యం మొదలైన మాటలు ముఖాన్ని, నోరునూ సూచిస్తాయి. తమిళంలో నోటికి ప్రత్యేక పదం ఉంది. ముఖానికి ప్రత్యేక పదం లేదు. ముఖం, సంస్కృత పదం. తమిళంలో మూంజి అనేది వ్యవహారంలో ఉంది కాని సాహిత్య భాషలో లేదు. కనుక సంస్కృతానికి నోరులేదు, తమిళానికి ముఖం లేదు.

అందువల్ల పూర్వకాలంలో ఘటికాస్థానాలలో పిల్లలు చదువు కొనేటపుడు సరదాగా ఇట్లా ఒకర్ని ఒకరు వేళాకోళం చేసుకొంటూ ఉండేవారు. తమిళ

విద్యార్థి సంస్కృత విద్యార్థిని నోరులేని వాడా అనేవాడు. సంస్కృత విద్యార్థి, తమిళ విద్యార్థిని ముఖం లేని వాడా అని తిట్టేవాడు.

వక్త్రం అంటే ముఖమని, నోరని రెండు అర్థాలు సంస్కృతంలో ఉండడం వల్ల వక్త్రం అనే మాట ముఖం అని వాడినపుడు, మరల దానిని వాడితే పునరుక్తి వస్తుంది. కనుక పద్మపాదుడు మనలను ఊహించుకొమ్మని వదిలేసి యుంటాడు.

ముఖం, కన్నులు, చేతులను, పద్మాలతో కవులు పోలుస్తారు. ముఖాంబుజం, నయన కమలం, పాద పద్మం, కరారవిందం మొదలైనవి. పద్మపాదుడను పేరులోనే పద్మం ఉంది కనుక ఆచార్యుని ముఖాన్ని పద్మంతో పోల్చలేదు. దానికి బదులు మానస సరస్సుతో పోల్చాడు. వారు వినిపించే భాష్యాలను మకరందంతో పోల్చాడు. పద్మమే ముఖమని తిన్నగా చెప్పలేదు. భావగర్భితంగా ఉంచాడు. భాష్యం, కొరకరాని కొయ్య వంటిది. కాని అది మకరందంగా స్రవించడం వల్ల త్రాగడానికి వీలుగా ఉంటుంది. శంకరుల వదనారవిందం నుండి వచ్చింది కనుక, నోరు అనే పద్మం నుండి వచ్చింది కనుక.

వీరి భాష్యాల పరమార్థము, అద్వైతమనే మకరందము. దానిని గ్రోలడానికి తుమ్మెదలు, అనగా శిష్యులు మూగుతారు. ఇక్కడ శిష్యులను, శిష్యులని చెప్పకుండా వినేయులని అన్నారు. అనగా వినయము కలవారనే కదా!

ఈ శ్లోకంలో పద్మము, తుమ్మెదల ప్రస్తావన ఉన్నట్లుగా వీరిని గురించి మరొక శ్లోకమూ అలాగే ఉంది. ఎనిమిది వందల సంవత్సరాల వెనుక ఒక టాతి శాసనంలో ఉంది. అది ఎక్కడ ఉందో విన్నారంటే ఆశ్చర్యపోతారు. చెప్పనా? కాంబోడియాలో.

ఇందులో శంకరులను భగవత్ శంకరులని పేర్కొన్నారు. మనదేశంలో వీరిని భగవత్పాదులని అంటాం. మనకంటే ఒక మెట్టు పై నున్న వారిని

భగవాన్ అంటాం. ఇందులో శంకరుల పాదాలను పద్మంతో పోల్చారు. అంఘ్రి పంకజం అని యుంది. విశ్వంలోని సమస్త విద్వాంసులు వీరి పాదాలపై శిరస్సులు వంచి నమస్కరిస్తున్నారట. శ్లోకంలో నిఃశేషమని ఉంది. వీరి పాదపంకజంపై విద్వాంసుల తలలనే తుమ్మెదలు వ్రాలియున్నాయట.

నిశ్శేష సూరి మూర్ధాళిమాలా లీఢాంఘ్రి పంకజాతః

ముందుగా పద్మపాదులు వ్రాసిన శ్లోకాన్ని వినిపించాను. శంకరుల ముఖాన్నిగాని, పాదాన్ని గాని పద్మంతో ప్రత్యక్షంగా పోల్చకుండా ఉంది. దానికి బదులు పద్మం నుండి భాష్యం అనే తేనె వస్తోందని అన్నాడు. శిష్యులనే తుమ్మెదలు అద్వైతమకరందాన్ని గ్రోలుతున్నాయని అన్నాడు. శిష్యులనుటకు బదులు వినేయులన్నాడు. వినీత వినేయ భృంగాః వినీతుడనగా మంచి అలవాట్లు గలవాడు.

కాంబోడియాలో నిశ్శేష సూరులని ఉంది. విద్వాంసులు తమ శిరస్సులను వచ్చి సాష్టాంగం చేస్తున్నట్లుంది. ఈ తలలు తుమ్మెదలులా ఉన్నాయి. మూర్ధయనగా తల. మూర్ధాళిమాలా = తలలనే తుమ్మెదల మాల.

నోరును పద్మమని చెప్పకుండా పద్మపాదుడు భాష్యమనే మకరందాన్ని పేర్కొన్నాడు. కాంబోడియాలోది పాదపద్మాన్ని పేర్కొని భాష్యమనే మకరందాన్ని విడిచిపెట్టింది. విద్వాంసుల తలలను తుమ్మెదలతో పోల్చి సాష్టాంగం చేస్తున్నట్లు వర్ణించింది. ఎందుకట్లా? భాష్యమనే మకరందాన్ని పీల్చడానికే కదా! భాష్యమనే మకరందం పాదపద్మాలనుండి వస్తోందనడం భావ్యం కాదుకదా! పాదపద్మమనే ఉంది. భాష్యమకరందాన్ని ఊహించు కొనేటట్లు చేసింది.

అప్పయ్య దీక్షితులు శంకరులపై శ్లోకం వ్రాసేరు. **అధిగతభిదాన్ పూర్వా** చార్యానుపేత్య. అందు అద్వైత సూక్తం ఆచార్యుల ముఖ పద్మం నుండి వస్తోందని. అది జనన మరణాల నుండి దూరం చేస్తుందని అన్నారు. సూక్తి = మంచి మాట.

అధిగత భిదాన్ పూర్వాచార్యానుపేత్య సహస్రధా
సరిదివ మహీభాగాన్ సంప్రాప్య శౌరిపాదోద్గతా
జయతి భగవత్పాద శ్రీమన్ముఖాంబుజ నిర్గతా
జనన హరాణీ సూక్తిః బ్రహ్మాద్వైక్య పరాయణా

ఇందు శంకరుల వదనారవిందాన్ని పేర్కొని భాష్యోపదేశం దాని నుండి వస్తోందని అన్నారు. పద్మం నుండి మకరందం కాకుండా ఏది ప్రవహిస్తుంది? అంతే కదా?

పై శ్లోకాలలో ఒకదాంట్లో నోరు లేకుండా మకరంద ప్రస్తావనే ఉంది. మరొక శ్లోకంలో నోరు, మకరందం లేకుండా కేవలం తుమ్మెదల ప్రస్తావనే ఉంది. ఇక మూడవ శ్లోకంలో నోరు గురించే ఉంది కాని మకరందం మాట లేదు. అయినా వారు కంఠోక్తిగా చెప్పకపోయినా మనం దానిని ఊహించవచ్చు.

ఇంతకూ పద్మపాదులు చెప్పిన వినేయ పదం కావాలి. షట్పదిని గూర్చి చెబుతున్నాను కదా!

గమనించవలసిందేమంటే శంకరుల శిష్యులే కాదు, జగద్గురువు అయి ఉండి కూడా వినయంతో ఉన్నారు మన శంకరులు.

ఒక అద్భుతస్తోత్రాన్ని, సౌందర్య లహరిని అందించారు. ఇది అనేక విధాలా గొప్పది. భక్తి, కవిత్వం, తత్త్వరహస్యాలు, బీజాక్షరాలు, అందమైన భాష – ఒకటేమిటి అన్ని సంగతులున్న స్తోత్రమిది. అట్టి గ్రంథాన్ని అందించి పొంగిపోవడం సహజం. కాని ఆత్మస్తుతి చేసికొన్నారా? అణుమాత్రమైనా అహంకారం లేకుండా అమ్మవారిని క్షమించుమని అడిగే మాటలను చూడండి.

అమ్మా! నీవు నాద, వాక్ సముద్రానివి. నిన్ను వంద శ్లోకాలలో నుతించడానికి ఉద్యుక్తుడనయ్యాను. ఇది ఎట్లా ఉంది? రామేశ్వరంలో సేతు తీర్థంలో దోసెడు నీటిని తీసికొని మహా సముద్రానికి అర్ఘ్యం ఇస్తున్నట్లుంది

కదా! ఆ నీటినే తీసికొని ఆ సముద్రానికే అభిషేకం చేయడం లేదా? అర్ఘ్యం ఇయ్యడం లేదా?

అదే ధోరణిలో వినయంతో మూడు ఉదాహరణలను పేర్కొన్నారు.

శంకరుని అవతారమై యుండి మనతో కలిసినా 'అవినయాన్ని' పోగొట్టమని చెప్పలేదా? ఇదంతా మనకు వినయాన్ని నేర్పడానికే కదా! ఏ శక్తి లేకపోయినా కావలసినంత అవినయం మనకుంది.

ఇలాంటి వినయాన్ని చిన్ననాటి నుండి అభ్యసించాలి. మొక్కై వంగనిది, మ్రానై వంగుతుందా? వయస్సు పెరిగిన కొద్దీ అధికారం, డబ్బు, ఉద్యోగం వస్తాయి. అపుడు వినయాన్ని అభ్యసిద్దామంటే కుదురుతుందా?

శిక్కు మతంలో

విద్యార్థిని శిష్యుడని అంటాం. శిక్షను పొందినవాడు శిష్యుడు. గురుకుల వాసంలో ఉండి ఆదేశాలను పొందుతాడు. పాఠాలేకాదు, మొత్తం ప్రవర్తన అంతా తీర్చిదిద్దబడుతుంది. శిక్ష అనే పదం రెండర్థాలలోనూ కూడి యుంటుంది. సంగీతాన్ని నేర్చుకుంటూ ఉంటే సంగీతశిక్షయని వ్యవహరిస్తారు. న్యాయాధిపతి నేరస్థునికి జీవిత శిక్ష వేసాడని అంటున్నాం.

శిష్యుడెట్లా గురువుపట్ల వినయవంతుడై యుంటున్నాడో ఒక మతానికి చెందినవాడూ తమ మతాచార్యుల పట్ల అట్లా ఉండగలగాలి. గురునానక్ సిక్కు మతాన్ని స్థాపించాడు. ఇందు హిందూ ముస్లిమ్ సంప్రదాయాలుంటాయి. మహమ్మదీయ మతంలో చాలా నియమాలున్నాయి. వారు తు చ తప్పక పాటిస్తారు. మిగతా మతస్థుల గురించి అంతగట్టిగా చెప్పలేం. గురునానక్ ఈ నియమబద్ధతను స్వీకరించాడు. సిక్కు మతంలో ఉన్న గురువుల మాటలను తప్పక పాటించాలని కట్టడి చేసాడు. మతాచార్యుల పేరు ముందు గురుపదముంటుంది. గురు గోవింద సింగ్, గురునానక్ మాదిరిగా ఆచార్యులను గురుపదంతో వ్యవహరించినట్లుగానే మతాన్ని

పాటించేవారిని శిష్యులుగా పేర్కొన్నారు. శిష్యుడు సిక్కు అయింది. షకారాన్ని శకారంగా ఉచ్చరిస్తారు. అక్కడే వేదాధ్యయనంలోనూ ఇంతే. పురుష సూక్తంలోని 'హవిషా' అనే పదాన్ని హవికా అంటారు. అట్లాగే శిష్యపదంలోని షకారాన్ని సిక్‌గా ఉచ్చరిస్తారు. అట్లా ఊహిస్తున్నాను. లేదా శిక్షక పదం సిక్‌గా మారవచ్చు. గురువే శిక్షకుడు కదా! మిగిలిన వారు శిష్యులు. ఉత్తర దేశంలో చ, ష గా స-గా మారుతుంది. అందువల్ల శిక్షక పదం సిక్ అనడంలో ఆశ్చర్యం లేదు. ఇంతకూ వినయ ముండాలి.

క్రమశిక్షణలో రెండు భేదాలు

ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. అనగా దేనిని పడితే దానిని తినకూడదు. చూడకూడదు. అనగా మనోవికారాలను కలిగించే వాటిని చూడరాదు. చక్కని దృశ్యాలను చూడాలి. ఆలయాదులు మొదలైనవి దర్శించాలి. అట్లాగే చెవితో నాస్తిక వాదాలను వినకూడదు. నామ సంకీర్తనాదులను వినాలి. అట్లాగే చిత్తశుద్ధికి భంగం కలిగించే పదార్థాలనూ తినకూడదు. సాత్త్వికమైన ప్రసాదాలను తినాలి. నోటితో మాటలుంటాయి కదా! అనగా వ్యర్థ ప్రసంగాలు చేయకూడదు. అట్లే వాగ్వాదాలలో చిక్కుకొనుట కూడదు. భగవన్నామోచ్చారణకై నోటిని వాడాలి. కేవలం ఇంద్రియ సుఖాలకై శరీరాన్ని వినియోగించకూడదు. సంఘసేవకై వినియోగపడాలి. పూజ, ప్రదక్షిణం, నమస్కారాదులకై వినియోగపడాలి. ఇష్టం వచ్చేటట్లు త్రిప్పకుండా నియమించడమనే క్రమ శిక్షణతో ఉండాలి. దీనిని శమమని, దమమని అంటారు. అప్పర్‌స్వామి, శరీరంలోని అవయవాలు వేటి కోసం వినియోగింప బడాలో వివరించాడు. ఓ శిరసా! వినయంతో వంగు మొదలయినవి. శమదమాలను, శమదమాది అని అంటాం. దమమనగా మనస్సును నియమించుట. ఇంద్రియాలను కట్టడి చేయడం శమం. షట్పదీస్తోత్రంలో మనస్సు పట్ల దమం, భౌతిక వాంఛలనే ఎండమావులను శమంతో

నిగ్రహించాలని ఉంది. (స్వామి వారు శమదమాలపై అద్వైత సాధనలో విపులంగా చర్చించారు. ఒక పదానికి మరొక పదాన్ని వాడడం వివేక చూడామణి 22, 23 శ్లోకాలలో ఉంది. పదాల మూలాల దగ్గరకు వెడితే నియమించుట, క్రమశిక్షణతో ఉండుట అనే అర్థాలే వస్తాయి. ప్రస్తుతం, స్వామివారి నిర్వచనాలనే గ్రహిద్దాం).

మనమేమీ తప్పుచేయకుండా ఉండి ఇంద్రియాలను అదుపులో పెట్టవచ్చు. అయితే క్రూరమైన ఆలోచనలు చేసే మనస్సును బాహ్య నియమాలతో అదుపులో పెట్టలేం. దమ మనగా అంతరింద్రియ నిగ్రహం అనగా మనస్సును నియమించుట. అయితే కష్టమైనదే. కనుక ముందుగా శమమును అభ్యసించాలి. అపుడు దమం పట్టుబడుతుంది. గీతలో (2-59) బాహ్యరూపం కలిగిన వాటి నుండి (ఆహారం) తపస్వి దూరంగా ఉండవచ్చని చెప్పబడింది. కాని ఆ విషయాల పట్ల మోజు ఉంటుంది. బాహ్య విషయాలు, లోనున్న వాసనలు లేదా సంస్కారాలు మీద ఆసక్తి లేనివారు పరమేశ్వర సాక్షాత్కారాన్ని పొందగలరని తాత్పర్యం. శ్లోకంలో నిరాహారం అని యుంది. ఆహారం అంటే కేవలం తిండి మాత్రమే కాదు. అన్ని వాసనలని గ్రహించాలి. అట్లా అన్నిటినుండి దూరంగా ఉండాలని సూచించాడు.

అయితే మరొక ప్రశ్న. మనస్సు నుండి విషయ వాసనలు పోతే పరమాత్మ దర్శనం లభిస్తుందా? లేదా పరమాత్మ దర్శనం కలిగితే వాసనలు మటుమాయమై పోతాయా? ఇది ఎట్లా ఉందంటే పిచ్చి కుదిరితేనే గాని పెళ్లి కుదరదు, పెళ్లైతేనే గాని పిచ్చి కుదరదన్నట్లుగా ఉంది.

ఎట్లా పరిష్కరిస్తాం? ముందు మనస్సు శుద్ధిని పొందాలి. నాలో అన్ని సంస్కారాలూ నా మనస్సు నుండి దూరం కావాలని దృఢ సంకల్పం ఉండాలి. సంకల్ప మాత్రంచే అన్నీ పోతాయా? పోవు. దానికి మొదటమెట్టు ముందుగా పైపై ఇంద్రియాలను విషయాల నుండి దూరంగా ఉంచగలగాలి. అదే

శమం. అది నిమ్మదిగా అభ్యసిస్తున్న కొద్దీ మనస్సులోని వాసనలు క్రమక్రమంగా క్షీణిస్తాయి. అదే దమం. అయితే వాసనలు తగ్గుతాయి కాని పూర్తిగా క్షీణించవు. మాటిమాటికీ జారిపడుతూ ఉంటాం. నూనె రాసిన స్తంభాన్ని ఎక్కడం వంటిది. పట్టు జారిపోతూనే ఉంటుంది. అయినా ప్రయత్నం మానకూడదు. కనుక పట్టుదలతో సాధన సాగాలి. మన ప్రయత్నంలోని శ్రద్ధను, అంతరంగ శుద్ధిని గమనించి పరమాత్మ, మన పట్ల అనుగ్రహం చూపిస్తాడు. దర్శనమిస్తాడు. అది అతడు సగుణ రూపంలో, కారుణ్య లావణ్య రూపంలో అందించవచ్చు. లేదా నిరాకార నిర్గుణ పరబ్రహ్మను భవాన్ని కల్గించవచ్చు. అనగా ఆత్మస్వరూపాన్ని.

శమ దమదులను శమాదిషట్క సంపత్తులో చేర్చారు శంకరులు. ఇవి సాధకునకు ఉండవలసిన ముఖ్య లక్షణాలు.

శమానికి సంబంధించినది శాంతి. దమానికి చెందింది దాంతి. శాంతియనే మాట అందరికీ తెలిసిందే. దాంతిని గురించి సాధారణంగా వినం. మా మఠంలో జరిగే స్వస్తి వాచనం వినేవారికి శాంతి, దాంతి భూమన్ అనే మాట సుపరిచితం. ఇట్టి శమ, దమాలను ప్రసాదించుమని షట్పదీస్తోత్రంలో పేర్కొన్నారు శంకరులు.

శమ దమాలతో మనస్సును నింపినపుడు ముందుగా వినయంతో, సాదా జీవనంతో ఉండాలి. వీటిని కలిగించుమని ప్రార్థించేటపుడు వినయం ఉండాలి కదా! అందుకే ముందుగా 'అవినయమపనయ', అని అన్నారు. విష్ణో అని తరువాత సంబోధనం. తరువాత **దమయమన: శమయ విషయ మృగతృష్ణాం** అన్నారు. అనగా మనస్సునకు దమం, అనగా దాంతి కావాలి. దానినిమ్ము నా మనస్సును నిగ్రహించు. ఇంద్రియాలకు శాంతిని ప్రసాదించు. ఇవి ఎండమావులలో నీళ్లకోసం పరుగెత్తుతున్నాయి.

వీటిని అదుపులో పెట్టవయ్యా! కనుక శమాన్ని ఇమ్ము.

ఇక మృగతృష్ణ ఏమిటి?

ఎండమావి

మృగతృష్ణ అనగా ఎండమావి. ఎందుకీ మాటవచ్చింది? మృగ అంటే జంతువు. అంతేకాదు, లేడి యని అర్థం. ఏ మృగమైనా జంతువనే అర్థం.

పరమేశ్వరునకు మృగపాణి అని ఒక నామం. అట్లాగే మృగధరుడు. అట్లాగే, పశు శబ్దం. తమిళంలో పశువంటే ఆవు. సంస్కృతంలో ఏ జంతువునైనా పశువనే అంటారు. యజ్ఞంలో బలి ఇచ్చే దానిని యజ్ఞపశువంటారు. సాధారణంగా మేకలను బలి ఇస్తారు. నీచమైన మనస్సుతో ఉన్న వానిని పశువని అంటాం. కాని జీవులందరూ పశువులే. పరమాత్మ, జీవాత్మల కంటే అధికుడై వృషభాన్ని వాహనంగా కలిగిన వాడై చేతిలో లేడి, నుంచుకొంటాడు. కనుక అతడు మృగపాణి, పశుపతి కూడా.

అన్ని జంతువులను, లేడిని సూచించే మృగశబ్దంతోనే సంస్కృతంలో అంటారు. పశుశబ్దం అన్ని జంతువులను సూచించినా ఆవునకే ప్రధానంగా వాడుతారు.

ఇక మృగమంటే లేడి. తృష్ణయనగా దాహం. నీళ్ల కోసం తపన. తృష్ణ నుండి ఆంగ్లంలో Thirst అనే పదం వచ్చి ఉంటుంది. మృగతృష్ణయనగా లేడి యొక్క దాహం.

దాహానికి, ఎండమావికి ఎట్టి సంబంధం? వేసవి కాలంలో ఎడారులలో నున్న లేళ్లు నీళ్లకై పరితపిస్తాయి. అక్కడ నీరు దొరుకుతుందా?

అక్కడ నీళ్లు లేకపోతే మైదానంలోకి వచ్చి దాహం తీర్చుకోవచ్చు కదా! అక్కడ ఉండగా వాటికొక భ్రాంతి కలుగుతుంది. సూర్యకాంతి యొక్క కిరణ వక్రీకరణం వల్ల నీళ్లున్నట్లుగా ఎడారిలో కన్పిస్తుంది. వేడి ఎక్కువైన కొద్దీ ఎడారిలో గాలి తేలిక పడి నీళ్లున్నట్లుగా భ్రాంతి కల్గుతుంది. ఇసుకతో కూడిన నేలను చాలా దూరం నుండి చూస్తే నీటి ప్రవాహంలా కనబడుతుంది కదా! నీళ్లున్నాయని పరుగెత్తిన కొద్దీ ఇంకా దూరదూరంగా నీళ్లు దొరుకుతాయనే భ్రాంతి కలుగుతూ ఉంటుంది.

అట్టి ఎండమావులకై పరుగెత్తుతాయి లేళ్లు. ఇసుక వేడి భరించలేవు. పరుగెత్తి పరుగెత్తి నీళ్లు దొరకక చనిపోతాయి. సంస్కృతంలో మృగ్ అనగా వెదకుట. దేని కోసమో అటూ ఇటూ చూసేది మృగము. చివరకు దాని చూపుతోనే పరిసమాప్తి.

అద్వైతం, ప్రపంచం అంతా మాయయని అంటుంది. అన్నీ చూస్తున్నాం కదా, అంతా మాయ యంటారేమిటని ప్రశ్నిస్తారు. అయ్యా, ఎండమావి ఉన్నట్లుగా కన్పిస్తోంది కదా! అది నిజమైనదౌతుందా? కాదు. అట్లాగే మన కంటికి కనబడేవి అన్నీ మాయయే అంటుంది అద్వైతం.

సరియైన పోలిక

కలలో ఎన్నిటినో చూసినా మెళకువ వచ్చినపుడు ఏమీ లేనట్లనే పోలిక కంటే ఈ ఎండమావియనే పోలిక ఇంకా బాగుంటుంది. కల ఉన్నంతకాలం అందు కనబడేది సత్యంగానే కన్పిస్తుంది. మెళకువ రానంతవరకూ సత్యమే. మెళకువ రాగా అందు చూసినది, అంతవరకూ చూసినది, అసత్యమని నిర్ధారిస్తాం.

అజ్ఞానంలో ఉన్నంత వరకూ ప్రపంచం సత్యమే. జ్ఞానం కలిగిన తరువాత పరమార్థ సత్యమే పలురకాలుగా కన్పిస్తోందని అంటాం. అందువల్ల మాయను, కలతో పోలుస్తాం, మెళకువ వచ్చిన తరువాత కలలో చూచినది అబద్ధమని భావించినట్లు జ్ఞానికి ఈ ప్రపంచంలో కనబడకూడదు కదా! అయినా శంకరులు, శుకబ్రహ్మ వంటివారు ప్రపంచాన్ని త్రోసివేసారా? ఈ ప్రపంచం కొంతవరకూ ఉంటుందని, ఇది వ్యావహారిక సత్యమని దీని ఉనికిని కొంతవరకూ అంగీకరించారు కదా! అసలే లేదంటే ఎవరు, ఎవరికి హితోపదేశం చేయాలి? ఎంత అబద్ధమని చెప్పినా సామాన్యుల కిది నిజమని తోస్తోంది కదా! సామాన్యులకు జ్ఞానం కలుగలేదని అంటామా? ఇక్కడ ఎండమావి పోలిక పనికి వస్తుంది. ఎండమావులలో నీళ్లుండవని అందరికీ

తెలుసు. అయినా ఎండలో ఖాళీ మైదానంలో నీళ్లున్నట్లు భ్రాంతి కలుగుతూనే ఉంటుంది. ఇది కలవంటిది కాదు. మెళకువ వచ్చినపుడే అది అబద్ధమని అప్పుడు తెలిసికొంటాం. మెళకువగా నున్నప్పుడు ఎండమావిలో నీళ్లుండవని తెలిసికూడా నీళ్లున్నట్లు అందరికీ కన్పిస్తోంది కదా! అందుకే ఈ పోలిక బాగా నప్పుతుంది.

ఈ మృగతృష్ణ, అలంకార శాస్త్రంలోనూ ఉంది. తిరుమూలర్ పంచ ఇంద్రియాలను పాలనిచ్చే జంతువుతో పోల్చాడు. శంకరులు ఇంద్రియాలను లేడితో పోల్చారు. ఎండను భరించలేక నీళ్లున్నాయనే భ్రాంతితో ఎడారి చుట్టూ తిరిగి చివరకు లేళ్లు చనిపోయినట్లు ఇంద్రియాల వల్ల సుఖంలేకపోయినా వాటి వెంట తిరుగుతూ మనిషి నాశనాన్ని కొని తెచ్చుకుంటున్నాడని అన్నారు. కనుక శమయ మృగతృష్ణాం అన్నారు.

జీవితం ఒక ఎడారి వంటిది. అట్లాగే ఇంద్రియ సుఖాలూ ఎండమావుల వంటివి.

కొంత ప్రాంతం ఎడారి అవుతుంది. అందునీరుండదు. నీరున్నట్లు కనబడడం భ్రాంతి. అసలు ఎడారి ఎట్లా ఏర్పడిందో భూగర్భ శాస్త్రజ్ఞులు తేల్చారు. ఇవన్నీ కొన్నివేల సంవత్సరాల వెనుక పెద్దపెద్ద సముద్రాలే అని అన్నారు. ఎడారులను త్రవ్వితే అందు పెద్దపెద్ద జంతువుల కళేబరాలు, ఎముకలు కన్పిస్తాయి. నీరులేక పోతే ఆ జల జంతువుల ఎముకలు కనబడవు కదా! పెద్దపెద్ద భూకంపాలు వచ్చినపుడు అందలి నీరు చెల్లా చెదురై కొన్ని కొన్ని ప్రాంతాలలో నీరుండి, మిగిలినది సూర్యకాంతి వల్ల ఎండిపోతే అవే ఎడారులవుతాయి. అపుడు ఒక్క చుక్క నీరుకూడా కనబడకపోతుంది.

కనుక మనిషి, నీరున్న మైదాన ప్రాంతాలలో ఉంటాడు. పంటలు పండిస్తాడు. కడుపు నింపు కొంటాడు. ఈ సృష్టి గురించి తెలిసికొంటే ఎంతో ఆశ్చర్యం, ఆనందం కల్గుతాయి. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, అంతా మిథ్యయే అని చెప్పడానికే. ఇదంతా మృగతృష్ణయేయని.

చూసినంతసేపూ ఎండమావి చూడ ముచ్చటగానే ఉంటుంది. లోకమాయను భగవానుడు అందంగా తీర్చిదిద్దాడు. ఒక చోట కొండ, ఒక చోట లోయ, మరొక చోట నది. అన్నిటికీ అర్థం ఉంది. అట్లాగే జీవ ప్రపంచంలోని వైవిధ్యానికీ అర్థం ఉంది. 84 లక్షల జీవరాసులలోనున్న వైవిధ్యాన్ని గుర్తించండి. కాని ఒకదానికి, మరొక దానికీ సంబంధం ఉంది సుమా! ప్రపంచాన్ని సృష్టించి దానితో వినోదిస్తున్నాడు పరమాత్మ.

అయితే ఈ లీలలో అనేక దుష్ఫలితాలున్నాయి. ఈ సృష్టి అంతా బాగుంటే ఇదంతా శాశ్వతంగా ఉంటోందా! ఉండాలి కదా! అంతా సవ్యంగా నడుస్తోందా? మధ్యమధ్యలో భూకంపాలు, తుఫానులు, అగ్ని పర్వత విస్ఫోటనాలు, కొన్ని సందర్భాలలో సముద్రాలే ఎడారులుగా మారడం - ఇట్లా ఎన్నో

మైదానంలో మానవుడుండాలంటే వర్షం, నదులు, మొక్కలు ఉండాలి. కొంత సముద్ర ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్నాడు. ఇక్కడ సముద్రం, ఇక్కడ ఎడారి ఉండాలని నిర్దేశించేవాడతడే. అట్లే ఈ ఎడారి ప్రక్కన మైదానమూ. అయితే ప్రకృతి నియమాలకు అడ్డురాదు. అందుకే ఒకనాటి సముద్రంలో ఒక్క నీటి బొట్టైనా ఉండడం లేదే! బ్రహ్మయ్యా! ఏమిటి నీ లీల?

సహారా - సాగరం

ఎడారుల గురించి ముచ్చటిస్తా. ఈనాటి పెద్ద సహారా ఎడారి, ఒకనాటి సముద్రమని శాస్త్రవేత్తలన్నారు. సగరుని కొడుకులు భూమిని త్రవ్వి సాగరాన్ని నిర్మించారని రామాయణంలో ఉంది. కనుక సాగరమన్నారు. ఆ సాగరమే సహారా అయిందని భావిస్తున్నా.

రాజస్థాన్ ఒక ఎడారి ప్రాంతం. ఎడారిని సంస్కృతంలో మరువాటిక యని అంటారు. అదే మార్వార్ అయింది. అందువల్లనే రాజస్థానీయులను మార్వాడీలంటారు.

ఎడారి వంటి భౌతిక జీవనం, జీవసారమైన పరమాత్మ నుండి వచ్చింది. అది ఆత్మను పోషిస్తుందా? కామక్రోధాలు మనిషిని నానా తిప్పలు పెట్టి అటూ ఇటూ లాగుతున్నాయి కదా! అందుకనే విషయాలను మృగతృష్ణ అని అన్నారు. విషయ మృగతృష్ణా అని శ్లోకంలో.

ముందుగా వినయాన్ని కోరారు. ఇంద్రియనిగ్రహం కావాలని అనడానికి ముందు మనో నిగ్రహం కావాలన్నారు. ఎండమావుల వంటి ఇంద్రియ సుఖాలకై పరుగెత్తకుండా చేయుమన్నారు.

దాంతి తరువాత శాంతి ఏమిటి?

బాహ్యేంద్రియ నిగ్రహం సాధించిన తరువాత అంతరింద్రియ నిగ్రహం, అనగా మనో నిగ్రహం సాధించాలి కదా! అయితే ముందు దాంతి, తరువాత శాంతి యన్నారేమిటి? బాహ్యనిగ్రహం, అంతరింద్రియ నిగ్రహానికి సాధనమని తెలియచేయడానికేమో! అంతరింద్రియ నిగ్రహమే లక్ష్యం. బాహ్యేంద్రియాలను అదుపులో ఉంచగలం. మనస్సునట్లా నియమించలేం. ఏదైనా కంటికి బాధవస్తే చలనచిత్రాదులను చూడవద్దని అంటున్నారు. ప్రేగులకు రోగం వస్తే మాంసం తినవద్దంటున్నారు. ఈ ఉదాహరణలు మనస్సును నియమించడానికి సాధనాలుగా చెప్పబడలేదు. మనస్సును నియమించడానికి ఆత్మాభివృద్ధికై ఇంద్రియ జయం ఏర్పడింది. ఈ లక్ష్యాన్ని మరువకూడదు. అందువల్ల ముందు మనస్సును అదుపులో ఉంచాలనే నియమం ఏర్పడియుంటుంది. అప్పుడే బాహ్యేంద్రియ నిగ్రహం, మనస్సును నియమించడానికి సాధనంగా పరిగణింపబడింది.

కనుక అవినయాన్ని పోగొట్టు విషయాల వెంటబడే ఇంద్రియాలను కట్టునట్లు చేయుమని ఇంత వరకు శంకరులు ప్రాథమిక ఉపదేశాన్ని అందించారు.

వినయం ఎప్పుడైతే వచ్చిందో మనస్సు, ఇంద్రియాలు నియమంలో ఉంటాయి. ఇంతకంటే కావలసిందేమిటి?

ప్రపంచ ముక్తికై స్వముక్తి

కేవలం మోక్షానికే ప్రయత్నం చేయడం కాదు. అసలు ప్రపంచం అంతా మాయలోనే మునిగింది కదా! కనుక అందరి పట్ల అనుకంపతో ఉన్నారు శంకరులు. ప్రపంచాన్ని పూర్తిగా అబద్ధమని త్రోసి వేయలేదు. గొడ్రాలి కొడుకు, కుందేటి కొమ్ము మాదిరిగా పూర్తి అసత్యమని త్రోసి వేయలేదు. ప్రపంచాన్ని ఒక వలయని, అది అబద్ధమని తేల్చారు. గొడ్రాలి కొడుకు వంటి కేవల అసత్యం కాదు. కల, కంటున్నంత వరకు అది సత్యమే. మెళకువ వచ్చినపుడు మాత్రమే అసత్యము. ఇట్లా కొంత సత్యము, కొంత అబద్ధమైన దానిని మాయ, మిథ్య, ప్రాతిభాసిక సత్యం అనే పేర్లతో పిలిచారు. ఇట్టి కల నుండి మనం మేల్కొనాలని వారి సంకల్పం. అందువల్లనే ఆ సేతు హిమాచలం పర్యటించి మేల్కొల్పడం అంతా వారి దయవల్లనే. ఆత్మారాములై యుండి ఒకచోట కూర్చుని వారి ముక్తికై వారు ప్రయత్నించ వచ్చు. అట్లా ఉండలేదు. అనేక భాష్యాలు వ్రాసేరు. అనేక స్తోత్రాల నందించారు. విద్వాంసులతో వాదించారు. అనేక దేవతా ప్రతిష్ఠలు, యంత్ర స్థాపనలు వీటి అన్నిటికీ మూలం మన పట్ల దయవల్లనే.

అందువల్ల శమదమాదులతో ఆగిపోకుండా వ్యక్తిగత మోక్షంతో సరిపుచ్చుకుండా ప్రపంచంలోని అన్ని ప్రాణులను ప్రేమించునట్లుగా తీర్చి దిద్దుమని ప్రార్థించారు. దయవిస్తరిల్లుగాక:

భూత దయాం విస్తారయ

భూతాలంటే సమస్త జీవులని. తన ముక్తికే కాకుండా జగత్తు అంతా ముక్త దశను పొందాలనే భావనతో అన్నారు.

ఎంత జ్ఞానులైనా అది సరిపోదు. మన హృదయాలు దయతో నిండినపుడు, ఇతరులకు మంచి చేసినపుడే మన జీవితాలకు సార్థకత. శంకర పదమే మంచి చేయునదని అర్థం కదా!

శంకరోతీతి శంకరః

నాయకుడనగానే శుక్లాంబరధరం శ్లోకం గుర్తుకు వస్తుంది. అట్లాగే ఒక్కొక్క దేవతను స్మరిస్తే ఒక్కొక్క శ్లోకం వెంటనే గుర్తుకు వస్తుంది. రాముడనగానే **ఆపదా మపహర్తారం**, సరస్వతి యనగానే **యాకుందేందు**, అమ్మవారనగానే సర్వ మంగల మాంగల్యే గుర్తుకు వచ్చినట్లుగా, శంకరులనగానే శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం నమామి భగవత్పాద శంకరం లోక శంకరం గుర్తుకు వస్తుంది. అనగా శ్రుతి, స్మృతి, పురాణాలకు నిలయం, దయకు నెలవని కరుణాలయం; లోకానికి సుఖానిచ్చే వాడనే అర్థంలో లోకశంకరం అని అర్థం

వారు జ్ఞానసముద్రులే కాదు, దయా సముద్రులు కూడా. కనుకనే ఆత్మాభివృద్ధి యని చెప్పి ఊరుకోకుండా భూతదయను గూర్చి కూడా హెచ్చరిస్తున్నారు.

మహావిష్ణువు నెట్లా ప్రార్థించారో, పరమేశ్వరుని కూడా శివాపరాధ క్షమాపణ స్తోత్రంలో ఇట్లా ప్రార్థించారు :–

ప్రాణినాం నిర్దయత్వం మాభూదేవం మమపశుపతే జన్మజన్మాంతరేషు

ఈ శ్లోకం పౌరోహిత్యంతో అరంభమౌతుంది. లోకంలో మంచి వాటినిమ్మని అడగడానికి బదులు, చెడ్డ వాటి నుండి దూరంగా ఉంచుమని ప్రార్థించారు. చివరగా ప్రాణుల పట్ల నిర్దయను చూపించకుండా చేయుమని ప్రార్థించారు. శంకరుడు సంహార మూర్తి కదా! ఏమిటి, ఇక్కడ చేయవలసిన సంహారం? నాలోని నిర్దయత్వాన్ని సంహరింపుమని అర్థం. అట్లాగే జగత్ పరిపాలన మూర్తియైన విష్ణువును భూతదయాం విస్తారయ, అని ప్రార్థించారు. భూతదయను కలుగునట్లు చేయుమని అర్థం కదా! ఇంతకంటే ఏం కావాలి?

అవతలి ఒడ్డునకు చేరుస్తావా?

"తారయ సంసార సాగరతః" అనే దానితో శ్లోకాన్ని ముగించారు. సంసారం యొక్క అవతలి ఒడ్డునకు చేర్చుమని అర్థం.

తారకం అనగా తరింపచేయునది. నావ వంటిది. ప్రణవం, రామనామాలు తారక మంత్రాలు. త్యాగరాజు, తారక నామ అని కీర్తించారు. తారక మంత్రం సముద్రంలో మునిగినవారికి ఉపయోగకరం. అది నావలో కూర్చోబెట్టి తీసికొని పెడుతుంది. పరమపదాన్ని చేరుస్తుంది.

అనగా శ్లోకంలో అవినయాన్ని పోగొట్టు, నా మనస్సును నియమించు, విషయాల వెంట పరుగెత్తే ఇంద్రియాలను నియమించు,. అందరిపట్ల దయ చూపించునట్లు అనుగ్రహించుమని, చివరగా జనన మరణ ప్రవాహంలో కొట్టుకు పోకుండా అవతలి ఒడ్డునకు చేర్చుమని, మోక్ష స్థానాన్ని ఇమ్మని ప్రార్థించారు.

సంసార సాగరం యొక్క అవతలి ఒడ్డునకు చేరిస్తే బాధలుండవు కదా! ఇక్కడ అద్వైత విశిష్టాద్వైత, ద్వైతముక్తుల గురించి, భేదాల గురించి ప్రస్తావించను. ఏమార్గమైతేనేమి, కావలసింది బాధా నివృత్తి. భగవానుడేమి చేసినా అతని ఇష్టం.

ఇందు తారయ సంసార సాగరతః అన్నట్లుగా భజగోవింద శ్లోకంలో ఇహసంసారే బహుదుస్తారే కృపయా పారే పాహిమురారే అని అన్నారు.

తారం అంటే దాటుట; దుస్తరం = దాటుటకు శక్యము కానిది. బహుదుస్తారం = దాటడానికి అసలు శక్యము కానిది. భగవానుని కృప ఉంటే దాటవచ్చు. హే మురారి! అవతలి ఒడ్డునకు చేర్చు.

శంకరులు బుద్ధి, జ్ఞాన, వాక్ శక్తిల యందు మేరు పర్వతం వంటి వారు. అయినా వినయంలో ఈశ్వర కృప వల్లనే అసాధ్యాన్ని సాధ్యం చేయవచ్చని అన్నారు. కృపయా, దయయా అనే మాటలను వాడారు.

సౌందర్యలహరిలో కూడా కటాక్షధార అని అన్నారు. నాకు అర్హత ఉన్నా లేకపోయినా కటాక్షాన్ని చూపించుమని అన్నారు. కృపయా మామ్, శివే అని అంటూ నా శిరస్సుపై నీ పాదాలనుంచవమ్మా అని ప్రార్థించారు. శిరసి దయయా దేహి చరణౌ.

షట్పదీస్తోత్రంలో కృపయా అనే మాట లేదు. భగవానుని దయను, కల్యాణ గుణాలను గుర్తించే ఈ శ్లోకం వ్రాసేరు. భూతదయను కోరారు. స్వామి, దయాళువు, కృపాళువు కదా!

మరొక మధుర శ్లోకం

తరువాతి శ్లోకంలో భగవానుని పాదాలను నుతించారు. అది భగవత్పదం.

దివ్యధునీ మకరందే
పరిమళ పరిభోగ సచ్చిదానందే
శ్రీపతి పదారవిందే
భవభయ ఖేదచ్ఛిదే వందే

ఈ అందమైన శ్లోకాన్ని మరలమరల చదవాలని అనిపిస్తుంది. పువ్వులలోని దళాలు మాదిరిగా సుకుమారమైన పదాలతో వ్రాసేరు. మకరందే, ఆనందే, అరవిందే. శబ్ద సౌందర్యం ఎట్లా ఉందో చూడండి.

శ్లోకంలో ప్రతిపాదంలో మొదటి అక్షరాల కూర్పు అందంగా ఉంటే దానిని ఆరంభ ప్రాసం అంటాం. సాధారణంగా సంస్కృతంలో పాదం చివరలో ఇట్లా ఉంటుంది. దీనిని అంత్యప్రాస అని అంటారు. మామఠంలో చదివే శ్లోకాన్ని ఒక దానిని పేర్కొంటాను.

సమర విజయ కోటీ సాధకానంద ధాటీ
మృదుగుణగణపేటీ ముఖ్యకాదంబవాటీ
మునినుత పరిపాటీ మోహితా జాండకోటీ
పరమశివవధూటీ పాతు మాం కామకోటీ

ఇవన్నీ అంత్యప్రాసలతో ఉన్నాయి. ఇట్లా మూక కవి పంచ శతి శ్లోకాన్ని పేర్కొన్నాడు.

తాత్త్వికమైన అర్థం ఉన్నపుడు, అనుభూతితో వ్రాసినపుడు, కవితా సౌందర్యం జోడింపబడితే బంగారానికి తావియచ్చినట్లుంటుంది. షట్పదిలో కూడా ఇట్టివున్నాయి.

దీర్ఘాక్షరాలు కాకుండా, మృదువైన నాదంతో కూడిన వాటిని సులభంగా కంఠస్థం చేయవచ్చు. అవినయ, మపనయ, దమయమనః, శమయ - ఇందలి స, య, మ, అనే అక్షరాలు మరల మరల రావడం వల్ల వినసొంపుగా ఉంటుంది. కంఠస్థం చేయడానికీ వీలుంటుంది. అట్లాగే విస్తారయ, తారయ; దీనికి యమకమంటారు. తమిళంలో మడక్కు అని అంటారు.

రెండవ శ్లోకంలో అంత్యప్రాస ఉంది. మకరందే, ఆనందే, అరవిందే, వందే - అనే మాటలు. ఇది వారి అనుగ్రహం.

శ్రీదేవి - పద్మం

శంకరులు, విష్ణువు యొక్క పాదాన్ని పద్మంతో పోల్చారు. శ్రీపతి పాదారవిందే.

పాదారవిందమనగా పవిత్రమైన పద్మపాదం. శ్రీ యనగా మహాలక్ష్మి. శ్రీపతియనగా లక్ష్మీనారాయణుడు. శ్రీపతికి పాదారవిందం ఉండడం సరిపోయింది. లక్ష్మికి, పద్మానికి దగ్గర సంబంధం ఉంది.

పద్మప్రియే పద్మిని పద్మహస్తే

పద్మాలయే పద్మదలాయతాక్షి అని నుతిస్తున్నాం.

ఆమెకు పద్మం అంటే ఇష్టం. కనుక పద్మప్రియే. పద్మిని యనగా పద్మం యొక్క నాళం, లేదా తూడు. ఆమె నవయౌవనంతో ఉంటుంది. కనుక సొగసైన తూడుతో పోలిక. స్త్రీలలో శ్రేష్ఠమైనది పద్మినీ జాతి స్త్రీ. పద్మాలు కలిగినది పద్మిని అని కూడా.

లక్ష్మి ఉండేచోట్లు ఐదు. పద్మం, ఏనుగు తల, ఆవు యొక్క వెనుక తట్టు, మారేడు దళం యొక్క వెనుక భాగం, సుమంగలి యొక్క సీమంతం. ఇట్లా ఐదుచోట్ల లక్ష్మి ఉన్నా ఆవిడ పద్మంమీద కూర్చుని ఉన్న రూపమే అందరికీ పరిచయం. చిత్రకారులు అట్లాగే చిత్రీకరిస్తారు. విగ్రహాలనట్లే మలుస్తారు. కనుక పద్మాలయే.

ఆమెకున్న నాల్గు చేతులలో రెంటిలో పద్మాలున్నాయి. అందువల్ల పద్మహస్తే. ఆమె కన్నులు, వికసించిన పద్మదళాలులా ఉంటాయి. అందువల్ల పద్మదలాయతాక్షి. ఆమె ముఖమే పద్మంలా ఉంటుంది. ఈ స్తోత్రంలో లేకపోయినా లక్ష్మి అష్టోత్తరంలో పద్మముఖిగా కీర్తింపబడింది.

ఆ స్తోత్రంలో పద్మంతో సంబంధమున్న నామాలు చాలా ఉన్నాయి. పద్మాలను మాలగా ధరిస్తుంది. పద్మమాలాధరా. ఆమె శరీరం నుండి పద్మం యొక్క సువాసన వస్తూ ఉంటుంది, పద్మ సుగంధిని. ఆమె పద్మాన్ని ఎంత ప్రేమిస్తోందో అంతగా అయ్యవారూ ప్రేమిస్తారు కనుక స్వామిని పద్మనాభుడని, ఆమెను పద్మనాభ ప్రియయని అష్టోత్తరంలో ఉంది.

పద్మావతి, కమల, అంబుజ, పంకజ ఈ అన్ని నామాలూ పద్మంతో కూడిన ఈమెను చెబుతాయి.

ఆమె భర్తతో, శ్రీపతితో ఉండడం వల్ల శ్రీపతిపాదాలు కూడా పద్మాలతో పోలిక. శ్రీపతి పాదారవిందే. పద్మ హస్తం కలిగిన లక్ష్మి, శేషపర్యంకంపై శయనించిన విష్ణుపాద పద్మాలను ఒత్తుతూ ఉంటుంది. ఇట్లా అమ్మవారిని ప్రత్యక్షంగా శంకరులు నుతించకపోయినా ఇద్దర్నీ చూపించారు.

పవిత్ర పాదం నుండి గంగ

స్వామిపాదం, పద్మమే ఐతే అందుండి మకరందం స్రవించాలి కదా! భగవానుని పాదం నుండి వెలువడే మకరందం ఏమిటి?

దివ్యధునీ మకరందే

మకరందమనగా తేనె. ధుని యనగా నది. దేవలోకానికి చెందింది దివ్య ధుని. ఆకాశం నుండి, భూమి నుండి, పాతాళం నుండి గంగ ప్రవహిస్తోంది. వరుసగా మందాకిని, భాగీరథి, భగవతి యని పేర్లు. బలి చక్రవర్తి యాగం చేయగా భగవానుడు వామనుడై వచ్చాడు. తరువాత త్రివిక్రముడై విజృంభించాడు. ఒక పాదంతో దేవలోకాన్ని ఆక్రమించాడు. అది దేవలోకానికి చేరగా బ్రహ్మ, అతని పాదానికి అభిషేకం చేసాడు. ఆ అభిషేక జలమే మందాకిని. అదే ఆకాశగంగ. అదే దివ్య ధుని.

పద్మం వంటి పాదం నుండి ప్రవహించిన నీరు కేవలం నీటిగానే కనబడకుండా, బ్రహ్మ, అభిషేకం చేయడం వల్ల అది తేనెగా ఉండి ఆ పెద్దపద్మం నుండి జాలువారింది. అదే దివ్యధుని.

దివ్యధునీ మకరందే

భగవానుని పాదపద్మం నుండి సువాసన వెలువడింది. అతని శరీరమే సుగంధ భరితం. సుగంధం, గంధ ద్వారా అనే మాటలు వేదమంత్రాలలో దేవతలనుద్దేశించి ఉంటాయి.

పాదం నుండి సంసార విముక్తి - శాశ్వతానందం

పరిమళ పరిభోగ సచ్చిదానందే అన్నారు శంకరులు. పరిమళం అనగా సుగంధం. రంగనాథుణ్ణి పరిమళ రంగనాథుడని అంటారు. పరిభోగం – మనం సంతోషించేది. మాటిమాటికీ సుగంధాన్ని అనుభవిస్తూ ఉంటాం. ఎంత వాసన చూసినా తనివి లేదు. ఆనందాన్ని అనుభవిస్తాం. ఇది వెన్నెల రాత్రులలో విందు ఆరగించడం వంటిదా? తైత్తిరీయ ఉపనిషత్తు అనేకానందాలను పేర్కొంటూ చివరి దానిని బ్రహ్మానందమన్నది. అట్టి ఆనందాన్ని భగవానుని పాదపద్మం ఇస్తుంది.

బ్రహ్మము సచ్చిదానంద స్వరూపం. నిత్య సత్యం. సత్. తెలిసికొనేది, తెలియబడేది చిత్. ఆ స్థితిలో తన కంటే వేరైనది ఏదీ లేదు. అదే ఆనందం. శ్రీపతి యొక్క పాదారవిందం ఆ సచ్చిదానంద సుగంధాన్ని వెదజల్లుతోంది.

దివ్యధునీ మకరందే

పరిమళ పరిభోగ సచ్చిదానందే

శ్రీపతి పాదారవిందే

అది సచ్చిదానందాన్ని ఇస్తూ ఉండగా అది ముందు సంసారభయాన్ని పోగొట్టాలి:

భవభయఖేదచ్ఛిదే వందే

మొదటి శ్లోకంలో తారయ సంసారసాగరతః అన్నారు. సంసారమని పేర్కొనబడినదే భవము. ఆ భవమే ఇక్కడ భవభయం.

సంసారాన్ని భవమని, భవసాగరమని అంటూ ఉంటారు కదా!

భవం అనగా వ్యక్తీకరింపబడినది. శరవణం నుండి అనగా రెల్లుదుబ్బునుండి పుట్టిన వాడు శరవణ భవుడు. భవానికి మరొకమాట ఉద్భవం. సంసారమనగా నిలకడలేని ప్రవాహం వంటిది. కనుక భవమనగా సృజింపబడిన పదార్థము. అనగా ఇది అనాది, స్వయంభువు (తనకు తాను పుట్టినది) కాదని ఇది ఒక దాని నుండి పుట్టినదని అర్థం వస్తుంది. దీనికొక ఆది, ఒక పుట్టుక స్థలం ఉండగా దీనికొక అంతం, నశించుట, ఉండాలి కదా! కాని పరమాత్మతత్వం ఆది, అనాదులు లేనిది.

అయితే పరమేశ్వరునకు ఒక పేరు భవుడని. భవ, శర్వ, రుద్ర, పశుపతి, ఉగ్ర, మహాదేవ, భీమ, ఈశాన అని ప్రత్యేకంగా ఈశ్వరునకు ఎనిమిది నామాలున్నాయి. భవుని భార్య, భవాని. శర్వుని భార్య, శర్వాణి. రుద్రుని భార్య రుద్రాణి. ఈశుని భార్య ఈశాని, అన్నిటిని సృష్టిస్తాడు కనుక అతడు భవుడు. అన్నిటిని సంహరిస్తాడు కనుక శర్వుడు. అనగా సృష్టికర్తయే సంహారకర్త. మూక కవి, ఒక చక్కని మాట అన్నాడు. అమ్మా! నీ పాదం

భవునకు (శివునకు) ఆనందాన్నిస్తోంది. అదే సందర్భంలో భవాన్ని (సంసారాన్ని) పోగొడుతోందని (పాదారవింద శతకం. 88 శ్లో)

మూక కవి అమ్మవారి పాదాన్ని పేర్కొన్నాడు. శంకరులు విష్ణువు యొక్క (అమ్మవారి పురుష రూపమైన విష్ణువు యొక్క) పాదాలను సంసార భయాన్ని పోగొట్టే వాటివని కీర్తించారు:

భవభయ ఖేదచ్ఛిదే వందే

సంసారం, భయాన్ని మాత్రమే పుట్టించదు, దుఃఖం, బాధ మొదలైనవి కల్గిస్తుంది. వీటిని ఖేద అనే పదంతో సూచించారు. సంసారం నుండి పుట్టిన దుఃఖాలను, బాధలను పోగొట్టే పాదాలను మ్రొక్కుతున్నానని అన్నారు.

భవ భయ ఖేదచ్ఛిదే

అద్వైతాచార్యులు భక్తి ద్వైతాలను గురించి చెప్పట

మూడవ శ్లోకంలో తత్త్వాన్ని వివరిస్తున్నారు.

సత్యపి భేదాపగమే నాథ తవాహం నమామకీనస్త్వం

సాముద్రోహి తరంగః క్వచన సముద్రోన తారంగః

భేద-అపగమే = భేదాపగమే అవుతుంది. అపగమ మనగా తొలగింపబడగా అనీ, గమమ్, లేక గమనం వచ్చుట, కలుపుటను సూచిస్తాయి. దానికి విరుద్ధం అపగమమే. భేదాపగమే అనగా భేదభావం తొలగింపబడగా అని అర్థం.

భేదం గురించి మాట్లాడుతున్నాం. పరమాత్మ, జీవాత్మ అని పేర్కొంటున్నాం. పరమాత్మ నుండి జీవాత్మ విడిగా ఉన్నాడని భావించినపుడు సంసారమనే నాటకం సాగుతోంది. ఈ రెండూ భిన్నము కావని ఒకటేయని చెప్పేది అద్వైతం. ఇదే శంకరులు చెప్పినది. జీవబ్రహ్మ అభేదయోగమని, కూడా అంటారు.

రెంటి మధ్య భేదం లేనపుడు అదే మోక్షమని, అదే ఆనంద స్వరూపమని అంటారు. ఇదే పరమార్థ సత్యమైనా – సత్యపి. అపి - ఐనా; అపియని ఎప్పుడైతే అన్నామో చెప్పిన దానికి విరుద్ధంగా ఏదో చెప్పబోతున్నా మన్నమాట. నీవు. నేను అనే భేదభావం కనుమరుగైనా ఇంకా ఏదో చెప్పబోతున్నారు.

శంకరులు అద్వైత స్థాపనాచార్యులు కదా! అభేద అద్వైతం మినహా ఏమీ చెప్పరు. మరి అయినా అని ఎందుకంటున్నారు?

ఇక్కడ భక్తునిగా మాట్లాడుతున్నారు. జ్ఞానిగా నున్నపుడు జ్ఞానమార్గా వలంబులకు జ్ఞానం గురించి చెప్పారు. అందువల్ల వారినుద్దేశించి భాష్యాలను, ప్రకరణ గ్రంథాలను రచించారు. ఆ దశలో జీవాత్మ, పరమాత్మలని ఇద్దరు లేరు. బ్రహ్మమే పరమసత్యం. జీవుడు కూడా బ్రహ్మమే. ఈ జగత్తంతా మాయయని అపుడన్నారు.

ఇక ఇపుడు చెప్పేవాడొకడు, వినేవాడొకడు కన్పిస్తున్నారు. అంతా బ్రహ్మమైతే, ప్రపంచం మాయయైతే చెప్పడం ఏమిటి? వినడం ఏమిటి?

వారు సర్వజ్ఞులు. ఏ పని లేనపుడు, అన్నీ అణగినపుడు, అంతా స్తిమితమైనపుడు జీవబ్రహ్మలు ఒకటని అనుభవంలోకి వస్తుంది. ఇక సృష్టి విషయంలో పరమాత్మ, జీవులుగా మారి తన మాయా శక్తి వల్ల ఈ క్రియా ప్రపంచాన్ని సృష్టించడమూ జరుగుతోంది. కనబడే ప్రపంచం,. నిత్యసత్యం కాకపోయినా, నిష్క్రియుడైన బ్రహ్మయే దీనికాధారం. అట్టి కారణ బ్రహ్మలో లీనం కావడమే అంతిమ లక్ష్యం. ఇట్లా ఆలోచించడం బాగానే ఉంటుంది. ఈ ప్రపంచం నిత్యసత్యం కాకపోయినా నిత్యసత్యంగా కన్పిస్తోంది. నిర్వికల్ప సమాధిలో జ్ఞాని పరమసత్యంలో లీనమైనా ఆ బ్రహ్మమే ప్రపంచ వ్యవహారాలను తీర్చిదిద్దుటకు ఈశ్వరునిగా అవతరించి జ్ఞానితో అంతా ఒకటని తెలిసినా ప్రపంచ వ్యవహారాలలో అడుగిడినపుడు సదుపదేశాన్ని ప్రజలకు అందించుమని అంటున్నాడు. అనగా నిస్స్వార్థ కర్మ చేసి ప్రజలకు

ఉపయోగపడుమని అంటున్నాడు. అనగా జ్ఞానిని సంసార లంపటంలో చిక్కుకొనకుండా ప్రపంచానికి హితోపదేశం చేయుమని ప్రేరేపణ చేస్తున్నాడు. అప్పుడు తానువేరు, తనకంటే మరొకటి అనే భేదభావానికి ఆపాదించుకొంటున్నాడు. ఇదంతా లోకహితం కోసమే. ఆ సందర్భంలో భగవద్భక్తి కావాలి. అంతా ఒకటని నీవనుకొన్నా జగత్తు, భేద భావంతో నిండింది కదా! అందువల్ల ఆ దశలో గ్రంథ రచనలు, దేశాటనలు, మొదలగు వాటిని శంకరులు నిర్వహించారు. నిరాకార నిర్గుణ బ్రహ్మానుభవం కలిగినా తాను ఈశ్వరాంశ కనుక ఉపదేశం చేయవలసి వచ్చింది. బ్రహ్మమే, ఈశ్వరునిగా, అనగా సగుణమూర్తిగా అవతరించి నిర్వహిస్తున్నాడు కదా!

ఈ దృష్టిలో మూడవ శ్లోకం వ్రాయబడింది. మహోన్నత స్థితిలో జీవ-బ్రహ్మ భేదం అంతరించగా ఉన్నది సత్-స్వరూపమే. అట్టి అనుభవం రానంత వరకూ ప్రపంచంలోనే ఉన్నాము కనుక, ఈశ్వరుడీ ప్రపంచాన్ని ఏలుతున్నాడు కనుక, పరిమిత శక్తులు కల జీవులున్నారు కనుక, అట్టి స్థితిలో జీవుడు, ఈశ్వరుడూ ఒక్కడే అని చెప్పకూడదు.

అయితే అద్వైతాన్ని తప్పని అంటామా? కాదు. మనకు సందేహం వచ్చినపుడు మనలనిట్లా సమాధానబుచ్చుతారు. సముద్రము, తరంగములు - భిన్నమా? అభిన్నమా? సముద్రంపైన తరంగాలు. లోతునకు వెళ్లే కొలదీ లేవు. ఏకంగానే ఉంటుంది. అట్లాగే అంతర్ముఖులమైతే పెక్కు జీవాత్మలు లేరు, అనగా తరంగాలు లేవు. అంతా పరమాత్మ సాగరమే. అదే అద్వైత స్థితి. కాని సముద్రంపైన తరంగాలుంటాయి. గాలి వల్ల ఈ కెరటాలేర్పడ్డాయి. అట్లాగే మాయవల్ల పెక్కు మంది జీవులున్నట్లుగా కన్పిస్తోంది. పెక్కు కెరటాలనే - జీవులని; పరమాత్మనే సముద్రమని భావిస్తున్నాం.

ఆ దశలో ప్రతి కెరటమూ నేను సముద్రాన్నని చెప్పడం తప్పు కదా! ఆ కెరటాలేమనాలి? మేమంతా ఒక సముద్రం నుండి వచ్చిన కెరటాలమని చెప్పాలి.

అద్వైతానుభూతిలో అంతా ఒకటైనా 'సత్యపి భేదాపగమే' – వ్యవహార దశలో జీవులమైన మేము సంపూర్ణంగా మీకే చెందుతాము. ఎందువల్ల? సముద్రం లేకపోతే కెరటాలెక్కడి నుండి వస్తాయి?

నాథ! తవాహం నమామకీనస్త్వం

నాథ తవాహం = నేను నీ వాడినే. నమామకీనస్త్వం = నీవు నా వాడివి కావు.

హే భగవాన్! నేను నీ వాడిని. నీవు యజమానివి. నీవు నా వాడివి కావు. తరంగాలు లేకపోతే సముద్రం ప్రశాంతంగా ఉంటుంది. ఇది అట్టడుగు దశలో. అట్లాగే జీవుడు, ప్రపంచం లేకపోయినా నీకు, నీవుగా ఉండగలవు. కాని సముద్రం లేకుండా తరంగాలు లేవు కదా! అట్లాగే నీవు లేకపోతే నేను లేను. నేను, నీవు ఒకటని నేననుకొన్నా. వ్యవహార దశలో భిన్నత్వం కనబడుతూ ఉండగా నీవు నావాడవని, నీవు నాపై ఆధారపడ్డావని అనడం అసందర్భం కదా! నేనట్లా అంటే తరంగాలకు సంబంధించినది సముద్రమని, తరంగాలు సముద్రానికి చెందవని అనే అసందర్భ ప్రేలాపన ప్రేలాపించి నట్లౌతుంది.

సముద్రోహి తారంగః క్వచన సముద్రోన తారంగః

తరంగమనగా కెరటం. జలతరంగమని అంటాం. తరంగం సముద్రానికి చెందింది. కాని సముద్రం తరంగాలకు చెందదు. ఎప్పుడు కూడా క్వచన= పొరపాటుగా కూడా. పరమాత్మ, జీవాత్మలపై ఆధారపడ్డాడని అనకూడదు. అందువల్ల 'క్వచన' అన్నాడు. కనుక శంకరులు అందరికీ అన్ని దశలలోనూ అద్వైతాన్ని నూరిపోయలేదు.

తాయుమన్నవార్ అన్నీ నీకే చెందుతాయని కీర్తించాడు.

శైవ, వైష్ణవ సిద్ధాంతాలకు భిన్నంగా గట్టిగా అద్వైతాన్ని శంకరులు స్థాపించినా వ్యవహారదశలో అద్వైతం పనికి రాదని తాను ఈశ్వరుడని

జీవుడు భావించ కూడదని, అంశగానే భావించాలని అన్నారు. అందువల్ల ప్రతి జీవుడు వినయ భరితుడైయుండాలి. మిగిలిన శైవ వైష్ణవ భక్తుల మాదిరిగానే భగవానుని పట్ల భక్తి కలిగియుండాలి. అందువల్లనే మొదటి శ్లోకం వినయంతోనే ఆరంభింపబడింది.

కనుక తన సిద్ధాంతంపట్ల శంకరులు మంకుపట్టు చూపించలేదు. చివరి స్థితికి చేరుకోలేని వారు ద్వైత స్థితిలోనే యుండి భగవానుని భజించాలన్నారు. ద్వైతులు అద్వైతాన్ని గెంటివేయడం కంటే కూడా అపరిపక్వమనస్కులకు అద్వైతం పనికిరాదని తీవ్రంగా తిరస్కరించారు.

నిర్గుణానందమెట్టిదో సగుణ రూపానికి చెందిన భక్తి కూడా అంత ఆనందాన్నిస్తుంది. అతడు మన స్వామి, అతని సేవకులం మనం, అతని పట్ల వినయ విధేయతలతో ఉండాలని భావించినపుడు ఆనందం కలుగదా? అందువల్లనే నీవొక సముద్రాన్ని వైతే నేనొక తరంగాన్ని. నీవు లేకుండా నా ఉనికి ఎట్లా? నేను నీ ఆధీనంలో ఉన్నా. ఇట్లా భావించిన వారు, రామానుజ, మధ్వమతస్థులకు ఏమీ తీసిపోరు.

ఆశ్చర్యం గొలిపించే అంతాది

ఈ స్తోత్రం రకరకాల సొగసులతో ఉంటుంది. నాల్గవ శ్లోకంలో మాటలతో ఎట్లా బంతులాడుతారో చూడండి.

శ్లోకంలో 'అంతాదిని' విని సంతోషిస్తాం. కంబ మహాకవి సరస్వతీ అంతాది, శఠగోపర్ అంతాది మొదలైనవి వ్రాసేడు. నమ్మాళ్వార్ ప్రబంధమైన తిరువాయి మొళిలో పద్యాలన్నీ అంతాదులే. నాలాయిర దివ్య ప్రబంధంలో మొదటి ముగ్గురు ఆళ్వార్లు భగవద్దర్శనమైన వెనుక అంతాదులతోనే కీర్తించారు. ఈనాడు తమిళ దేశంలో అభిరామ అంతాది ప్రసిద్ధం.

అంతమనగా చివర. ఆదియనగా మొదలు. పరమాత్మను ఆద్యంత రహితుడని అంటాం. మాణిక్య వాచకులు, తమ తిరువెంబావైని ఆది - అంత పదాలతో ఆరంభించారు.

సాహిత్య శైలిలో అంతాది ఏమిటి? మొదటి పద్యంలోని చివరి అక్షరం, తరువాతి పద్యంలోని మొదటి అక్షరమౌతుంది.

ఉదా: పోగ్గై ఆళ్వార్ మహావిష్ణువును దక్షిణామూర్తిగా నుతించారు. మొదటి పద్యంలోని చివరి మాట అరన్ (శివుడు). రెండవ పద్యంలో హరిహర అభేదాన్ని సూచిస్తూ ఆ అరన్‌ను ఆదిపదంగా వాడారు.

ఇట్లా వ్రాయడం, ఒక మాలను గ్రుచ్చినట్లుగా ఉంటుంది. కంఠస్థం చేయడానికి వీలుగా ఉంటుంది.

మొదటి పద్యాన్ని అరన్‌తో ముగించినపుడు, రెండవ పద్యం మొదటి అక్షరం అరన్ కదా అని గుర్తుకు వస్తుంది.

మన శంకరులు అప్రయత్నంగా వాడారు. ఒక శ్లోకం చివర అక్షరం, రెండవ శ్లోకంలో మొదటి అక్షరం అనే రీతిలో కాకుండా ఒక శ్లోకంలోనే అంత, ఆదులను సమకూర్చారు. శ్లోకం చూడండి:

ఉద్ధృతనగ! నగభిదనుజ

దనుజ కులామిత్ర! మిత్ర శశిదృష్టే

దృష్టేభవతి..... ఇంతవరకూ అంతాది మార్గంలో వ్రాసేరు. 'ఉద్ధృతనగ' - మరల 'నగభిదనుజ' - ఇట్లా, ఇట్లా పదాంతాన్ని, మరల పదాదిలో చేర్చుట ఆశ్చర్యంగా లేదూ! దీనినే ముక్త పదగ్రస్తం అంటారు. అనగా విడువబడిన మాటను మరల గ్రహించుట.

రెండవ పాదంలో చివరలో దృష్టే. మూడవ పాదంలో మరల దృష్టే భవతి - వచ్చింది.

మూడవ పాదం పూర్తిగా - దృష్టే భవతి ప్రభవతిన...

నాల్గవ పాదం : భవతి కింభవ తిరస్కారః

మొత్తం శ్లోకం:

ఉద్ధృతనగ! నగభిదనుజ
దనుజకులామిత్ర! మిత్రశశిదృష్టే
దృష్టే భవతి ప్రభవతిన
భవతి కిం భవతిరస్కారః

ఆపకుండా చదివిచూడండి. ఎంత వినసొంపుగా ఉంటుందో! అందమైన మాటల కూర్పే కాదు. భావంలో కూడా అందం ఉండాలి, ఇందు శబ్ద సౌందర్యం, అర్థ సౌందర్యం రెండూ ఉన్నాయి.

ఉద్ధృతనగ. నగమనగా పర్వతం. గం అనగా కదలిక, కంపనం, నడుచుట. పర్వతం నడవదు, కంపించదు కనుక అచలం, అగం, నగం అని అంటారు. అమ్మవారిని గిరిజ అంటున్నాం. ఆమె అగజ, నగజ మొదలైన నామాలతో నుతిస్తారు.

వినాయకుని నుతిస్తూ 'అగజానన పద్మార్కం గజాననం' అంటున్నాం. అతడు గజాననుడు. ఏనుగు ముఖం కలవాడు. గజాననమ్‌కి విరుద్ధం అగజాననం. అర్థం విచారిస్తే గజాననుడు సూర్యుడు కాగా పద్మముఖం కలిగిన అమ్మవారి ముఖం వికసిస్తోంది.

అగజ = పార్వతి. ఆనన = ముఖం. అర్కుడనగా సూర్యుడు. సూర్యుని వల్లనే పద్మ వికాసం కదా! అగజానన పద్మార్కం గజాననం.

అగం అన్నా నగం అన్నా ఒక్కటే. ఉద్ధృతనగ = పర్వతమెత్తిన వాడా! మీరాబాయి 'గిరిధర' గోపాలునే కీర్తించింది.

భగవానుడు రెండు పర్యాయాలలో పర్వతాన్ని ఎత్తాడు. మొదట క్షీరసాగరాన్ని మథించే సందర్భంలో మందర పర్వతం కవ్వంకాగా, వాసుకి

త్రాడుగా విష్ణువు కూర్మావతారం ధరించి, పర్వతం స్థిరంగా ఉండడానికి దోహదం చేసాడు కదా!

కృష్ణావతారంలో ఇంద్రకోపం వల్ల వర్షంకురుస్తూ ఉండగా గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గొడుగుగా పట్టుకొని వర్షం నుండి గోకులాన్ని రక్షించాడు గిరిధర గోపాలుడు. మన కర్మభారం కూడా పర్వతం వంటిదే. భగవంతుడే, మోయగలడు. బాలకృష్ణుని మాదిరిగా చిటికెన వ్రేలుతో ఎత్తగలడు.

ఇక నగభిదనుజ – నగభిత్ + అనుజ. అనగా పర్వతాలను బ్రద్దలు కొట్టిన వాడు ఇంద్రుడు. పూర్వ కాలంలో దేవేంద్రుడు, పర్వతాల రెక్కలను వజ్రాయుధంతో నరికి వేసాడని కథ. అతనికి అనుజుడు, అనగా తరువాత పుట్టినవాడు. పూర్వజుడు, అనుజుడనే మాటలున్నాయి కదా!

రామానుజుడనగా రాముని అనుజుడు, లక్ష్మణుడు, ఆది శేషుని అవతారమే. రామానుజులను ఆది శేషావతారంగా భావిస్తారు. వారు ఆశ్రమ స్వీకారం తీసికోక పూర్వం వారి నామం లక్ష్మణులే!

విష్ణువు ఇంద్రుని తమ్ముడెప్పుడయ్యాడు? వామనావతారంలో. ఇంద్రాది దేవతలు అదితి కశ్యపులకు బిడ్డలుగా పుట్టారు. మహాబలిని అణచుటకు భగవానుడు వామనుడై వారికే పుట్టాడు. కనుక ఇంద్రుని తమ్ముడయ్యాడు. అతడే ఉపేంద్రుడు.

కృష్ణావతారంలో గోవర్ధన గిరినెత్తి ఇంద్రుని గర్వాన్ని అణిచాడు. అపుడు ఉద్ధృతనగుడయ్యాడు. అంతకు ముందున్న వామనావతారంలో అతడే ఇంద్రుని తమ్ముడయ్యాడు. అనగా నగభిదనుజుడయ్యాడు. బలిని అణచి ఇంద్రునకు దేవలోకాధిపత్యాన్ని ప్రసాదించాడు. భగవానునకు ఒకరిపై ద్వేషం, ఒకరిపై రాగం ఉంటుందా? ఎవరైతే ధర్మమార్గంలో ప్రయాణిస్తూ ఉంటారో వారిపై ప్రేమానురాగాలను చూపిస్తాడు. ఒకడు దురహంకారంతో ఉన్నపుడు అతణ్ణి శిక్షిస్తూ ఉంటాడు. ఇదంతా వ్యక్తుల నడవడికనుబట్టి యుంటుంది.

భగవానుని భిన్న ప్రవృత్తిని శంకరులెత్తి చూపించారీ శ్లోకంలో. ఉద్ధృతనగ నగభిదనుజ.

దనుజ కులామిత్ర – దనుజులనగా అసురులు. దనువనే స్త్రీకి పుట్టినవారు దనుజులు. దనువు కూడా కశ్యపుని భార్యయే. దేవతల తండ్రి కూడా కశ్యపుడే. కశ్యపుని మరొక భార్యపేరు దితి. ఆమెకితని వల్ల కలిగిన సంతానం దైత్యులు. వాళ్లూ అసురులే. దనువు సంతానం, దానవులు.

నగభిదనుజ – నగభిత్+అనుజ. కలిపినపుడు నగభిదనుజ. అంతేగాని నగభి+దనుజ అని విడదీయకూడదు. సంధిలోనే దకారం. అంతాదిక్కై ఇట్లా ఉంచారు.

అనేక శ్లోకాలు చిత్రవిచిత్రంగా ఉంటాయి. 'అగజానన పద్మార్కం' ఉంది. 'అనేక దంతం భక్తానాం ఏక దంతముపాస్మహే'. ఏక దంతుడు, అనేక దంతుడెట్లా అయ్యాడు? అనేక + దం+ తం అని విడదీయాలి. భక్తానాం+ అనేకదం+ తం. వినాయకుడు భక్తులకు ఎన్నో వరాలనిస్తాడు కదా. అనేకదం, తం, భక్తానాం ఏకదంతం, ఉపాస్మహే. మాటిమాటికీ ఒక అక్షరం వస్తూ ఉంటే వినసొంపుగా ఉంటుంది. ఇప్పుడెట్లా అన్వయించాలి? భక్తానాం - అనేక దం - ఏకదంతం – ఉపాస్మహే = అనగా ఒక్క దంతం కలవానిని అనేకమైన వాటిని ఇచ్చే వానిని కొలుస్తున్నానని.

దనుజకులామిత్ర = అనగా అసురులకు అనగా దనుజులకు శత్రువు.

అదితి కశ్యపులకు ఇంద్రుని తమ్మునిగా విష్ణువు అవతరించినపుడు దనుజులు (అసురులు) ఇతనికే సోదరులేకదా! బాంధవ్యాన్ని గణించకుండా ధర్మాధర్మ విచక్షణలో దనుజులకు శత్రువయ్యాడు.

ఇతడు, ఇంద్రునకిష్టుడయ్యాడు. ఆ ఇంద్రుడేమో కొన్ని మంచి పనులు. కొన్ని చెడ్డ పనులు చేసినట్లు కథలున్నాయి. మహాబలి నుండి రాజ్యాన్ని తిరిగి గ్రహించి ఇంద్రునకు కట్టబెట్టాడు. అదే విష్ణువు గోవర్ధన గిరినెత్తి

ఇంద్రుని గర్వాన్ని పోగొట్టాడు. ఇంద్రుడు కాళ్లావేళ్లా బడ్డాడు. దనుజులు సోదరులైనా వారి పట్ల శత్రుత్వం వహించాడు.

చివరి మాటను, తరువాత వచ్చే మాటను శ్లోకం ఎట్లా కలిపి చూపిస్తుందో భగవంతుడు, ఉద్ధరించడాన్ని, శిక్షించడాన్ని కలిపే చేస్తున్నట్లు లేదూ!

'మిత్ర శశి దృష్టే' - మిత్రుడనగా స్నేహితుడని తెలుసు. బంధుమిత్ర పదం ఉంది. మిత్రునికి విరుద్ధం అమిత్రుడు. ఇక్కడ మిత్రుడనగా సూర్యుడు. రెండు భిన్నమైన అర్థాలున్నా ఒకే పదాన్ని వాడారు.

వేదంలో సూర్యుణ్ణి మిత్రపదంతోటే వ్యవహారం. కొన్ని సంవత్సరాల వెనుక సూర్యారాధన అనేక దేశాలలో ఉంది. విదేశాలలో మిత్రపదం బహుళంగా ఉంది. క్రీ.పూ. 1300 నాడు ఏదైనా ఒక సంధి పత్రం వ్రాసినపుడు (Ramesses II with Hittites సంధి పత్రం) మిత్రావరుణులు సాక్షులని వ్రాసేవారు.

శశి-చంద్రుడు! కాంతిమంతుడైన చంద్రుణ్ణి తేరిపార చూస్తే ఒక ఛాయ అందు కనబడుతుంది. అది కుందేలులా ఉంటుంది. సంస్కృతంలో దానిని శశం అంటారు. శశం గుర్తుగా కలవాడు. కనుక చంద్రుడు, శశాంకుడయ్యాడు. శశి కూడా.

సూర్యుడు, చంద్రుడు కన్నులుగా కలవాడనే అర్థంలో మిత్ర-శశిదృష్టే. విశ్వరూప సందర్శనంలో సూర్యుడు కుడి కన్నుగా, చంద్రుడు ఎడమ కన్నుగా ఉంటాడు.

ఈ పదం ఇంకో దాన్ని గుర్తుకు తెస్తోంది. ఇంద్రుని తమ్ముడు, దనుజులకు అమిత్రుడనగా వామనావతారం ధరించినవాడు. వామనుడు, విశ్వరూపాన్ని ధరించి త్రివిక్రముడై సూర్యచంద్రులను కన్నులుగా చేసికొన్నాడు.

విష్ణు సహస్ర నామాల పూర్వభాగంలో భూఃపాదౌ అనే శ్లోకంలో చంద్ర సూర్యౌచనేత్రే అని ఉంది. ఇక్కడ మిత్ర శశి దృష్టే ఉంది.

దర్శనం వల్ల సంసారం తొలగిపోవుట

దృష్టే భవతి ప్రభవతిస

భవతి కిం భవతిరస్కారః

ఇందు 'భవతి'ని నాల్గు సార్లు వాడారు, భిన్నార్థాలలో. కవులను మించిపోయే శంకరుల భాషా చమత్కారాన్ని చూడండి.

దృష్టే భవతి – భవతి = నీలో; ఎవరినైనా గౌరవించేటపుడు భవాన్ అని అనాలి. స్త్రీ లింగమైతే భవతి. భవతి భిక్షాం దేహి అని ఉపనయనంలో అంటారు కదా!

భవతి – క్రియగా వాడబడినపుడు అగుచున్నదై అని. ఈ అర్థాన్ని దృష్టే భవతిలో స్వీకరించాలి.

దృష్టే భవతి – మా దృష్టి నీ మీద ఉండగా అనగా నీవు దర్శనం ఇప్పిస్తూ ఉండగా ఎవరాయన? జగత్పాలకుడు కదా! ప్రభవతి భవతి దృష్టే = మా దృష్టి నీయందు, జగత్పాలకుడైన నీయందుంచగా అని అర్థం. ఆ దర్శనం వల్ల నీవేమి గడిస్తావు?

స భవతి కిం భవతిరస్కారః

భవ–తిరస్కార = తిరస్కారమనగా దాచుట. తిరస్కరిణీ విద్యను మాంత్రికుడు చూపిస్తాడు. భవం అనగా సంసారం. భవభయఖేదచ్ఛిదే అని చదువు కొన్నాం లోగడ. భవ తిరస్కరణ మనగా సంసార బంధాన్ని, సంసార జీవితాన్ని పోగొట్టి అని అర్థం. నభవతికిం, ఇక్కడ భవతి, క్రియ అనగా అది జరుగదా అని అర్థం. సంసారం అదృశ్యం కాదా? నీ దర్శనం లభించగా సంసారం అదృశ్యం కాదా? అని ప్రశ్న రూపంలో అడుగుతున్నారు.

గీతలో (2.59) పరమాత్మ దర్శనమైన వెనుక నీ మనస్సులో ఉన్న అనేక వాసనలు, లేదా అనేక సంస్కారాలు మటుమాయమౌతాయని అన్నాడు.

దానితో బాటు సంసారమూ అదృశ్యమౌతుందని అర్థం. 'పరం దృష్ట్వా' అని గీతలో ఉండగా, శంకరులు 'దృష్టే భవతి' అన్నారు. భగవత్ దర్శన అద్వైతసాక్షాత్కారానికో, ద్వైత దర్శనానికో చెందవచ్చు. ఏదైనా జీవనమరణ ప్రవాహంలో చిక్కుకోవడం అంటూ ఉండదు. అట్టిది జరుగదా? జరగకుండా పోతుందా? 'నభవతికిం భవతిరస్కారః'.

శ్రీహరికి ఈశ్వర శబ్దం

ఐదవ శ్లోకం చూద్దాం:

మత్స్యాదిభిరవతారైరవతారవతా సదా వసుధాం

పరమేశ్వర! పరిపాల్యో భవతా భవతాపభీతోఽహం

ఇక్కడ భవతా అని రెండుసార్లు భిన్నంగా వాడారు. మొదట దీనిని విడిగా తీసికొనాలి. భవతా యనగా నీ చేత. దానిననుసరించి భవతాప భీతోహం – (భీతః+ అహమ్) = సంసారభయం వల్ల భయపడుతున్నాను.

పరమేశ్వర పరిపాల్యో

భవతా భవతాప భీతోహం

అనగా సంసార తాపం వల్ల భయపడుతున్నాను. కనుక పరమేశ్వరుడవైన నీ చేత రక్షింపబడుదును గాక!

సాధారణంగా ఈశ్వర, పరమేశ్వర పదాలు శివుణ్ణి సూచిస్తాయి. శంకరులన్ని చోట్ల అద్వైతాన్నే చూస్తారు. శివవిష్ణు భేదాన్ని చూడరు. అందూ అభేదాన్నే. వారి గ్రంథమైన ప్రశ్నోత్తర మాలిక, ప్రశ్న సమాధానాల రూపంలో ఉంటుంది. భగవంతుడెవడు? కశ్చభగవాన్? శంకర నారాయణాత్మైక రూపః అని సమాధానం. శంకరనారాయణుడైన ఒక్కడే. శంకరనారాయణాత్మకః ఏకః. ఇందు హరిహర భేదాన్ని చూసారా? నారాయణుడు కూడా మహేశ్వరుడే పరమేశ్వరుడే కనుక మన శ్లోకంలో పరమేశ్వర అని విష్ణువును

సంబోధించారు. నీ చేత రక్షింపబడాలన్నారు. శ్లోకంలో రెండవ పాదంలో వతా, వతా అని వచ్చింది కదా! ఏమిటి?

అవతారాలు

మత్స్యాదిభిః + అవతారైః = మత్స్యాదిభిరవతారైః = మత్స్య మొదలైన అవతారములచేత. ఇక్కడ దశావతారాలను లోక రక్షణకై ధరిస్తున్నాడు విష్ణువు.

లోక రక్షణం ఏమిటి? ఒక పెద్ద ప్రభుత్వం పెద్ద న్యాయస్థానం, పెద్ద సైన్యం, రక్షక భట వ్యవస్థ – ఇవన్నీ అన్ని 'దేశాలలో ఉన్నట్లు కాదు. వేదాలు రక్షింపబడితే అందరి స్వధర్మాన్ని అందరూ ఆచరించగలిగితే అదే లోకరక్షణ. వేద రక్షణమే లోక రక్షణం. వేద ధ్వని నలుమూలలా వినిపించాలి. వేద యజ్ఞాల వల్ల దేవతలకు తృప్తి కలగాలి. తద్వారా ప్రపంచరక్ష కలుగుతుంది. ఎక్కడ వేదధర్మం క్షీణించిందో అక్కడ పతనం. అపుడు పాలన కర్తయైన విష్ణువు అవతరిస్తాడు. మరల వేద ధర్మాన్ని ఉద్ధరిస్తాడు.

సోమకాసురుడు, హయగ్రీవుడు వంటి వారు వేదాలను నీళ్లల్లో దాచి వేసారు. మత్స్యావతారమెత్తి వేదాలను ఉద్ధరించాడు విష్ణువు. ఇదే మాట, ప్రలయ పయోధి జలే – అని జయదేవుడు అష్టపదిలో కీర్తించాడు.

దశావతారాలు భూమిపై అవతరించినవే. చివరకు వైకుంఠానికి అనగా పరమపదానికి వెడతాడు. అవతారమనగా దిగివచ్చుట. తారయనగా సంగీతంలో తారస్థాయిని అనగా పై స్థాయిని సూచిస్తుంది. దానికి భిన్నమైనది అవతారం.

ఇట్లా ఎందుకు దిగుతాడు, కేవలం దయతోనే. మనలను ఉద్ధరించడానికే!

శ్లోకంలోని అవతారవతా = ఇట్లా దిగి వచ్చుటను; మత్స్యాదిభిః అవతారైః = మత్స్యాది అవతారములచే, అవతారవతా = దిగివచ్చుటను, అర్థం చేసికోవాలి. అవతారవతా వతా – ఇక్కడ మూడు 'వతా'లున్నాయి. తరువాత

అవతాలో అపయనగా రక్షించుట. చాలా కీర్తనలలో మామవ - అని ఉంటుంది కదా! మామ్ + అవ = నన్ను రక్షించు అని.

అవతారవతా సదా వసుధాం = ఈ భూమిని ఎల్లపుడూ అవతారాలచే రక్షించుట.

వసు అనగా సంపదలు. భూమి అనేక సంపదలనిస్తోంది కనుక అది వసుధ. వసుంధర కూడా ఈ వసుధ, పాప కళంకితమైతే దానిని రక్షించుటకు అవతరిస్తూ ఉంటాడు.

అన్ని పాపాలు భరించిన భూదేవి, విష్ణువు దగ్గరకు వెళ్లి మొరపెట్టుకొంది. ఎప్పుడు? తాను భరించలేని స్థితిలో ఉన్నపుడు. అప్పుడాయన అవతరిస్తాడు. కృష్ణుడట్లా అవతరించి గోపాలకుడయ్యాడని భాగవతం పేర్కొంది.

శ్లోకతాత్పర్యం : పరమేశ్వర! మత్స్యాది అవతారాలనెత్తి ప్రపంచాన్ని రక్షిస్తున్నావు. నేను సంసార తాపంచే బాధపడుతున్నాను. నన్ను రక్షించవయ్యా.

అవతారవతా - భవతా - భవతాప - ఆ పదాలను బట్టి మాటి మాటికీ అవతారాలెత్తుటను సూచిస్తోంది కదా! (అదే శబ్దం చేసే సవ్వడి. Sound Echoing Sense)

విష్ణువే మాటి మాటికీ అవతారాలెత్తుతూ ఉంటాడు, అతనికే గర్భవాస నరకము, మా ఈశ్వరునకు అట్టి బాధలేదని శైవులంటారు. పరమ దయ, మా విష్ణువునకు ఉండడం వల్లనే ప్రజలను ఉద్ధరించడం కోసం అవతరిస్తూ ఉంటాడని, అట్టిదయాగుణం, ఈశ్వరునకు లేదని వైష్ణవులంటారు. అట్టి సందర్భంలో శంకరులు, విష్ణువును పరమేశ్వర అని సంబోధించారు. ఇరు పక్షాలవారిని సంతృప్తిపరచారు.

హరియే పురుషోత్తముడని, పురుషులలో గౌరవింపదగిన వాడు, ప్రశంసింపదగిన వాడని; త్ర్యంబకుడు (మూడు కన్నులు కలవాడు) మహేశ్వరుడని, ఇతరులెవ్వరూ కాదని కాళిదాసంటాడు.

హరిర్యదైకః పురుషోత్తమ స్మృతః

మహేశ్వరః త్ర్యంబక ఏవ నాపరః

అమర నిఘంటువులో కూడా ఈశ్వరః శర్వ ఈశానః అని ఈశ్వర పదం శివుణ్ణే సూచిస్తుందని ఉంది.

శివవిష్ణు భేదం అణుమాత్రం చూపించకుండా మహావిష్ణువును, పరమేశ్వరుడని పేర్కొన్నారు. గమనించారా?

12 నామాలు - నుదిటిపై నామం

తరువాతి శ్లోకం:

దామోదర! గుణమందిర! సుందరవదనారవిందగోవింద

భవజలధి మథన మందర పరమందర మపనయత్వంమే

అందమైన మాటలతో పదాల చివర 'ంద'లతో శ్లోకాన్ని వ్రాసేరు. ఈ నాదం, ప్రతి చరణంలోనూ ఉంది. నాల్గవ చరణంలో పరమందరం (పరమం-దరం) లోగడ చెప్పిన అనేకదం తం అనేక దంతమైనట్లుంది.

దామోదర, గోవింద, గుణమందిర సుందర వదనారవింద అనే పదాలు స్వామిని సంబోధిస్తున్నాయి. ఇందు దామోదర, గోవింద పదాలు ప్రసిద్ధం.

మహావిష్ణువును 12 నామాలతో కీర్తిస్తారు. పరమేశ్వరుణ్ణి ఎనిమిది నామాలతో కీర్తిస్తారు. అవి భవ, శర్వ, ఈశాన, పశుపతి, ఉగ్ర, రుద్ర, భీమ. మనం సహస్రనామార్చన చేసినా, త్రిశతి (300) గాని; అష్టోత్తర శతంగాని (108) చేసినా చివర ఈ 12 నామాలతో విష్ణువును కీర్తిస్తాం. అట్లాగే ఈశ్వరుణ్ణి పై 8 నామాలతో. అష్టోత్తరం చేయలేకపోతే కనీసం 12 నామాలైనా ఉచ్చరించాలి. వినాయకునకు 16 నామాలు.

నుదిటిపై ధరించే దానిని నామం అని పేరు కదా, ఈ మాట ఎట్లా వచ్చింది? వైష్ణవులు, శైవులు, స్మార్తులు, మాధ్వులు తమతమ సంప్రదాయాను

గుణంగా నామం ధరిస్తారు. విభూతియో, గోపీచందనమో, ఏదో ఒక నామాన్ని ధరిస్తారు. నుదిటిపైనే గాక, గుండెపై, కడుపుపై, భుజాలపై, మణికట్టుపై కూడా ధరిస్తారు. సంప్రదాయాన్ని తప్పక పాటించేవారు అన్ని చోట్ల ధరిస్తారు. 12 విష్ణు నామాలను ఉచ్చరిస్తూ 12 చోట్ల ఈ నామాలు ధరిస్తారు. తిరుమణిని (నామాన్ని) ధరించేటపుడు భగవానుని నామాలను ఉచ్చరిస్తారు. వీటిని ద్వాదశ నామాలు పెట్టుకోవడం అంటారు. అనగా భగవానుని 12 నామాలకు 12 నామాలన్నమాట.

12 నామాలను ఆచమానంలో (సంధ్యా వందనంలో) ఉచ్చరిస్తారు. ఉచ్చరించేటపుడు నోరు, కన్నులు, ముక్కు, చెవులు, భుజాలు, హృదయం, తలను స్పృశిస్తారు.

అవి కేశవ – నారాయణ – మాధవ – గోవింద – విష్ణు – మధుసూదన – త్రివిక్రమ – వామన – శ్రీధర – హృషీకేశ – పద్మనాభ – దామోదర.

చిత్రమేమంటే ఇందు అవతారపురుషులైన రామ, కృష్ణ పదాలు లేకపోవడం.

అసలు కేశవ, గోవింద, దామోదర, పదాలు కృష్ణుని పదాలే. కేశియనే రాక్షసుడు చంపాడు కనుక కేశవుడు. గోవులను రక్షించాడు కనుక గోవిందుడు.

దామోదర

ఉదరంపై త్రాటిచే కట్టబడినవాడు దామోదరుడు. దామమనగా త్రాడు.

నువ్వు వెన్నను దొంగిలిస్తున్నావు, నిన్ను త్రాటితో కడతానని యశోద కృష్ణుని బెదిరించి కట్టింది. ఆమె ఎంత పొడుగు త్రాడు కట్టినా ఇతని కడుపు కట్టబడలేదు. అలసి సొలసి యున్న తల్లిని చూసి జాలితో, ఆమె తృప్తి కోసం కట్టబడ్డాడు. ఈ ఘట్టాన్ని ఆళ్వార్లు భక్త్యావేశంతో కీర్తించారు.

నీ కడుపుపై సున్న మెత్తని చర్మం, పెళుసుగా నున్న త్రాటితో కట్టబడిందయ్యా, ఎంత ఒరిసి పోయిందో కదా! అని

స్వామి భక్త పరాధీనుడు కదా! అయితే నేను కట్టగలనని అహంకరించే వానిచే కట్టుబడతాడా? నా అంతట నేను లొంగి నీ మీద దయ చూపించినపుడు అపుడు నీవు కట్టగలవంటాడు. అతడు దామోదరుడు. మహాభారత యుద్ధం ముందు సహదేవుణ్ణి కట్టమన్నాడు. నేను నిన్ను కడతానని సహదేవుడన్నపుడు కట్టి చూడన్నాడు. వినయంతో కూడిన భక్తిని, భక్తులలో కల్గించడమే ఈ షట్పదీస్తోత్ర లక్ష్యం.

స్వామి గర్భంలో ఉండడం వల్ల దేవకీ దేవి గర్భం పవిత్రమైందని ఆండాళ్ కీర్తించింది. ఏ సవతి తల్లి తనను త్రాళ్లతో కట్టిందో అట్టి వాడు పుట్టుకచే కన్న తల్లి యొక్క గర్భాన్ని పవిత్రం చేసాడట, అని సూచించింది ఆండాళ్. ఇట్లా భక్తులు గానం చేయగా అన్నీ ఉదరమందు కలవాడని తాత్త్వికార్థం చెబుతారు.

పవిత్ర నామాల అర్థం

ఇంద్రియాలను అదుపులో ఉంచి అజమాయిషీ చేయువాడు గోవిందుడు. ఇక్కడ గోయనగా ఇంద్రియాలు. ఇంద్రియ పశువని తిరుమూలర్ అంటారు. కేశవ పదం చూడండి. క + ఈశ+ వ. కయనగా బ్రహ్మ. వేదాలలోనే అర్థం ఉంది. అయనగా విష్ణువు. తిరుపల్లువర్ వ్రాసిన మొదట పద్యంలో విష్ణు ప్రస్తావన ఉంటుంది. అతడే ప్రపంచంలో వ్యక్తీకరింపబడ్డాడని. ప్రణవంలో అ + ఉ + మ ఉన్నాయి. అ– విష్ణువు, ఉ – ఈశ్వరుడు, మ్ = బ్రహ్మ. త్రిమూర్తులను అదుపులో ఉంచువాడు పరమాత్మ (క్ + అ + ఈశులనువశంలో ఉన్నవాడు – వ) ఇందలి 'వ' వశంలో పెట్టుకొన్నవాడని అర్థం.

మాధవ పదమే తేనెలా తియ్యగా ఉంటుంది. ఇదీ కృష్ణుణ్ణి సూచిస్తుంది. మహావిష్ణువునూ సూచిస్తుంది. మధుకైటభులనే రాక్షసులను చంపాడు కనుక మాధవుడు. మా అనగా లక్ష్మి. ఆమెకు భర్త, మాధవుడు. కామాక్షి పదంలో మా, లక్ష్మిని సూచిస్తుంది. శివపత్నిని శివా అన్నట్లు బ్రహ్మ భార్యను 'కా' అనే అక్షరంతో సూచిస్తారు. అనగా సరస్వతి. అనగా సరస్వతి, లక్ష్ములను నేత్రాలుగా ధరించింది కామాక్షి. నీరజాక్షి, కామాక్షి అనే కీర్తనలో ముత్తుస్వామి దీక్షితులూ దీనిని సూచించారు. శారదా రమా నయనే అని సంబోధించారు.

మధువనే రాక్షసుణ్ణి చంపాడు కనుక మధుసూదనుడు. విష్ణువు చంపినట్లున్నా కృష్ణునకూ మధుసూదనుడనే పేరు. ఇతడు పూర్ణావతారం కదా!

హృషీకం అనగా ఇంద్రియాలు. ఆ ఇంద్రియాలను అదుపులో ఉంచువాడు హృషీకేశుడు. గీతలో కృష్ణుణ్ణి ఈ పదంతో వ్యవహరిస్తారు.

12 నామాలలో నారాయణ-విష్ణు-శ్రీధర-పద్మనాభ పదాలు మహా విష్ణువును సూచిస్తాయి. త్రివిక్రమ - వామన పదాలు వామనావతారాన్ని సూచిస్తాయి. మిగిలిన కేశవ-మాధవ-గోవింద-మధుసూదన-హృషీకేశ-దామోదర-పదాలు కృష్ణ నామాలుగా చెలామణిలో ఉన్నాయి. రామావతారాన్ని, నృసింహావతారాన్ని సూచించే పదాలు మాత్రం లేవు.

విష్ణువును త్రివిక్రమునిగా వేదమంత్రమే చెప్పింది. పురాణాలలో, భజనలలో, సంకీర్తనలలో కృష్ణుణ్ణి పూర్ణావతారంగా భావించి కీర్తిస్తారు. 12 నామాలలో ఈ అవతారనామాలు, విష్ణునామాలున్నాయి.

ఈ 12 నామాలలో దామోదర, గోవింద, నామాలను ఆరవ శ్లోకంలో శంకరులు పేర్కొన్నారు. మొదటి శ్లోకంలో అవినయమపనయ విష్ణో అని ఆరవ శ్లోకంలో రెండు నామాలేవాడి, కృష్ణుని పూర్ణావతారాన్ని స్ఫురింపచేసారు.

నిర్గుణ - గుణ నిలయ

అనగా గుణాలు లేనివాడు, గుణాలున్నవాడు. ఈ శ్లోకంలో దామోదర! గుణ మందిర! అన్నారు. గుణ మందిరమనగా సమస్త గుణాలు కలవాడు. మందిరమనగా ఉండేచోటు. విగ్రహ రూపంలో ఉంటే ఆ ప్రదేశాన్ని మందిరం అంటాం కదా! అనగా ఆలయం. ఆలయాన్ని ఉత్తర దేశంలో మందిరం అంటారు. అనంత కల్యాణ గుణాలు కలవాడగుటచే గుణ మందిరుడు.

గుణ అనగా త్రాడు. దామోదర పదంలో త్రాడనే అర్థం ఉంది కదా! ఇట్లా శబ్దాలను, అర్థాలను పడుగు పేకలుగా శంకరులల్లారు. అందువల్ల గుణమందిర పదం వాడారు.

అద్వైత శాస్త్రాల గురించి పూర్తిగా అవగాహన లేనివారు, స్వామిని గుణ మందిరమని, సమస్త గుణాలు కలిగినవాడని కీర్తించడం బాగుందా అని ప్రశ్నిస్తారు. నిర్గుణాన్ని భజించే శంకరులిట్లా అనవచ్చా అని శంక. పరమసత్యము, నిర్గుణమే అనేది వీరి సిద్ధాంతం. అది గుణ రహితం, అదే జీవాత్మ కూడా. అయితే జీవునకు మనస్సుంటే గుణాలతోనే ఉంటాడు.

జ్ఞాన విచారణచే ఆ మనస్సును గెంటివేయగలిగితే ఆ బ్రహ్మమే జీవాత్మ. అదే మోక్షం. బ్రహ్మము, నిర్గుణం. ఏక వస్తువు. రెండూ ఏక మౌతాయి. అనగా జీవ పరమాత్మలు.

శంకరులు నిర్గుణ బ్రహ్మమును కీర్తించగా మధ్వాచార్యుల వారు సగుణ బ్రహ్మను కీర్తించారు. దీనినే ప్రస్తుతం గ్రహిద్దాం.

అయితే నిర్గుణ బ్రహ్మను కీర్తించినవారు, గుణ మందిరుని కీర్తిస్తారా? కీర్తిస్తారు. సందేహం లేదు. భాష్యాలలో శంకరులు చెప్పినదేమిటి? నిర్గుణతత్త్వాన్ని గూర్చే. అదే స్వస్వరూప స్థితి. జీవాత్మ, పరమాత్మల ఏకమయ్యే స్థితి. పరమాత్మ జీవ- జగత్తులను మాయా శక్తిచే సృష్టిస్తున్నాడని, వానినేలేవాడు ఈశ్వరుడని, ఈశ్వరుడే సగుణ బ్రహ్మమని అన్నారు.

ఆ ఈశ్వరుడు మనకంటే భిన్నుడని, అతణ్ణి కొలవాలని రామానుజ, మాధ్వమతస్థులంటారు. ఈ షట్పదీస్తోత్రం వంటి అనేక స్తోత్రాలను వ్రాసిన శంకరులు సగుణ బ్రహ్మనే కీర్తించారు కదా!

ఉపాసకుడిక్కడి నుండే మొదలు పెట్టాలన్నారు. రెండవ దశలో ఉపాసించే వాడు, ఉపాసింపదగిన వానిగా మారాలన్నారు. ఆ మాట నిర్గుణ అద్వైతానికి చెందింది.

అయితే అద్వైతానుభవం పొందిన జ్ఞాని, నిర్గుణాన్నే ఎల్లవేళలా పట్టుకొంటాడా అని ప్రశ్న. అట్లా కాదు. మహా జ్ఞానులు ప్రపంచ వ్యవహారాలలో పాల్గొనడం లేదా? శుకుని దగ్గర నుండి సదాశివ బ్రహ్మేంద్రుల వరకూ అట్లాగే మన శంకరులు, ఏమీ పట్టించుకోకుండా ఉండిపోయారా? అయితే సమాధి స్థితిలో ఉండే, అన్నిటిని చక్కదిద్దారనే మాటను విస్మరించకూడదు.

జ్ఞాని, మనమాదిరిగా లోక లంపటంలో ఉన్నట్లు కన్పిస్తాడు. కాని అది నిజం కాదు. అతడు తన లక్ష్యాన్ని విస్మరించడు. తానీ పనులు చేస్తున్నానని అణు మాత్రం అహంకారం లేకుండా ఉంటాడు. తన పూర్వ మనస్సు ఎప్పుడో తన అస్తిత్వాన్ని కోల్పోయింది. అతడు చేసే పనులన్నిటినీ ఈశ్వరుడే ఇతని ద్వారా నిర్వహిస్తున్నాడు.

ఇదంతా లోక సంగ్రహం కోసమే. లోక క్షేమాన్ని ఆశించే. జ్ఞానిచేత చేయించేటపుడు జ్ఞానిని భక్తితో ముంచుతాడు. ఆ ముంచేది సగుణ బ్రహ్మమే. ఇట్టి లీలా వినోదంతో ఉంటాడు.

జ్ఞానికి సగుణ – నిర్గుణ భేదాలుండవు. సగుణ బ్రహ్మారాధనలోనూ బ్రహ్మానందాన్నే అనుభవిస్తాడు. అద్వైతానికి, ఈ ద్వైతం ముసుగువంటిది. సగుణ బ్రహ్మను, కల్యాణ గుణ రూపుడని ఎందుకు ఆరాధించకూడదు? నిర్గుణావస్థలో అంతా శాంతమయంగా ఉన్నా ఈ అర్చనను కొనసాగిస్తాడు.

అద్వైతులు-కృష్ణభక్తులు

అద్వైతులైన సదాశివ బ్రహ్మేంద్రులు బ్రహ్మణీ మానస సంచరరే అని కీర్తించారు. అనగా ఓ మనసా! నిర్గుణ బ్రహ్మానుభవాన్ని పొందుమని అన్నారు. అయినా నెమలి పింఛంతో శోభిల్లే కృష్ణుణ్ణి అందమైన పాటలో అభినుతించారు.

సగుణ మూర్తులకు చెందిన అనేక దేవతా మూర్తులపై అనేక శ్లోకాలు వ్రాసేరు శంకరులు. శిరస్సు నుండి మొదలిడి పాదాంతమూ ఉన్న మూర్తిని నుతించారు. దైవలీలలను వేనోళ్ల కొనియాడారు.

కనుక గుణమందిర అంటే నిర్గుణాన్ని విస్మరించారనీ అనకూడదు. సగుణాన్ని కాదనీ అనడం లేదు. అసలు గుణమందిర అనడం వల్ల నిర్గుణాన్ని చెబుతున్నారని అంటున్నా. ఇదేమిటి? సగుణం, నిర్గుణం ఎట్లా అవుతుంది?

ఇంద్ర ధనస్సులో ఏడు రంగులున్నాయి. అట్టి ఏడు రంగులను ఒక గుండ్రని అట్టపై విడివిడిగా చూపించి ఆ చక్రాన్ని గిరగిర త్రిప్పితే అసలు రంగులేని స్వచ్ఛకాంతి కనబడడం లేదా? అట్లాగే సగుణ మూర్తి, నిర్గుణ మూర్తి అవుతాడు కదా!

రంగులేని సూర్యకాంతి, కాంతి పరావర్తనం (Refraction) వల్ల ఏడు రంగులుగా కనబడడం లేదా? అట్లాగే నామ రూపాలకు నిలయమైన నిర్గుణము, నామ రూప జగత్తుగా మాయవల్ల కన్పిస్తోంది.

గుణ మందిర పదం వెనుక దామోదర పదం ఉంది. త్రాటిచే కట్టబడిన వాడు, దామోదరుడు. నిర్గుణుడైన గుణ మందిరుడు దామోదరుడయ్యాడు. అతడు నిజంగా గుణాలచే అనగా త్రాళ్లచే కట్టబడుతాడా? యశోద యొక్క తృప్తి కోసం గుణాలచే అనగా త్రాళ్లచే కట్టబడినట్లుగా కనబడ్డాడు.

కృష్ణకర్ణామృతంలో ఒక చక్కని శ్లోకం ఉంది. ఉపనిషత్తుల సారమైన పరబ్రహ్మము, ఒక రోటికి కట్టబడ్డాడేమిటి? ఏమిటీ ఆశ్చర్యం?

షట్పదీస్తోత్రంలో దామోదర గుణమందిర పదాలు ఒక దానివెంట ఒకటుండి పై శ్లోక భావాన్ని అందిస్తున్నాయి.

ఎప్పుడైతే కల్యాణ గుణాలు, రూపం ఉందో అప్పుడా మూర్తి శంకరులకు సుందరవదనారవిందునిగా కన్పడ్డాడు. అనగా అందమైన పద్మముఖం కలవాడుగా.

ఎందరో అద్వైతులు, ఆత్మానుభవాన్ని పొంది భగవానుని రూప సౌందర్యాన్ని నోరార కీర్తించారు. అందులో ప్రధానంగా కృష్ణ భక్తులెందరో (నారాయణ తీర్థులు మొదలైనవారు.)

అద్వైతియైన లీలాశుకుడట్టి వాడు. కేరళ ప్రాంతానికి చెందినవాడు. అక్కడ అద్వైత సంప్రదాయం ఉంది. శివపంచాక్షరిని జపిస్తున్నా, నఖలు విచారణీయా = సందేహం ఏమీ లేకుండా అని అంటూ కృష్ణ కర్ణామృతాన్ని అందించాడు.

400 సంవత్సరాల వెనుక ఒక మహావిద్వాంసుడు బెంగాల్‌లో జన్మించాడు. అతడే అద్వైతసిద్ధి వ్రాసేడు, భక్తి రసాయనాన్ని అందించాడు. అన్ని రచనలలోనూ భక్తికి, సగుణ బ్రహ్మారాధనకు జ్ఞానానికీ ఏమీ భేదం లేదని ప్రతిపాదించాడు.

అతడే మధుసూదన సరస్వతి. ఆయన గొప్ప కృష్ణ భక్తుడు. శివునకు సంబంధించిన శివమహిమ్న స్తోత్రానికితడు వ్యాఖ్య వ్రాసేడు. మహారాష్ట్ర నుండి పై భాగంలో ఉన్న ప్రాంతాలలో ఈ స్తోత్రం బహుళ ప్రచారంలో ఉంది. ఇట్లా శివస్తోత్రంపై ఈ కృష్ణభక్తుడు వ్యాఖ్య వ్రాయడాన్ని గుర్తించండి. శివ, విష్ణువుల మధ్య అభేదాన్ని చూపించినట్లే కదా!

అద్వైతి భక్తిలో మునగకూడదు, మునిగినా శంకరుల మాదిరిగా సమస్త దేవతలలో ఐకమత్యాన్ని చూడాలని చదువుతూ ఉంటాం. అయినా కృష్ణునకే అంకితమైన మధుసూదన సరస్వతిని చూసాం కదా!

మధ్వాచార్యుల వారు ఉడిపిలో కృష్ణుణ్ణి స్థాపించారు. వ్యాస తీర్థులనే విద్వాంసుడు, శంకర సిద్ధాంతాన్ని చీల్చి చెండాడాడు. అట్టి వ్యాస తీర్థుల ఖండనాలను మధుసూదనుడు తిరిగి ఖండించాడు. అతడు నిర్గుణానుభవం కలవాడే కదా! అతడూ కృష్ణుణ్ణి నోరార కీర్తించినవాడే కదా!

ఆయనే వంద శ్లోకాలు మించి కృష్ణునిపై ఆనంద మందాకినీ స్తోత్రం వ్రాసేడు. గుణానుభవానందాన్ని వ్యక్తీకరించాడు.

కృష్ణతత్వం కంటే దేనినీ చూడనన్నాడు.

కృష్ణాత్ పరం కిమపి తత్త్వం నజానే

ఇంకా ఏమంటాడంటే "యోగులు నిష్క్రియ నిర్గుణ జ్యోతిని చూచుదురు గాక... అట్లాగే కానీయండి. అట్టి ధ్యానాభ్యాసం మాకు లేదని బాధపడకండి. ఆ జ్యోతియే యమునా నదీ సైకతాలలో నీలపు కాంతిగా (కృష్ణునిగా) కనబడడం లేదా? ఆ జ్యోతిని తిలకించి నేత్రాలకు ఆనందమిద్దాం" అని అన్నాడు.

ఒక మాటు పరమాత్మలో లీనమైతే ఆ పరమాత్మ, అన్నిటా ఉన్నాడని, అన్నీ పరమాత్మలో ఉన్నాయనే భావన కలుగుతుంది. కనుక ఏ మార్గాన్నీ విడువ నవసరం లేదు. ఇట్టి దశలో నిజంగా ఆలోచిస్తే వియోగం లేదు. వియోగం, లీల కాదా! మనం కూడా విడిగా ఉన్నామని, భక్తులుగా ఉంటూ సగుణ రూపాన్ని ఎందుకు అర్చించకూడదు? సముద్రం నుండి తరంగాలు పుట్టినా తరంగాలు భిన్నంగా ఉన్నట్లుగా మనమూ ఎందుకుండకూడదు?

అందుకే స్వామి గుణమందిర, సుందర వదనారవింద అన్నారు.

గుణ మందిర పదంలో దాగిన తత్వాన్ని చెప్పాను. అయినా వినండి. నిర్గుణ పరబ్రహ్మంలో ఏ గుణాలూ లేకపోయినా అన్ని గుణాలకు అతడు నిలయుడు. ఏదో ఒక గుణాన్ని, లేదా కొన్ని గుణాలన్నాయని చెబితే అతడు నిర్గుణుడు కాదు. అటువంటప్పుడు కొన్ని గుణాలకే పరిమితుడు కావలసి

వస్తుంది. ఎవరినైనా తెల్లనైన శరీరం కల వాడంటే కేవలం తెలుపే గుర్తుకు వస్తుంది. తెల్లగా, నల్లగా, పచ్చగా ఉన్నాడంటే ఫలానా ఫలానా రంగులతో ఉన్నాడని అంటాం. ఇంకా అదనంగా రంగులను చేరిస్తే ఏం జరుగుతుంది? ఇతనికే రంగూ లేదని నిర్ణయానికి వస్తాం కదా! భిన్న భిన్న కాలాలలో భిన్న భిన్నమైన రంగులతో ఉంటాడు. ఒక్కొక్క రంగులో ఉన్నపుడు ఆ రంగే అతని నిజరూపం, ఇక ఏ రంగూ లేదని చెప్పం. కారణం ఏమంటే అనేక రంగులతో భిన్నభిన్న కాలాలలో కన్పిస్తున్నాడు. అన్ని రంగులూ ఆయనవే. ఏ రంగూ లేనివాడతడే! మంచి-చెడు; అందం-అందవికారం; పుణ్యం-పాపం; ధర్మం-అధర్మం ఇవన్నీ గుర్తుకు వస్తాయి. నిజంగా ఈ గుణాలేమీ లేనివాడు. నిర్గుణంగా ఉంటూ ఆయా గుణాలతో ఉన్నట్లుంటాడు.

అతడు అరూపుడైనా అందమైన రూపంలో మన భక్తికి తగ్గట్లు కన్పిస్తాడు. పద్మం వంటి ముఖంతో ఉన్నాడని సుందర వదనారవిందుడని అన్నారు.

అరూపుడు రూపాన్ని ఎప్పుడైతే ధరించాడో నామంలేనివాడు నామంతో (పేరుతో) ఉంటున్నాడు. అట్టి నామం గోవింద. కనుక సుందర వదనార వింద గోవింద.

గోవింద - హరనామాల ప్రత్యేకత

విష్ణు నామాలలో గోవింద, ఈశ్వర నామాలలో హర, ప్రసిద్ధిని పొందాయి.

ఎవరైనా సత్సంగానికి కూర్చున్నారంటే ఏవో మాటలు దొర్లుతూ ఉంటాయి. భగవంతుని వైపు అందర్నీ మళ్లించాలంటే నమః పార్వతీపతయే అని బిగ్గరగా అంటాం. ఇక అందరూ హరహర మహాదేవ యని అంటారు. ఇక భజన సాగుతుంది. ఈ హరనామం, అందర్నీ ఏకాగ్ర మనస్కులను చేసింది. జ్ఞాన సంబంధులు, ఈ హర నామం ప్రపంచాన్ని కప్పుగాక, ఇది అన్ని దుఃఖాలను పోగొడుతుందని అన్నారు.

అట్లాగే విష్ణుభక్తులు కూడిన చోట సర్వత్ర గోవింద కీర్తనమని అంటారు. ఒకడట్లా అనగానే గోవింద, గోవింద యని కీర్తిస్తారు. శంకరులు భజగోవిందం వ్రాసేరు కదా!

తమిళనాడులో అణ్ణామలైక్కు హరోంహర, అట్లాగే సుబ్రహ్మణ్య స్వామైక్కు హరోంహర అంటారు. చివరి మాటను కావడి ఉత్సవాలలో వాడుతారు. తిరుపతిలో గోవింద నామం వినబడుతూ ఉంటుంది.

హరనామం కంటే గోవింద నామం ఎక్కువ ప్రచారంలో ఉంది. వీర వైష్ణవులు హరనామాన్ని వాడరు. కాని అందరూ గోవింద నామాన్నే పలుకుతారు. అందుకే గోవింద నామానికి ముందు సర్వత్ర అనే పదం చేరుస్తారు. అంటే అన్ని చోట్ల. హిందూ మతం, ఏ నామాన్ని ఇష్టపడుతుందని ఎవరైనా ప్రశ్నిస్తే గోవింద నామమే అంటాను.

భగవానుడు గోవిందుడై గోవులను మేపాడు. సాదాసీదా జీవనంతోనే గోవులను, గోపాలురను ప్రేమతో, దయతో సాకాడు. భాగవతం అతని చరితను ప్రశంసించింది.

నేను వర్షంకురిపించడం వల్లనే ప్రపంచం బ్రతుకుతోందని ఇంద్రుడు గర్వించాడు. అపుడు గోకులంలో చిన్న పిల్లవాడుగా ఉన్నాడు కృష్ణుడు. ఇంద్రునకు గుణపాఠం నేర్పాలనుకొన్నాడు. ప్రతి ఏటా జరిగే ఇంద్రోత్సవాన్ని గోపాలుర చేత ఆపించాడు. అతణ్ణి కొలిచే బదులు గోవర్ధన పర్వతాన్ని పూజించండని అన్నాడు. ఇది గ్రహించి కోపించి ఎడతెగని వర్షం కురిపించాడు ఇంద్రుడు. ఆ దశలో గోవర్ధన గిరినెత్తి ప్రజలను వర్ష బాధ నుండి రక్షించాడు గోపాలుడు. ఆనాటి నుండి గిరిధర గోపాలుడయ్యాడు. కృష్ణుని కాళ్లను పట్టుకొని వేడుకొన్నాడు ఇంద్రుడు. అపుడు కృష్ణునకు గోవింద పదంతో పట్టాభిషేకం చేసాడు ఇంద్రుడు. గో అంటే ఆవే కాదు, సమస్త ప్రాణులనీ అర్థం. భాగవతం ఈ ఘట్టాన్ని గోవింద పట్టాభిషేకమన్నది. గోవిందుడు గోవులకు ఇంద్రుడయ్యాడు. గోయనగా, భూమి, వాక్కు

ఇంద్రియాలని చాలా అర్థాలున్నాయి. కనుక అన్నిటికీ పరమ లక్ష్యం, గమ్యం గోవిందుడే.

కుఱైలేకుండా గోవిందుడు

తమిళంలో కుఱై పదం బాధను, అసంపూర్ణతను సూచిస్తుంది.

రామ పట్టాభిషేకం మాదిరిగా భాగవతంలో గోవింద పట్టాభిషేకం జరిగింది. రాముని మాదిరిగా పెద్ద రాజ్యాన్ని ఏలలేదు కృష్ణుడు. అయినా ఇంద్రుడే పట్టాభిషేకం చేసాడు. కృష్ణునకు చాలా పేర్లున్నా రాజ అనే పదాన్ని గోవింద పదంవెనుకనే వాడుతారు. గోవింద రాజు.

నాకో ఆలోచన వచ్చింది. తిరుప్పావైలో ఆండాళ్ 'బాధపడని గోవింద', అన్నదేమిటి? భగవానుడు బాధపడతాడని ఎవరైనా అనుకొంటారా? బాధపడే వాళ్ళు మనమే కదా! బాధపడని గోవిందుడని ఎందుకంది? ఏదో అర్థం ఉండాలి. ఆ మాట అంటూ ఉంటూ ఎప్పుడైనా బాధపడి ఇప్పుడు బాధలేకుండా ఉన్నాడని భావించడమా?

ఆలోచించిన కొద్దీ భగవానుడు బాధపడ్డాడని, గోవిందుడైన తరువాత బాధపడలేదని అనిపిస్తుంది.

ఏమిటా బాధ? రామపట్టాభిషేకం గురించి చెప్పాను. ఈ విషయంలో బాధ పడ్డాడు. వాల్మీకి పట్టాభిషేకాన్ని వర్ణించాడిట్లా.

వశిష్ఠ, వాసుదేవ, జాబాలి, కాశ్యప, కాత్యాయన, సుయజ్ఞ, గౌతమ, విజయులు పట్టాభిషేకం చేసినట్లుంది. ఇంకా ఎట్లా ఉండట? అష్టవసువులు, ఇంద్రునకు పట్టాభిషేకం చేసినట్లుందిట.

వసవో వాసవం యథా - ఇట్టిపోలిక రాముణ్ణి కలతబెట్టింది. ఎందువల్ల? ఆ ఇంద్రుడే ఒక స్త్రీని చెరిచాడని బాలకాండలో చదివాం కదా! గౌతమ పత్నియైన అహల్య గురించి మనకు తెలుసు. అట్టి స్త్రీని తల్లిగా భావించాడు

రాముడు. పతితయైన అహల్యను పవిత్రమూర్తిగా తీర్చిదిద్దాడు. శాపవిముక్తిని ప్రసాదించాడు. శాపంతో బాధపడిన అహల్యను చూసి బాధపడ్డాడు. అప్పటి నుండి పతిత పావనుడైన రాముడయ్యాడు.

అట్టి ఇంద్రునితోనా తన పట్టాభిషేకాన్ని పోల్చుట? తప్పు చేసిన ఇంద్రునితో తనను పోల్చడమేమిటి?

మొదటి పట్టాభిషేక సన్నాహం భగ్నమైంది. రాముడరణ్యానికి వెళ్లవలసి వచ్చింది. 14 సంవత్సరాల తరువాత పట్టాభిషేకం జరిగింది. అపుడు పట్టాభి రాముడయ్యాడు. రామాయణం పారాయణ చేసిన తరువాత, ప్రవచనాలు పూర్తియైన తరువాత శ్రీరామ పట్టాభిషేకం జరుపుట. ఆసర్గను పారాయణం చేయుట జరుగుతుంది. రాముడు దేవుడైనా మానవునిగా నటించాడు కనుక మానవ సహజమైన బాధలను వ్యక్తీకరించడంలో తప్పులేదు. కనుక బాధపడ్డాడు.

మరొక సందర్భంలో రామునకు బాధ. ఇంద్రాది దేవతలే రావణుని బాధకు తట్టుకోలేక విష్ణువును ప్రార్థించారు. రావణుని కొడుకునకు ఇంద్రజిత్తని పేరు. ఇంద్రుని ఓడించాడు కనుక ఇంద్రజిత్తు అనే బిరుదు వచ్చింది. రాముడు రావణుని ఓడించగా, లక్ష్మణుడు ఇంద్రజిత్తును ఓడించాడు. రాముడు విజయరాఘవుడైనాడు. అసురులను జయించి పట్టాభిషేకం జరుపబడుతూ ఉండగా రావణుని కొడుకుచే ఓడింపబడిన ఇంద్రునితో రాముణ్ణి పోల్చడమేమిటి?

పాత్రల ఆలోచనా సరళిని బట్టి, ఇక్కడ వాల్మీకి పోల్చలేదు. పట్టాభిషేకం బాగా జరిగిందని చెప్పడం కోసం ఎనిమిది మంది ఋషులను ఎనిమిది మంది వసువులతో మాత్రమే పోల్చాడు. అట్లే రాముడు–ఇంద్రుడు. ఆ ఉత్సాహంతో 'వసవోవాసవం యథా' అన్నాడు.

భగవా... ...థ కృష్ణావతారంలో తీరింది. ఇంద్రుడు, కృష్ణుని కాళ్లపై బడ్డాడు కదా! తానే కృష్ణునకు పట్టాభిషేకం చేసాడు కదా! ఇట్లా ధ్వనింప చేసింది ఆండాళ్.

దేనికీ లోటులేకపోతే అది పరిపూర్ణ వస్తువు. పూర్ణం బ్రహ్మ సనాతనం. కనుక కృష్ణుడు పూర్ణావతారం.

గురు-దైవ-గోవింద

గోవింద పదాన్ని శంకరులెందుకు వాడారో తెలిసికొందాం. ఇది భజగోవింద స్తోత్రాన్ని బట్టి తెలుస్తుంది. ఇది సౌందర్యలహరి, శివానంద లహరి, షట్పదీస్తోత్రం వంటి స్తోత్రం కాదు. మనిషి ఎట్లా ప్రవర్తించాలో, ఏ వివేచనతో ఉండాలో వివరించే స్తోత్రమిది. అన్ని మత శాఖల వారినీ ఉద్దేశించి వ్రాయబడింది. ఈ సందర్భంలో పరమాత్మను భజింపుమని సాధారణంగా అనకుండా గోవిందుని భజింపుమని అన్నారు. ఆ నామం పట్ల వారి ప్రీతిని వెల్లడిస్తోంది.

గీతను అందించాడు కనుక కృష్ణునకు జగద్గురువని పేరు వచ్చింది. కృష్ణం వందే జగద్గురుం అనే శ్లోకాన్ని వింటూ ఉంటాం. అతని తరువాత ఆ బిరుదు శంకరులకు దక్కింది. వారు జగద్గురువులైనా తాము శిష్యులుగా భావించి తాము గురువులను నుతించారు. వారి గురువులు గోవింద భగత్పాదులు. ఇట్లా ఈ పదం, గురువును, భగవంతుని సూచిస్తోంది. కృష్ణ పరమాత్మను, తమ గురువును ఒకే నామంతో పేర్కొన్నట్లు వివేక చూడామణిలో ఉంది.

గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోస్మ్యహం

మూడు నామాలలో ఒకటి

స్వామి యొక్క 12 నామాలలో గోవిందుడొకటి. ఇంకా మహా విష్ణువునకు మూడు ప్రత్యేక నామాలు. మనం ఆచమనం చేసేటపుడు ఒక్కొక్క నామాన్ని ఉచ్ఛరించి ఆచమనం చేస్తూ ఉంటాం. శరీరంలో వివిధ భాగాలను అపుడు స్పృశిస్తూ ఉంటాం. 12 నామాల ఉచ్చారణ, శరీర భాగాలను స్పృశించడం

వల్ల శుద్ధిని పొందుతున్నాం. బొడ్డుపై భాగాలను ముట్టుకొంటాం కదా! ఆచమనంలో అచ్యుత, అనంత, గోవింద నామాలవి.

అట్లా విష్ణు ప్రీతికరమైన 12 నామాలలో ఇది ఒకటే కాదు, ఆచమనంలో లెక్కింపబడుతూ ఉంటుంది కూడా. కేశవ-నారాయణ-మాధవ-గోవింద-విష్ణు-మధుసూదన-త్రివిక్రమ - వామన - శ్రీధర - హృషీకేశ - పద్మనాభ - దామోదర - 12 నామాలు.

శంకరులు గోవింద నామాన్ని భజగోవిందం అని మూడు మార్లన్నారు. ఏదైనా ఒక దానిని గట్టిగా చెప్పవలసి వచ్చినపుడు ముమ్మారు పలుకుతాం.

అట్లాగే ఆండాళ్ కూడా గోవింద నామాన్ని ముమ్మారు పలికింది.

తిరుప్పావై చివరిపాటలో ఫలశ్రుతి ఉంది. అది మినహాయిస్తే మూడు పాటలలో గోవిందుణ్ణి ముమ్మారు కీర్తించింది. 27వ పద్యంలో గోవింద అని ఉంది. 28లో కుఱైలేని గోవిందుని స్మరించింది. 29లో మరల గోవిందుని గురించి చెప్పింది.

సంసార సముద్రాన్ని చిలుకుట

ఈ స్తోత్రంలో భవజలధి మథన మందర

భవం= సంసారం; జలధి = సముద్రము; భవజలధియనగా సంసార సముద్రం. మథనమనగా చిలుకుట. మదనుడే మన్మథుడు. మదనమనగా మత్తు కల్గించునది. మనుజులలో కామాన్ని పుట్టించి గందరగోళ పరిచేవాడు మన్మథుడు. కవ్వంతో చిలుకుతూ ఉంటాం. మందరమంటే మందర పర్వతం. భవజలధి మథన మందర అనగా నీవు సంసార సాగరాన్ని మథించే మందర పర్వతం వంటివాడవని.

దేవతలు, రాక్షసులు అమృతం కోసం, క్షీరాబ్ధిని మథించే సమయంలో మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని త్రాడుగా ఏర్పాటు చేసికొన్నారు.

సంసార సముద్రము మరణాన్నిచ్చే భూమిక. మనకు కావలసినది మోక్షమనే అమృతం. కనుక మందర పర్వతమై సంసారసముద్రాన్ని మథించుమని గోవిందుని ప్రార్థించారు. సముద్ర మథన సందర్భంలో విష్ణువు, కూర్మమై మందర పర్వతాన్ని కదలకుండా చేసాడు. అది కూర్మావతారం. షట్పదీస్తోత్రంలోని 4వ శ్లోకంలో స్వామిని ఉద్ధృతనగ అని సంబోధించారు. కూర్మావతారంలో, కృష్ణావతారంలో ఉద్ధృతనగుడయ్యాడు స్వామి.

మందర పర్వతాన్ని కదలకుండా కూర్మావతారంలో చేయగా, భవజలధి మథన మందర అన్నప్పుడు సంసార సముద్రాన్ని చిలుకునట్టి మందర పర్వతంగా ఉండుమని అంటున్నారు. ఇక్కడ పర్వతంగానే ఉండి చిలుకుమని, అంటున్నారు. అంటే ఏమిటి దీనర్థం? ఎందుకు కవ్వంగా ఉండుమన్నారు? సంసార సముద్రాన్ని దాటే సాధనంగా ఎందుకు చెప్పలేదు?

పాల సముద్రాన్ని తరిచేటపుడు ముందు విషం వచ్చింది. తరువాత వాటిని పట్టించుకోకుండా చివరకు అమృతాన్ని పొందారు. అట్లా మనము కూడా సంసార సముద్రాన్ని చిలకాలి. ఇందు కామక్రోధాదులనే తరంగాలుంటాయి. గందరగోళ పరుస్తాయి. ఈశ్వర తత్వం అమృతంలా దాగి యుంది. ఈశ్వర సాక్షాత్కారమే ఇందలి అమృతం. ముందు చెడ్డ వాటిని ప్రోగుచేయాలి. వాటిని అనుభవించడం కోసం కాదు. ఇంటిని ఊడ్చేటపుడు చెత్తను చీపురుతో ఒక మూల చేరుస్తాం. తరువాత ఎత్తి పారపోస్తాం. భగవానుడు కవ్వంగా ఉండి పెరుగును చిలుకగా వెన్నలభించినట్లు పూజ, తీర్థయాత్రలు, పుస్తక పఠనం, ధ్యానం మొదలైన సాధనాల వల్ల సాధ్యాన్ని సంపాదిస్తాం. ఇవి సాధనములే సుమా! ఇట్లా జీవితమనే సాగరాన్ని మథించి చెడ్డ గుణాలను ముందు ప్రోగుచేసి అనగా విషాన్ని ఒకచోట చేర్చి దానిని తీసివేయగలగాలి. అపుడమృతము లభిస్తుంది.

ముందే అమృతం కావాలంటే దొరకదు. మనం ప్రోగు చేసిన విషాన్ని తీసివేసేటంత వరకూ దొరకదు.

అన్నీ చెడ్డ గుణాలున్నాయని బాధపడుతూ కూర్చోకూడదు. భవజలధి మథన మందర అన్నారు కదా!

అంటే కవ్వంతో చిలికినపుడు కుండలో ఎంతో అలజడి, చప్పుడూ ఉంటాయి కదా! అట్లాగే గత జన్మకర్మ వాసనలూ ఉంటాయి. అనేకమైన ఆటుపోట్లుంటాయి. అనేక పరీక్షా సమయాలుంటాయి. వీటినన్నిటినీ దాటగలగాలి. భగవానుని కవ్వంగా భావించగలగాలి. మన బాధలు, భయాలు పోయిన తరువాతనే మోక్షం.

మధ్వాచార్యులవారు స్థాపించిన ఉడిపి క్షేత్రంలో ఉన్న కృష్ణుని చేతిలో కవ్వం ఆకారం కన్పిస్తుంది. ఈ స్తోత్రంలో మందర పర్వతాన్ని కవ్వంగా చేసికొని సంసార సముద్రాన్ని చిలుకుమంటున్నారు.

కవ్వానికి త్రాళ్లున్నట్లు కృష్ణుడు త్రాళ్లచే కట్టబడి దామోదరుడయ్యాడు కదా! యశోద పెరుగును చిలుకుతూ ఉన్నపుడు పాలు కావాలని అడిగాడు. ఒక మూల పాలను కాస్తోంది. పొంగిపోతున్నాయి. పిల్లవానికి పాలనీయడం మాని లేచింది. కృష్ణునికి కోపం వచ్చింది. కుండ బద్దలు కొట్టాడు. వెన్నను చిందరవందర చేసాడు. కోతులకు పెట్టాడు. అల్లరిని తట్టుకోలేక పిల్లవానిని త్రాళ్లతో కట్టింది. దామోదరుడయ్యాడు. శ్లోకం దామోదరునితో ఆరంభమై కవ్వంగా పోల్చబడ్డాడు. శ్లోకంలో ఒక మాటకు మరొక మాటకు దగ్గర సంబంధం ఉంది.

సంసార సముద్రాన్ని మథించేటప్పుడు ముందు విషం ఎందుకు రావాలి? జీవితంలో ఈ కష్టాలేమిటి? సమాధానం – వాడి లీలయే. ఇట్లా ప్రకృతిని నియమించాడు. ముందు పచ్చికాయ వగరుగానే ఉంటుంది. పక్వానికి వచ్చినపుడు పండైనపుడు తీయగా ఉంటోంది కదా! కామక్రోధాదులు ముందు

వెగటును కల్గిస్తాయి. (భగవానునివైపు వాటిని మళ్లిస్తే అవే తియ్యగా ఉంటాయి)

కనుక అనేక సమస్యలున్నాయని, దోషాలున్నాయని భయపడవద్దు. విధింపబడిన కర్మలను చేస్తూ ఉండడం, భగవద్భక్తి కలిగియుండడం, ఇతరులకు సేవ చేయడం వంటివి చేస్తే దోషాలు తమంతట తామే తొలగిపోతాయి. అందరి పట్ల ప్రేమ కలుగుతుంది. తియ్యని పండుగా మారుతాం. పై విధులను పాటించకపోతే జీవితంలో వగరే మిగులుతుంది. లక్ష్యం లేకుండా జీవించకూడదు. దోషాలున్నాయని అదే చింతతో ఉండకూడదు. సత్కర్మలను చేస్తూ ఉన్నకొద్దీ పచ్చికాయ, పండవుతుంది.

ఆదర్శమూర్తులు

మనిషి క్రమక్రమంగా పరిపక్వదశకు చేరుకోవాలి. సంఘంలో కొందరే ఇట్లా ఉంటారు. సంఘం అంతా కుళ్లిపోయిందని బాధపడనవసరం లేదు. సంఘాన్ని ఒకచెట్టుగా భావిస్తే ఎన్నో ఆకులుంటాయి, రాలిపోతాయి. ఎన్నో పువ్వులు రాలిపోతూ ఉంటాయి. పువ్వులు, కాయలుగా మారేవి కొన్నే. ఆ కాయలూ పండ్లుగా మారేవి కొన్నే. ఇది ప్రకృతి ధర్మం.

ఇంతలోనే కాయలను కోరే కోతులు, పక్షులు ఎన్నెన్నో. చివరకు మిగిలేవి కొన్ని పండ్లే.

అట్లాగా పండుగా మారిన వారు సంఘంలో కొందరే ఉంటారు. ఎందరో జనన మరణ ప్రవాహంలో కొట్టుకొని పోతూ ఉంటారు. అందొక్కడే ఆత్మతత్వాన్ని పట్టుకొంటాడు. ఈ సంసార సముద్రంలో అమృత భాండం ఎప్పుడో దక్కుతుంది. ఎంతో శ్రమపడితేనేగాని లభించదు. శంకరులు భగవానుని కవ్వంగా ఉండుమన్నారు. ఆ కవ్వం సాయంతో చిలుకగా చిలుకగా ముందు విషం వచ్చినా చివరకు అమృతం రాలేదా? పెరుగును

చిలికిన వెంటనే వెన్న వస్తోందా? అది వచ్చేవరకూ చిలక వలసిందే కదా. ఓర్పు వహించాలి.

అట్లా క్రమ వికాసానికే తావుంది. కవ్వానికి కట్టిన త్రాడు చిధికిపోయి ఉండకూడదు. గట్టిగా బంధింపబడియుండాలి. ఏమిటాత్రాడు? భక్తియనే త్రాటితో కోతి వంటి మనస్సును కట్టుమయ్యా అని శివానందలహరిలో శంకరులు ప్రార్థించలేదా? "దృఢ భక్త్యా బధ్వా". ఇట్లా త్రాటిని భగవానుడనే కవ్వం చుట్టూ కట్టగలిగితే అతడు సంసార సాగరాన్ని మథిస్తాడు. విషాన్ని తొలగిస్తాడు. అమృత మిస్తాడు. అదే మోక్షామృతం.

జనన మరణాలే సంసారం. అది లేకపోతే అమృతత్వం. మరణం లేకపోతే పుట్టుకేలేదు. కనుక సంసారాన్ని ద్వేషించడం కాదు. సంసార సాగరాన్ని మథించగలగాలి. దేనితో? భక్తియనే త్రాటితో. భగవదనుగ్రహం ఉన్నపుడు మాత్రమే మోక్షామృతం లభించేది.

ఇక్కడొక మాటను గుర్తించండి. సంసార సాగరంనుండి, దాటించుమని అడిగినపుడు సంసారాన్ని విడిచి పెట్టాలనే అర్థం వస్తుంది. సంసార సముద్రాన్ని చిలుకుమని అన్నపుడు సంసారాన్ని విడువనవసరం లేదు. అనగా బ్రహ్మములో అన్నీ ఉన్నాయి. బ్రహ్మము అన్నిటా ఉన్నాడనే భావన. ఇక్కడ ఉండే అవతలి ఒడ్డును చేరాలన్న మాట.

జ్ఞాన మార్గం అనుసరిస్తే సంసారాన్ని విడిచిపెడతారు. వైరాగ్యం వల్ల దాటుతాడు. భక్తి మార్గాన్ని అనుసరిస్తే భగవానుని దయపట్ల నమ్మకం ఏర్పడుతుంది. అనగా సంసారాన్ని విడిచిపెట్టకుండానే తరించే ఉపాయం లభిస్తుంది. చిలకడమే మనవంతు. ఆయనను కవ్వంగా చేసికొని, భక్తియనే త్రాటితో చిలకడమే. ఇట్లా శ్లోకాన్ని అర్థం చేసికోవచ్చు.

మొదటి శ్లోకంలో సంసార సాగరాన్ని దాటించుమని ప్రార్థించారు "తారయ సంసార సాగరతః". చివర శ్లోకంలో చిలుకుమన్నారు. అనగా విడిచిపెట్టడము లేక, ఇందుండే ఆత్మతత్వాన్ని ఒంటబట్టించుకోవడం.

శ్లోకసారాంశం - సంసార దుఃఖాల నుండి తొలగించుట

మొదటి శ్లోకం – సంసార సాగరం యొక్క అవతలి ఒడ్డునకు చేర్చుమని. "తారయ సంసార సాగరతః". తరువాతి శ్లోకం – సంసార భయాన్ని పోగొట్టే నీపాదారవిందాన్ని భజిస్తున్నా. "భవభయ ఖేదచ్ఛిదేవందే". మూడవ శ్లోకంలో సంసార ప్రస్తావన లేదు. అందు పరమాత్మ జీవాత్మలు ఒకటైనా వ్యవహార దశలో సముద్రం – తరంగాలు మాదిరిగా ఉన్నారని చెప్పబడింది. ఇందు సంసారం అనే మాట దాగియుంది. వ్యవహార దశలో సంసారమే. దీనినే సముద్రమని వ్యవహరిస్తాం. అయితే ఇందు మునగకుండా భయపడకుండా ఉండవచ్చు. మనం ద్వైత స్థితిలో ఉన్నా. మేమీ సముద్రంలో భాగంకాము, మేము పరమాత్మ సముద్రంలోనే భాగస్వాములం. తరంగాల వంటివారం. తరంగాలు సముద్రంలో లీనమైనట్లుగా పరమాత్మలో లీనమౌతాం, అనే భావన కల్గి యుండాలి.

మూడవ శ్లోకాన్ని ఇట్లా భావించవచ్చు. సముద్రమే తరంగంగా మారుతోంది కదా! అట్లా పరమాత్మయే మనగా మారుతున్నాడు కదా. ఇట్లా భావిస్తూ ఉంటే, నిశ్చయ జ్ఞానం కలిగితే ఈ సముద్రం మనలనేమి చేస్తుంది? అద్వైత దృష్టితో పరికించినా ద్వైతంలోని వినయం కలిగి యుండాలి. సంసార దృష్టితో అనగా ద్వైత దృష్టితో చూసినా అద్వైత భావనతో ఉండవచ్చు. ఎట్లా? తరంగాలు, సముద్రానికి ఎట్లా భిన్నం కావో పరమాత్మ నుండి మనం భిన్నం కాము అని. ఇట్లా ఉంటే సంసారం విసుగనిపించదు. నాల్గవ శ్లోకంలో సంసార ప్రస్తావన ఉంది. భగవత్ దర్శనం కలిగితే సంసారం నశించదా అని.

'న భవతికిం భవతిరస్కారః'. అది ఇక్కడి ప్రశ్న. తరువాతి దాంట్లో సంసార తాపాన్ని పోగొట్టుమన్నారు. భవతాపభీతోఽహం. చివరగా ఆరవ శ్లోకంలో భగవానుణ్ణి కవ్వంగా ఉండుమని అమృత తత్వాన్ని

ప్రసాదింపుమన్నారు. ఎందుండి? సంసార సముద్రాన్నుండే కనుక మొత్తం సంసార బాధలనుండి విడుదలచేయుమనే. భక్తితో మొదలిడి ఆత్మ లక్ష్యంతో సాగింది రచన. శ్లోకం చివర 'పరమందరం అపనయత్వంమే'.

దరం అనగా భయం. మే = నాకు; పరం = ఉత్కృష్టమైన; త్వం = నీవు; అపనయ = తొలగించు.

అనేక భయాలున్నాయి. జీవితం సరిగా ఉంటుందా? ఉండదా? నరక భయం, రోగ భయం, మరల పుట్టుక భయం, ఇట్లా ఎన్నో. ఇట్లా సంసార భయాన్నుండి కాపాడుమని అర్థం.

ఆరంభమెట్లో అంతమట్లా

"**అవినయం అపనయ విష్ణో**"తో ప్రథమ శ్లోకం అరంభమైంది. ఆరవ శ్లోకం – 'దరం అపనయ త్వంమే'. ఇందులో కూడా అపనయ ఉంది. మొదటిదే చివరా ఉంది. ఇదే శ్లోకాలలో పూర్ణత్వం.

త్వం, మే – అనునవి అపనయ, తరువాత వచ్చాయి. నా పెద్ద భయాన్ని పోగొట్టుమని అర్థం... సంస్కృత వచనంలో 'మే పరమం దరంత్వం అపనయ'... అపనయ చివర వస్తుంది... 'అపనయ'ను ముందుకు తీసికొనివస్తే 'మే'తో అంతమైతే అందంగా ఉంటుంది.

ఇట్టిదే గీతలో ఉంది. రెండవ అధ్యాయం 11వ శ్లోకంలో "అశోచ్యా నన్వశోచస్త్వం". గీత చివర 18వ అధ్యాయం, 66వ శ్లోకంలో

"**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**

అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః

ఇట్లా ఈ రెండు శ్లోకాలు, నాంది, భరత వాక్యాలులా ఉన్నాయి.

శుచ, శోచ్య అనే పదాలు బాధను, ఆందోళనను వ్యక్తీకరిస్తాయి. అశోచ్యాన్ అన్వశోచస్త్వం =బాధ పడనవసరం లేని వారి గురించి

అవసరంగా బాధపడుచున్నావు. కౌరవసైన్యాన్ని చంపడమా అని బాధపడుతున్నావు. ధర్మాన్ని రక్షించుటకొరకే యుద్ధం. వారు చంపబడడం ఈశ్వర సంకల్పం. ముందే నిర్ణయింపబడింది. కనుక అనవసరంగా బాధపడుచున్నావని అశోచ్యాన్... అని వాడబడింది.

చివరగా అన్ని ధర్మాలను విడిచి నాకు శరణుపొందు. అన్నిటిని నాకు విడిలిపెట్టుమని, నీ పాపాల నుండి విముక్తిని ప్రసాదిస్తానని, ఇది నిశ్చయమని అన్నాడు. ఇట్లా వాగ్దానం చేసాడు. మా శుచః = బాధపడవద్దు. అశోచ్య అని ముందు, మాశుచః అని చివర ఉంది. శుచ్ అనే ధాతువు రెంటిలోనూ ఉంది.

షట్పదిలో కూడా గీతలో మాదిరిగా అపనయ అని శ్లోకం మొదట్లోను, చివర ఉంది. ముందుగా నా అవినయాన్ని పోగొట్టుమని, చివర నా భయాన్ని పోగొట్టుమని. పోగొట్ట వలసిన వాటికి ముందు ప్రాధాన్యం ఈయాలి. పొందవలసిన వాటికంటే కూడా. తొలగించడం, పొందడం అన్నీ మన చేతులలో ఉన్నాయా? లేవు. అతని కరుణ ఉండాలి. దయ వల్లనే పోగొట్టవలసిన వాటిని పోగొట్టగలం. ఏమిటివి? అహంకారం భయం. అహంకారానికి విరుద్ధం భయం. అది బలహీనమైన మనస్సును సూచిస్తుంది. పరిపక్వతతో ఉన్నవానికి అహంకారమూ లేదు, భయమూ ఉండదు. ఈ రెంటినీ పోగొట్టుమంటున్నాడు.

శ్లోకంలో ఒక పాదం చివరనున్న పదం, మరల మరొక చరణంలో మొదట వస్తే దానిని అంతాదియని అంటారు కదా! దీనిని 'ఉద్ధృతనగ'లో చూసాం. అంతకంటే చిత్రం చూపించారు శంకరులు. మొదటి శ్లోకంలో నున్న పదమే చివరి శ్లోకంలోనూ వచ్చింది. పదమనుట కంటే మొదటి క్రియ, రెండవ క్రియయని చెప్పడం సబబు. మొదటి మాటేమిటి? అవినయం. తరువాత అపనయ అనేది క్రియ. చివరి శ్లోకంలో 'అపనయత్వంమే' అనగా అపనయ తరువాత 'త్వం' వచ్చింది. కనుక చివర క్రియా పదం, అపనయమే.

క్రియాపదం, క్రియను సూచిస్తుంది. శంకరులు షట్పదీస్తోత్రాన్ని క్రియాపదాలతో, అంతాదిని సూచించారు. అనగా ముందు క్రియ, తరువాత క్రియయే అనగా నిరంతరం మనం క్రియనే చేయాలి. ఈ శ్లోకాన్ని మరల మరల చదవాలని చెప్పినట్లైంది.

శరణాగతి, ఫలశ్రుతిగా

ఏడవ శ్లోకం ఫలశ్రుతిగా కన్పిస్తుంది. దీనిని చదవడం వల్ల ఫలానా లాభం వస్తుందని ఫలశ్రుతి శ్లోకంలో ఉంటుంది సాధారణంగా. షట్పది దామోదరతో అంతమౌతుంది. లోగడ వివరించానీ శ్లోకాన్ని.

జయదేవుని పాటలను అష్టపదులని ఎందుకంటున్నాం? ప్రతి పాటలో ఎనిమిది శ్లోకాలుంటాయి. కదా! పదం అంటే ఒక వాక్యమే కాదని, మొత్తం శ్లోకమని వివరించాను. అష్టపదిలో ఎనిమిది శ్లోకాలు; షట్పదిలో ఆరుశ్లోకాలు.

సంప్రదాయంలో ఏడవ శ్లోకాన్ని చదవడం ఉంది. చదవడం వల్ల లాభాలను చెప్పడమూ జరిగింది.

భగవద్గీతలో ఆది, అంతమూ ఎట్లా ఉన్నాయో షట్పదిలోనూ అట్లా ఉందని అన్నాను. గీతను దృష్టిలో పెట్టుకొని వ్రాసేరేమో అన్నాను. ఈ ఏడవ శ్లోకంలో శరణాగతిని సూచించారు. గీతలోనూ శరణాగతి చివర ఉంటుంది.

నారాయణ, కరుణామయ
శరణం, కరవాణి తావకౌచరణౌ
ఇతి షట్పదీ మదీయే
వదన సరోజే సదా వసతు।

దీనినే ఫలశ్రుతిగా భావిద్దాం.

అయితే ఇందులో ఇది చదవడం వల్ల ఫలానా లాభం వస్తుందని, మిగతా చోట్ల ఉన్నట్లుండదు. ఫలశ్రుతి మాదిరిగా ఉంటుందని అంటున్నా.

అట్లాగే శివానందలహరిలోగాని, సౌందర్యలహరిలోగాని, ఫలశ్రుతి శ్లోకాలుండవు. సూచనమాత్రం ఉంటుంది.

నారాయణ, కరుణామయ = దయకలవాడా. తావకౌ చరణౌ = నీ రెండు పాదాలకు; శరణం కరవాణి = శరణు పొందుతున్నాను. ఇతి = ఇది, మదీయే = నా యొక్క వదన సరోజే = నాముఖమనే పద్మంలో; వసతు = ఉండుగాక.

ఈ స్తోత్రం నా ముఖమందుండుగాక. ద్వైతాద్వైత విశిష్టాద్వైతాల జోలికి పోకుండా భక్తితో వ్రాసిన శ్లోకాలివి. అద్వైతులకు చెందని సగుణ బ్రహ్మారాధనను చేసారు. శ్లోకాల చివర కూడా జ్ఞాన మార్గాన్ని నిర్దేశించలేదు. జ్ఞానమార్గమే పరమగమ్యమైనా సరే. శరణాగతినే పేర్కొన్నారు.

శరణం కరవాణి తావకౌ చరణౌ

శరణాగతి - బ్రహ్మానుభవమూ ఒక్కటే

రామానుజులు శరణాగతిని ప్రధాన సాధనంగా భావించారు. వైష్ణవులకు అష్టాక్షరిమంత్రం, ద్వయం - రెండు ప్రధానమైనవి. గీతలో చివరి శ్లోకం "సర్వధర్మాన్ పరిత్యజ్య" ఉంది కదా! రాముడు. విభీషణుణ్ణి చేరదీసే సందర్భంలో శరణాగత రక్షక వ్రతాన్ని అవలంబించాడు కదా!

రామానుజుల తరువాత వడగలై, తెంగలై అనే రెండు సంప్రదాయాలు వీరిలో వచ్చాయి. ఈ శరణాగతిని ఆధారం చేసికొనే తెంగలి శాఖ వారు సంపూర్ణంగా అర్పణ భావనతో ఉంటారు. మార్జాల కిశోర న్యాయాన్ని పాటిస్తారు. పుట్టిన పిల్ల భారం అంతా తల్లిదే కదా.

పిల్లకోతి, తల్లి కోతిని గట్టిగా పట్టుకొంటుంది. అదే మర్కట కిశోర

న్యాయం. ఇది వడగలై శాఖకు చెందినది. అనగా భక్తుని యొక్క ప్రయత్నమూ ఉండాలని.

నేను బ్రహ్మమనుట జ్ఞానమార్గానికి చెందింది. నేనంటూ ఏదీ లేదు, అంతా నీదేయనుట భక్తి మార్గానికి చెందింది. రెండూ ఒక్కటే.

భక్తి మార్గానికి, జ్ఞాన మార్గానికి తేడా ఉన్నట్లు పైపైన కన్పిస్తుంది. పర్వతానికి, చీమల పుట్టకున్నంత భేదం ఉన్నట్లుగా కన్పిస్తుంది. లోతుగా విచారిస్తే రెండూ ఒక్కటే.

నేనేమీ లేదు, అనినపుడు ఈ నేను వేరు. నేను బ్రహ్మమని అద్వైతి అనినపుడు ఆ నేను వేరు. ఇతడు, శరీరాన్ని, ఇంద్రియాలను, బుద్ధిని, మనస్సును – ఇవేమీ నేను కానని అనడం వల్ల బ్రహ్మమే అగుచున్నాడు. ఆత్మనే బ్రహ్మమంటున్నాడు. ప్రతి జీవాత్మ, శరీరాన్ని, ఇంద్రియాదులను నేనుగా భావిస్తాడు కదా! వీటికి దూరంగా ఉన్నపుడు, వీటి నన్నిటిని భక్తిమార్గంలో భగవత్పాద పద్మాలపై పెట్టినపుడు తనలో ఇవి లేనట్లే కదా! ఆ దృష్టిలో భక్తి మార్గం, నేనేమీ లేను, అంతా నీవే అని అంటుంది.

ఇక అద్వైతి, ఆత్మ కంటే భిన్నమైన ఇంద్రియాలను గెంటివేస్తున్నాడు, అనగా అహంకారంతో కూడిన నేనును నిరాకరిస్తున్నాడు. ద్వైత, విశిష్టాద్వైతులు ఆ నేనును భగవత్పాదాలపై ఉంచుతున్నారు. కనుక రెండు మార్గాలూ ఒక్కటే కదా! ఇద్దరూ అహంకారాన్ని పోగొట్టుకోవడానికే ప్రయత్నిస్తున్నారు.

భాష్యాలలో జ్ఞాన మార్గాన్నే బలపరిచినా స్తోత్రాలలో భక్తిమార్గాన్నే అవలంబించారు శంకరులు. భక్తునిగానే నుతించారు. "శరణం కరవాణి తావకౌ చరణౌ".

ఎవరు శరణుజొచ్చుతారో వారిని దయతో భగవానుడు రక్షిస్తాడని భరోసా ఇస్తున్నారు. కరుణామయ అనే పదంతో సూచించారు. "నారాయణ కరుణామయ".

మొదటి శ్లోకంలో విష్ణో; ఆరవ శ్లోకంలో దామోదర పదం ఉంది. ఇది కృష్ణావతారాన్ని సూచిస్తోంది. ఇక్కడ నారాయణ అంటున్నారు. ఈ పదం వైష్ణవ సిద్ధాంతాన్ని సూచిస్తోంది. నారాయణ పదమే అష్టాక్షరిమంత్రంలో ఉంటుంది కదా! నారాయణ నామమే అని ఆళ్వార్లు కీర్తించారు. భాష్యాలలో శంకరులు, సగుణ బ్రహ్మమైన నారాయణ పదాన్నే వాడారు. సన్యాసికి ఎవరు నమస్కరించినా నారాయణ, అనాలని నిర్దేశించారు.

నారాయణ పాదపద్మాలకు శరణుజొచ్చుతున్నానని ఇందన్నారు కదా! వైష్ణవుల ద్వయ మంత్రమూ అదే అర్థాన్ని తెలుపుతోంది కదా! అవే మాటలు అందూ ఉంటాయి.

ఈ సందర్భంలో ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత మతాల సంగమం కన్పించడం లేదా?

ఆరు శ్లోకాలు - ఆరు నామాలు

"ఇతి షట్పది మదీయే వదన సరోజే సదా వసతు" అనగా ఆరు శ్లోకాలతో కూడిన ఈ షట్పదీస్తోత్రం నా వదన సరోజంలో నివసించుగాక. షట్పది అంటే ఆరు శ్లోకాలు. పదం అనే మాటను శ్లోకార్థంలో కాకుండా కేవలం పదంగానే భావించినా సబబే. రెండర్థాలను సూచించారు. ఈ ఆరు పదాలు ఏమిటి?

శ్లోకార్థ భాగంలో నారాయణ, కరుణామయ, శరణం, కరవాణీ, తావకౌ, చరణౌ ఇవి ఆరు కదా!

ఆరు శ్లోకాలను చదివినా, లేదా ఏడవ శ్లోకంలోని ఆరు పదాలను స్మరించినా భగవదనుగ్రహం లభిస్తుంది.

స్తోత్రంలో అనేకాభిప్రాయాలను, వేడికోళ్లనుంచారు. షట్పదీస్తోత్రం మన ప్రార్థనలను నెరవేరుస్తుందని లేదా, పై ఆరు నామాలూ నెరవేరుస్తాయని,

ఏడవ శ్లోకం, తిన్నగా, గట్టిగా మాత్రం చెప్పలేదు. అనగా బహుస్పష్టంగా చెప్పలేదు.

తుమ్మెదనెందుకు తీసికొని వచ్చినట్లు?

మదీయే వదన సరోజే అని ఎందుకన్నారు? తనముఖాన్ని సరోజంతో ఎందుకు పోల్చారు? నోరు అంటే సరిపోతుంది కదా! విశేషణం ముందు ఎందుకు వాడారు? నారాయణుణ్ణి చెప్పేటపుడు, నయన కమలం, పాదపద్మం అంటే సబబు. శ్లోకాలలో శ్రీపతి పదారవిందే, సుందర వదనారవిందే అన్నారు. భక్తుడై యుండి తన ముఖాన్ని పద్మంతో పోల్చడమేమిటి?

ఫలశ్రుతిని ఇతరుల మాదిరిగా స్పష్టంగానూ చెప్పరు. ముందుగా అవినయాన్ని పోగొట్టుమన్నారు కదా! ఎందుకిట్లా అన్నారు?

షట్పది అంటే ఆరు కాళ్ల జంతువని ముందే చెప్పాను. ఇది ఆరు శ్లోకాలతో ఉంటుందని, ఆ తుమ్మెదకు దీనికి శ్లేషను ఘటించారు. రెండర్థాలిచ్చేది శ్లేష.

ఆరు శ్లోకాలు, అదనంగా ఏడవ శ్లోకంలోని ఆరు పదాలు నా నోట్లో ఎల్లపుడూ ఉండుగాక అని అన్నారు కదా! షట్పదికి తుమ్మెదయని అర్థం ఉంది కదా, అని తట్టింది. సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రంలోనూ, సౌందర్య లహరిలోనూ షట్పది పదముంది.

తిరుచెందూర్‌లోని సుబ్రహ్మణ్యుని భుజంగస్తోత్రంతో నుతిస్తూ "హేస్కంద! తుమ్మెద పద్మాన్ని ఇష్టపడుతున్నట్లుగా, నా మనస్సనే తుమ్మెద సంసార వికారాలతో ఆందోళనతో ఉండడం వల్ల నీ పాద పద్మంపై వ్రాలి సంతోషించుగాక అని అన్నారు.

మనఃషట్పదోమే భవక్లేశతప్తః
సదా మోదతాం స్కంద తే పాదపద్మే

తుమ్మెదను సంస్కృతంలో భృంగ, భ్రమర, మధుభాగ మొదలగు నామాలున్నాయి. ఇక్కడ షట్పది అనే పదాన్ని ఎందుకు తీసికొన్నారు. సౌందర్యలహరిలో సమాధానం చెప్పారు.

"నా జీవుడు ఆరుకాళ్ల తుమ్మెదలా ఉన్నాడు. అనగా ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు కలిస్తే ఆరు ఇంద్రియాలయ్యాయి. ఇట్టి తుమ్మెద, నీపాద పద్మంలో మునిగియుండుగాక"

నిమజ్జన మజ్జీవః కరణ చరణాః షట్చరణాం తాం

పాదమన్నా, చరణమన్నా ఒక్కటే. షట్పదంగానే షట్చరణం కూడా.

మనస్సును ఆరవ ఇంద్రియమన్నా ఐదు ఇంద్రియాలనూ ఏలుతోంది కనుక దీనిని షట్పదంతో పోల్చారు. మనః షట్పదో అనడాన్ని సమర్థించవచ్చు.

ఆరుశ్లోకాలు, ఆరు పదాలతో నున్న షట్పది అనినపుడు తుమ్మెదను గుర్తుకు తీసికొని వస్తున్నారు. తుమ్మెద, పద్మంపైనే వాలియుంటుంది. అందువల్ల వదన సరోజే అన్నారు.

మరొక విధంగా చూద్దాం. శ్రీపతి పాదారవింద, సుందరవదనారవింద అని మాటిమాటికి భక్తుడు గానం చేస్తూ ఉంటే ఆ నోరు, అప్రయత్నంగా పద్మం కాదా?

వదన సరోజంలో ఉన్న తుమ్మెద ఏమిటి? షట్పదీస్తోత్రమే కదా.

వదన సరోజం అంటే అప్పయ్య దీక్షితులు, పద్మపాదులు వ్రాసిన శ్లోకాలు గుర్తుకువస్తున్నాయి. లోగడ వివరించాను.

విష్ణు పాదకమలం నుండి గంగవచ్చినట్లుగా శంకరుల ముఖకమలం నుండే భాష్యాలు వచ్చాయని దీక్షితులవారన్నారు. భగవత్పాద శ్రీమత్ ముఖాంబుజ అని వారనగా; వదన సరోజం, మన శ్లోకంలో ఉంది. రెండూ ఒక్కటే. శంకరులే శ్రీపతి పాదారవిందం నుండి నిర్గమిస్తోందని రెండవ శ్లోకంలో అన్నారు కదా? స్వామివారి పాదాలు భవభయఖేదాన్ని అనగా

నన మరణాదులను పోగొడతాయని అన్నారు. దీక్షితులు, జనన మరణ రములని అన్నారు.

సుబ్రహ్మణ్యానిలో, అమ్మవారి పాద పద్మాలలో మనస్సనే తుమ్మెద మునిగి యుండుగాక అని శంకరులనగా; కాంబోడియా శాసనాన్ని బట్టి విద్వాంసుల లనే తుమ్మెదలు, శంకరుల పాదకమలంపై మూగు గాకయని ఉంది. పుక తుమ్మెదకు, శంకరులకు సంబంధం ఉంది. ఇంకా ఎట్లా సబబో వరిస్తాను.

వీరు గోవిందభగవత్పాదులను భక్తితో నుతించారు. అట్లాగే మన ంఠంలోనూ రాజువస్తే జయజయధ్వనులు చేసినట్లు జయగోవింద గవత్పాద పాదాబ్జ షట్పద అనికీర్తిస్తాం. కనుక పద్మం–తుమ్మెద అనుబంధం, ోవిందులు, శంకరులు, పద్మపాదుల వరకూ ఉంది. ఇట్లా భగవానుని ములాన్ని, పాదకమలాన్ని స్మరించడం మన అదృష్టం. అదే సందర్భంలో ంకరుల ముఖ కమలాన్ని, పాద కమలాన్ని స్మరిస్తున్నాం.

నా నోట్లో ఈ స్తోత్రం ఉండుగాక! అంటే కేవలం వారి నోట్లోనే కాదు, ున అందరి నోళ్లల్లో ఉండాలని మనకై ప్రార్థిస్తున్నారు. అట్లా జీవులనే ుమ్మెదలు నివసించుగాక.

వారు తమకై ప్రార్థించలేదు. మన మనస్సులను దువ్వాలని, మన ంద్రియాలను అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. చివరగా రణాగతి చేసారు. భగవానుని పాదపద్మం, జీవులనే తుమ్మెదలను ఆకర్షిస్తోంది. అందునిమగ్నమై భవసాగరాన్ని దాటుదాం.

ఆయన భగవానుని పాద కమలమైతే వారి ముఖమూ కమలమే. ంకరుల నుండి తేనె వంటి వాక్కులు, భగవానుని నుండి మకరందమనే శీస్సులు వచ్చుగాక.

మొత్తం శ్లోకాలు

అవినయ మపనయ విష్ణోదమయ మనశ్శమయ విషయమృగతృష్ణాం
భూతదయాం విస్తారయ తారయ సంసార సాగరతః 1

దివ్యధునీ మకరందే పరిమళ పరిభోగ సచ్చిదానందే
శ్రీపతి పదారవిందే భవభయ ఖేదచ్ఛిదే వందే 2

సత్యపి భేదాపగమే నాథ! తవాఽహం నమామకీనస్త్వం
సాముద్రోహి తరంగః క్వచన సముద్రోన తారంగః 3

ఉద్ధృతనగ! నగభిదనుజ దనుజకులామిత్ర! మిత్రశశిదృష్టే
దృష్టే భవతి ప్రభవతి న భవతి కిం భవతిరస్కారః 4

మత్స్యాదిభిరవతారైరవ తారవతా సదా వసుధాం
పరమేశ్వర! పరిపాల్యో భవతా భవతాప భీతోఽహం 5

దామోదర! గుణమందిర సుందర వదనారవింద గోవింద
భవజలధి మథన మందర మపనయత్వంమే 6

నారాయణ కరుణామయ శరణం కరవాణి తావకౌ చరణౌ
ఇతిషట్పదీ మదీయే వదన సరోజే సదా వసతు 7

ఉపవేదములు

ముందుమాట

కంచి మహాస్వామి, శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారి రచనలను చదువుతూ ఉన్నపుడు లలితా సహస్రనామాలలోని 'ఓం శాస్త్రమయ్యై నమః' గుర్తుకు వస్తుంది. అనగా సకల శాస్త్రములు తన స్వరూపంగా గల తల్లికి నమస్కారమని.

ఈ నాలుగు ఉపవేదాలలో ఈనాటికీ ఉపయోగించేవి ఆయుర్వేద, గాంధర్వ వేదములు. ఈనాడు రాచరిక వ్యవస్థ లేకపోయినా అర్థిక శాస్త్రముల సూత్రాలను పూర్వులే కాదు, మహమ్మదీయ పాలకులూ పాటించారు. కొన్నిటిని తెల్లదొరలూ శ్లాఘించారు. ఆనాడు విల్లంబులతో, అస్త్రశస్త్రాలతో యుద్ధం జరిగేది. ఈనాడు శస్త్రాలున్నాయి గాని అస్త్రాలు లేవు. ఆనాటి రథ, గజ, తురగ బలాల ఆవశ్యకత ఈనాడు లేదు. నేటి యుద్ధ సామాగ్రి వేరు కనుక ధనుర్వేదం ఈనాడు ఉపయోగించకపోయినా కొన్ని యుద్ధ నియమాలు ఈనాటికీ అన్ని దేశాలవారు పాటించవలసినవి ఉన్నాయి. ఆయుర్వేద, గాంధర్వాలు పుస్తకాలు చదవడంవల్ల పట్టుబడేవి కావు. చాలా సంవత్సరాలు గురువు దగ్గర నేర్చుకోవలసిందే. అయినా వాటిని కొద్దిగా పరిచయం చేస్తాను.

రోగాలు వస్తే కుదిర్చేదే కాదు, రోగాలు రాకుండా చేసేదీ ఆయుర్వేదమే. ఈనాడు మన దేశంలోనే కాదు, విదేశాలలోనూ ఆదరణ కనిపిస్తోంది. ఇంగ్లీషు మందుల్లా వెంటనే రోగం కుదరకపోయినా, దీర్ఘకాలిక రోగాలకు బాగా పనిచేస్తుందని విశ్వసిస్తున్నారు. దీనిని వాడటం వల్ల అనుబంధ రోగాలూ (Side Effects) రావని ఋజువు చేస్తున్నారు. ఇదొక శుభపరిణామం.

శరీరం – మనస్సు – ఆత్మ అనేవి ఒకదానిని ఒకటి విడిచిపెట్టకుండా కలిపియుండే అవస్థ ఏదైతే ఉందో దానినే ఆయువని అంటారు. దానిని

గురించి చెప్పేది ఆయుర్వేదం; ఇందు కాయ, బాల, గ్రహ, ఊర్ధ్వాంగ, శల్య, విష, రసాయన, వాజీకరణ చికిత్సలని ఎనిమిది భాగాలుగా ఉంటుంది.

దీని మూలాలు వేదాలలోనే ఉన్నాయి. శరీరానికి మూలమైన వాత, పిత్త, శ్లేష్మాల గురించి ఋగ్వేదం చెప్పింది. త్రిధాతువులనే పేరుతో, రోగాల గురించి, చికిత్సల గురించి వేదాలు భాషించాయి. ప్రధానంగా అథర్వవేదంలో ఓషధులు, చికిత్సా విధానాల గురించి చాలా మంత్రాలున్నాయి. ఇందు హరిద్ర పాండురోగాన్ని; నీలి, హరిద్ర, భృంగరాజాలు బొల్లిని; గుల్గులు మధుమేహాన్ని; ఇంకా జలోదరాదులకు వివిధ ఓషధుల్ని చెప్పింది. కొన్ని మంత్రాలతో ఓషధులను సేవించాలనీ ఉంది.

ఉత్తరేణుపు, ఓషధి రాజమని ఉగ్గడించింది. జ్వరాదుల నివారణకై అనేక మంత్రాలున్నాయి. మణి – మంత్ర – ఓషధులు కలిపి చేసే చికిత్స, శరీరాన్ని మనస్సును కలిపే చికిత్స మన ఆయుర్వేదంలో ఉంటుంది. నేటి అల్లోపతి విధానంలో ఉండదు.

ఎక్కడ అథర్వవేద పండితుడుంటాడో అక్కడ రోగ దారిద్ర్యాలు లేకుండా ఉంటాయనే శ్లోకమూ ఉంది.

దీని పుట్టుక గురించి రెండు మాటలు: బ్రహ్మ వేదాలని స్మరించిన పిమ్మట లక్ష శ్లోకాలతో కూడిన బ్రహ్మసంహితను కూర్చాడని, తరువాత దక్షుడు – అశ్వినీదేవతలు – ఇంద్రుడు – భరద్వాజుడు ఒకరినుండి మరొకరు అభ్యసించారని భరద్వాజుడు పునర్వసుడన్న ఆత్రేయునకు ఉపదేశించినట్లు కథ. ఆ ఆత్రేయుడు అగ్నివేశాదులకు ఉపదేశించినపుడు ఇది అగ్నివేశతంత్రంగా ప్రసిద్ధిని పొందగా చరకుడు దీనిని సంస్కరించాడని అంటారు. ఇది అష్టాంగాలనూ బోధిస్తుంది. 120 అధ్యాయాలున్నాయి. ఆయుర్వేద ధర్మాలే ఇందు 1511 వరకూ ఉన్నాయి. ఈ ధర్మాలు అనేక ధర్మశాస్త్ర గ్రంథాలలో లభిస్తాయి.

రాత్రి పెరుగు తినరాదని, సత్తుపిండిని కడుపునిండా తినరాదని, ఎక్కువసేపు గొంతు కూర్చుండరాదని, అధికంగా నీరు త్రాగరాదని; ఇతరుల నీడలో నిలవరాదని; గోళ్ళతో గోళ్ళను మీటరాదని; బడలిక కలిగేటంతవరకూ వ్యాయామం చేయరాదని, గోళ్ళతో గడ్డిని తుంపరాదని; స్నానం చేసిన బట్టతో తల తుడుచుకోరాదని నిలవయున్న పదార్థాలను తినరాదని, నిటారుగా పడుకోవాలని ఇట్లాకొన్ని వందల నియమాలు వీరూ వారనే భేదం లేకుండా పాటించాలని చెప్పబడింది. ఇట్టి ధర్మాలను పాటిస్తే, రోగాలే దరిచేరవు. భారతంలో ఉన్నట్లుగా ఇందు చెప్పబడని విషయం ఇంకెక్కడా ఉండదు. ఇందు చెప్పబడినదే అన్నిచోట్ల చెప్పబడిందనే దీని ప్రజ్ఞను గమనించారా?

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తిన తత్క్వచిత్"

చరకం మాదిరిగానే సుశ్రుత గ్రంథమూ ప్రసిద్ధిని పొందింది. ప్రధానంగా ఇది శస్త్రవైద్యానికి చెందింది. దీనిని ప్రవర్తింపచేసినవాడు ధన్వంతరి. ఇతణ్ణే దివోదాసుడని అంటారు. కాశీరాజు, ధన్వంతరి అవతారమని భావిస్తారు. ఇతడు కూడా ఇంద్రుని నుండి ఉపదేశం పొంది విశ్వామిత్రుని కొడుకైన సుశ్రుతునకు, మిగిలినవారికి ఉపదేశించాడు. ఈ సుశ్రుతాన్ని సిద్ధ నాగార్జునుడు సంస్కరించాడు. 186 అధ్యాయాల గ్రంథం.

పై గ్రంథాల మాదిరిగానే వాగ్భటుని అష్టాంగ హృదయమూ ప్రసిద్ధిని పొందింది. ఇతడు 5,6 శతాబ్దాలకు చెందినవాడు. 120 అధ్యాయాలతో ఈ గ్రంథం ఉంటుంది. దీనిని చదివితే చరక సుశ్రుతాల అవసరమే ఉండదంటారు. ప్రధానంగా ఇది కేరళలో ప్రచారంలో ఉంది. పంచకర్మలతో వైద్యం చేయడం వల్ల దేశ విదేశాల నుండి రోగులక్కడికి వస్తారు.

అనేక సంహితలు, వైద్యతంత్ర గ్రంథాలూ కాలగర్భంలో కలిసిపోయాయి. కాత్యాయన, పరాశర, ఖరనాద, విశ్వామిత్ర సంహితాదులు; వైతరణ, కరవీర్య, భాలుకి, కపిల, గౌతమ, విదేహ, శాకాయన, గార్గ్య, శౌనక తంత్రాదులు ఉన్నాయని, పూర్వ గ్రంథాల వల్ల తెలుసికొనే దుస్థితి ఏర్పడింది.

మాధవ నిదానం, యోగరత్నాకరం, శార్ఙ్గధరసంహిత, భావ ప్రకాశం, బసవరాజీయం వంటి ప్రసిద్ధ గ్రంథాలు, సంకలన గ్రంథాలు నేడు చెలామణిలో ఉన్నాయి. (చూ. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము)

ఇక అర్థశాస్త్రం గురించి రెండుమాటలు: అర్థమంటే లక్ష్యం, కోరిక, సాధనం వంటి అనేకార్థాలున్నాయి. ప్రయోజనం, ఉద్దేశమని అర్థానికి అర్థం. దీనికీ మూలం వేదాలే. ధర్మమోక్షాలకు సంబంధించిన అపారమైన వాఙ్మయం మనకున్న దానితో పోలిస్తే అర్థశాస్త్రం తక్కువ పరిణామంలో ఉన్నా భారత, రామాయణాలలో, అనేక ధర్మశాస్త్ర గ్రంథాలలో, స్మృతులలో రాజధర్మం, వ్యవహారకాండ, దండనీతి గురించి చాలా విషయాలు తెలుస్తాయి. మాధవుడు, దేవనభట్టు, ప్రతాపరుద్రుడు, హేమాద్రి, మిత్రమిశ్రుడు వంటివారు విపులంగా అందించారు.

కౌటిల్యుని అర్థశాస్త్రం, అతనికి ముందున్న భరద్వాజ, విశాలాక్ష, పిశున, కౌణపదంత, భానుదత్త పుత్ర అంభి మొదలైనవారిని పేర్కొన్నా వారి రచనలు నేడు లభ్యం కావడం లేదు.

చాణక్యుని తరువాత లెక్కింపదగినవి, కామందనీతి సారం, బృహస్పతి సూత్రం, శుక్రనీతి సారం, సోమదేవుని వాక్యామృతం, చండేశ్వరుని రాజనీతి రత్నాకరం, క్షేమేంద్రుని నీతి కల్పతరువు మొదలైనవి. ఇవి కేవలం రాజనీతి గురించి, అర్థశాస్త్రం గురించి వివరించే గ్రంథాలు. ఇక పంచతంత్రం, హితోపదేశం, నీతి శతకాలలో ఈ శాస్త్ర సంబంధ విషయాలున్నాయి. ఈ గ్రంథాలలో తలమానికం అర్థశాస్త్రం.

ఇందులో కోశాగారాన్ని వృద్ధి చేసే పద్ధతులు, గూఢచారి వ్యవస్థ, కపటరీతిలో యుద్ధాలు గెలవడం వంటివాటిని చూచి, Machiavelli లాంటి కూట నీతిజ్ఞుడని కౌటిల్యుణ్ణి పోల్చారు. ధర్మమే మూలంగా అర్థశాస్త్రాన్ని, కౌటిల్యుడు (చాణక్యుడు) వ్రాసాడు. సుఖానికి మూలం ధర్మమని (సుఖస్యమూలం ధర్మః) ధర్మానికి మూలం అర్థమని (అర్థస్యమూలం రాజ్యం);

రాజ్యానికి మూలం ఇంద్రియ జయమని; ఇంద్రియ జయానికి మూలం వినయమని; తనను తాను జయించుకున్నవాడే అన్ని సుఖాలను పొందగలడని (జితాత్మా సర్వార్థః సంయుజ్యతే) - అనే రీతిలో అర్థశాస్త్ర రచన సాగింది. ధర్మవృద్ధి కోసమే ప్రాసానని, ధర్మ విరోధులకు పతనమని అతడు అన్నాడు.

కనుక పచ్చి భౌతికవాదిలా కనబడినా, సాధనాలకంటె సాధ్యానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనబడినా ధర్మమనే పునాదిపైనే ఇతని శాస్త్రం రచింపబడింది.

ఉన్నది ఉన్నట్లే చెప్పడం సత్యం కాదు, లేనిది ఉన్నట్లు చెప్పడం అసత్యం కాదు, ఏది ప్రాణి హితాన్ని కల్గిస్తుందో అది సత్యం, ఏది కల్గించదో అది అసత్యం అనే ఉదారమైన భారత సూక్తిని మిగతా ఆత్మగుణాలకూ అన్వయించగలిగితే ఇతని కూటనీతినీ సమర్థించగలం.

"సతథ్యవచనం సత్యం, నాతథ్య వచనం మృషా
యద్ భూత హిత మత్యంతం, తత్ సత్యం ఇతరన్మృషా"

ఇందు 15 అధికరణాలు, 150 అధ్యాయాలు; 180 ప్రకరణాలు 350 కారికలున్నాయి.

దీనిలోని ఆచరణ పూర్వకమైన పద్ధతులను గమనించండి. ఒక ఆదర్శవంతమైన రాజ్యం నిలబడడానికి దండనీతికి ఇతడు ఎంత ప్రాధాన్యమిచ్చాడో తర్కశాస్త్రానికి (అన్వీక్షకి) అంత ప్రాధాన్యమిచ్చాడు. అనగా ఇందులో ప్రశ్నించడం ఉంటుంది. వ్యవసాయం, పశుపోషణ, వర్తక వాణిజ్యాలు, పరిశ్రమలూ ఉంటాయి. ఇది నేటి ఎకనమిక్స్.

ఆదర్శవంతమైన పరిపాలనలో కొన్ని ముఖ్యాంశాలను గమనించండి. ఆస్తికులు పేర్కొన్న మత క్రియాకలాపాల కంటె, నాస్తికులు పేర్కొన్న భౌతికావసరాలకు ముందుగా స్పందించి పూనుకోవాలన్నాడు. సర్వజన హితం కోసం పాటుపడే నాస్తికులను గెంటివేయలేదు.

రాజు, ప్రజలను అన్నివిధాల ఉద్ధరించడమే అతని ధార్మిక కృత్యమని; కార్యనిర్వహణ పవిత్ర యజ్ఞం వంటిదని, వృత్తులందు సమత్వము, దక్షిణయని అభిషేకమే దీక్షయని అన్నాడు.

రాజ్ఞోహి వృత్తముత్థానం యజ్ఞః కార్యానుశాసనం

దక్షిణా వృత్తిసామ్యం చ దీక్షా తస్యాభిషేచనం

ప్రజాసుఖమే తన సుఖమని, ప్రత్యేకంగా ఆతనికి సుఖం అంటూ ఉండదని అన్నాడు:

"ప్రజా సుఖే సుఖం రాజ్ఞః ప్రజానాంచ హితేహితం

నాత్మప్రియం ప్రియం రాజ్ఞః ప్రజానాంతు ప్రియం హితం"

ప్రజలనుండి పన్నులు వసూలు చేసి దానిని సరిగా ఖర్చు పెట్టనివానిని పార్థివ తస్కరుడని అనగా రాజు వేషంలోనున్న దొంగయని తీవ్రంగా మందలించాడు.

ఏదైనా చట్టాలు చేసినపుడు మంత్రిమండలితో సంప్రదించాలని, ఋషుల మాటలను, లోకాచారాలను గమనించాలని, కాలానుగుణంగా ప్రవర్తించి చివరకు తన అభిప్రాయాన్ని జోడించాలని, అనడం వల్ల రాజు నియంత కాడని అర్థమవుతోంది కదా!

రాజునకు ఎంత అధికారాలున్నా దుర్మార్గంగా పాలిస్తే అతనికి సర్వ నాశమని అన్నాడు.

"సబంధు రాష్ట్రారాజానో వినేశురజితేంద్రియాః

దుర్మార్గులను కఠినంగా శిక్షించాలనీ ఇతరులను కాదనీ ఉంది:

దుష్టేషు అధార్మికేషు చ వర్తేత నేతరేషు"

విడాకులు పొందినవారు, భర్త పోయినవారు, పట్టించుకోని బంధువు లున్నవారు, అవివాహితలైన స్త్రీలు మొదలైనవారికి జీవనోపాధికై ప్రత్తి మొదలైన వాటినిచ్చి వడికిన నూలును వసూలు చేసి తగిన మూల్యాన్ని

అప్పగించాలని, పనిచేసే స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడేవారిని శిక్షించాలనే మాటలను గుర్తించండి.

చివరకు పశువుల పట్ల ఎట్లా ప్రవర్తించాలో చూడండి. ఒక పూట మాత్రమే పాలు పితకాలని అన్నాడు. విధులను నిర్వహించని పశు వైద్యులను శిక్షించాలన్నాడు.

వ్యభిచారానికి, మద్యపానానికి చట్టబద్ధత కల్పించడం – వారిపై పన్నులు విధించడం కూడా ఉండేది.

ఇళ్ళల్లో, బహిరంగ ప్రదేశాలలో మద్యపానాన్ని నిషేధించడం, వాటికై ఉన్న ప్రత్యేక స్థలాలలోనే సేవించడం, ఉత్సవాలలో త్రాగడాన్ని అనుమతించడం గమనింపదగినవి. ఇది కూడా సైనికులకు, విదేశీయులకు, కాయకష్టం చేసేవారికే. దీనిపై అధికమైన పన్నులు వేసి ఈ దురభ్యాసం నుండి తప్పించడానికై ప్రయత్నం కన్పిస్తుంది. వ్యభిచారిణులకు వైద్య సదుపాయం, నష్టపరిహారం, భద్రత కల్పించడం, వారిని అగౌరవంగా చూడవద్దని చెప్పడం, ఇవన్నీ గణికాధ్యక్ష సురాధ్యక్ష విభాగాలలో చూడవచ్చు. అంటే పైవాటిని ప్రోత్సహించడం కాదు, మానవ బలహీనతలను గుర్తించి ఎక్కువ చేటు వారివల్ల రాకుండా చేసాడు.

నేరాలు పెరుగకుండా ఉండడానికి విదేశీయులు చాటుమాటున దేశంలో ప్రవేశించకుండా ఉండడానికి కొన్ని నియమాలున్నాయి. క్రొత్తగా వచ్చిన వారి పేర్లు నమోదు చేయబడుట ఇత్యాదులు.

అతిథులు పేర్లు, ప్రయాణికుల పేర్లు నమోదు చేయబడుట మొదలైన విషయాలలో ప్రభుత్వం ఎంత జాగరూకతతో ఉందో గమనించండి.

సాంక్రమిక వ్యాధులతో బాధపడేవారి పేర్లు రహస్యంగా ప్రభుత్వానికి అందించాలనే నియమాన్ని గుర్తించారా!

సరియైన వేతనం ఉంటే కార్మికులు సుఖమయంగా జీవించగలరని అంటాడు:

ఏతావతా కర్మణ్యా భవంతి

స్త్రీలు, అనాథలు, విద్యార్థులు, బలహీనులు, వృద్ధులపై పన్నుల భారం లేదు. మరి ఆదాయం తగ్గుతుందంటే ఖనిజ సంపదపై, మద్యం, వధ్యశాలలపై, వ్యభిచారం చేసేవారిపై, ఎగుమతి దిగుమతి వ్యాపారాలు చేసేవారిపై పన్నులెక్కువగా వేసి భర్తీ చేయవచ్చునని అన్నాడు. భార్యా, బిడ్డలకు ఉపాధి చూపించకుండా సన్యాసం పుచ్చుకుంటే వాణ్ణి కారాగారంలో వేయాలన్నాడు.

స్త్రీలకు ప్రత్యేకమైన ఆస్తిహక్కులున్నాయి. భర్త క్రూరుడైనా, చాలాకాలం పరదేశంలో ఉన్నా, రాజుచేత శిక్షింపబడినా, ధర్మ మార్గం తప్పినా, నపుంసకునిగా ఉన్నట్లు తెలిసినా, విడాకులు తీసుకొనవచ్చని అంటాడు. ఇట్టి విషయాలలో ధర్మశాస్త్రాల కంటె ఉదారభావాన్ని ప్రదర్శించాడు చాణక్యుడు. వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించకపోయినా ఆస్తి పంపకంలోని హక్కునే పేర్కొన్నాడు.

జంతువుల పోషణకై కేటాయింపబడిన అరణ్యాలలో, జంతువుల రక్షణ స్థానాలలో నున్న జంతువులను, పక్షులను, చంపినవారికి శిక్షలను విధించాడు.

సామ, దాన, భేద, దండాలలో కేవలం దండానికే ప్రాధాన్యం ఈయలేదు. పరస్పరం శాంతితో, ఐకమత్యంతో ఉండాలనే భావనయే దీనికి కారణం.

యుద్ధంతో విజయం పొందినవారు మూడు రకాలుగా ఉంటారని అన్నాడు. ఓడింపబడిన రాజును గౌరవంతో చూడాలనడం మానవత్వపు విలువను సూచిస్తుంది.

తాత్కాలిక ప్రయోజనం కోసం విచ్చల విడిగా దిగుమతులను అనుమతించలేదు. ఖరీదైన మద్యాలు, అపాయకరమైన రసాయనాలు వద్దని, ఉపయోగించే ఔషధాలను ధాన్యాలను దిగుమతి చేసుకోవాలన్నాడు. వాటికి పన్నులు లేకుండా చేసాడు.

యజమానులు, సేవకుల్ని నీచంగా చూడవద్దని శారీరకంగా, మానసికంగా వారిని హింసించరాదని, ఆర్యుణ్ణి అనగా సంస్కారవంతుడిని దాసునిగా చూడవద్దని, శూద్రులు బానిసలు కారని అన్నాడు.

దానం పేరుతో, యజ్ఞం పేరుతో, త్యాగం పేరుతో మోసం చేసేవారిని తీవ్రంగా దండించాలని, తప్పుగా ప్రవర్తించిన సన్న్యాసులను శిక్షించాలని అన్నాడు:

ప్రవ్రజ్యాసు వృథాచారాన్ రాజదండేన వారయేత్

ఒక వృత్తిగాని, వర్ణాన్నిగాని హేళన చేయరాదంటాడు. ఒక ప్రాంతంపై, ఒక గ్రామంపై అనవసరపు వ్యాఖ్యలు చేయకూడదంటాడు. బీదవారికి న్యాయ సాహాయ్యాన్ని గుర్తించాడు.

ఎక్కడైనా దొంగతనం జరిగితే దొంగను అధికారులు పట్టుకొనలేకపోతే అపహరింపబడిన సొత్తుకు తగిన నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలనడం ఈనాడు మనలో ఉందా?

చోరహృతమవిద్యమానం స్వ ద్రవ్యేభ్యః ప్రయచ్ఛేత్,

ప్రత్యానే తు మశక్తోవా, తన్నిష్క్రియం వా ప్రయచ్ఛేత్

అట్టిది సంక్షేమ రాజ్యం కాదా?

ఎక్కడ నేరమున్నా సహించలేదు. దగాకోరు వర్తకులు, పారిశ్రామిక వేత్తలు, గతి తప్పిన సన్న్యాసులు, అట్టి కళాకారులు వీరిని దొంగలతో కలిసి లెక్కించాడు. వస్తువులను దాచిపెట్టిలేని కరువును సృష్టించే వర్తకుల్ని శిక్షించాలన్నాడు. బట్టలుతికే వారు కర్ర పలకపై కాకుండా రాతిపై ఉతికితే బట్టలు పాడై పోతాయి కనుక అట్టివానినీ శిక్షించాలన్నాడు.

కళాకారులు తమ ప్రదర్శనలో కొంతమంది కులస్థులను అవమానకరంగా ప్రదర్శించరాదని కట్టడి చేసాడు.

మరొక్క ముఖ్యవిషయం. మన సంపదను మనకై వినియోగించకుండా ఇతర దేశాలలో వ్యాపార వ్యవహారాలలో ఉంచితే అతనికి మరణశిక్ష విధించాడు:

యో మహత్యర్థ సముద యే స్థితః తస్య ద్రవ్యాణాం
గతిముపలభేత్. యశ్చాపరవిషయే సంచారం
కుర్యాత్తం అన్విష్య మంత్రం విద్యాత్, సువిదితే
శత్రుశాసనాపదే శేనైనం ఘాతయేత్

ఇట్లా ఎన్నో ఆర్థిక శాస్త్ర విషయాలను వ్రాయవచ్చు. భారతాది గ్రంథాలలో నున్న విషయాలు వ్రాయాలంటే కొన్ని వందల పుటలు వ్రాయవచ్చు. కేవలం చాణక్యుని అర్ధశాస్త్ర విషయాలనే ఉట్టంకించాను. గీతా సందేశాన్ని, చాణక్య మార్గాన్ని విస్మరించడం వల్లనే గతచరిత్రలో అనేక పరాజయాలను రుచి చూసాం. వివరాలకు Human Values in the code of Kautilya- Gandhi centre, Bangalore. – పరిశీలించండి.

అర్థశాస్త్రానికి పునాది ధర్మశాస్త్రమే అనే మహాస్వామి వారి మాటలకు అనుగుణంగా ఉండేటట్లు వ్రాసాను. ఇక వారి అమృతవాణిని వినండి. సులభరీతిలో అనేక అపూర్వ విషయాలనందించారు.

ఇట్లు అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

ఉపవేదములు

ఏ పనియైనా చేసేటపుడు సాంగోపాంగంగా అని వాడుతూ ఉంటాం. ఈ మాట దేనినీ విడిచిపెట్టకుండా సమగ్రంగా పనిచేయడాన్ని సూచిస్తుంది. స+అంగ+ఉపాంగ. అనగా అంగాలతో, ఉపాంగాలతో అని. ఈ మాట వేదవిద్యను ఆధారం చేసుకొన్నదైనా, మిగతా వాటికికూడా వ్యవహరిస్తూ ఉంటాం. మన శరీరంలో ప్రాణం ఉన్నట్లు, రక్తం ఉన్నట్లుగా వేదమతమనే దేవతామూర్తికి వేద సంహితలు, బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు శరీరం వంటివి. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనేవి వేదాంగములు. మీమాంస, న్యాయ, పురాణ, ధర్మశాస్త్రములు ఉపాంగములు. మొత్తంమీద నాల్గు వేదాలు, ఆరు అంగములు, మరియు ఉపాంగాలతో కలిసినపుడు సాంగోపాంగమౌతోంది వేదం. అపుడు దేవతామూర్తి సాంగోపాంగుడైనాడు. ఈ పదునాల్గింటిని చతుర్దశవిద్యలంటారు.

ఈ ఉపాంగాలకు నాలుగు ఉపవేదాలు కలిస్తే అష్టాదశ విద్యలౌతున్నాయి. అదే అష్టాదశ విద్యాస్థానం. ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థశాస్త్రములే ఉపవేదాలు. వీటికి ప్రత్యక్షంగా మతంతోగాని, వేదాంతంతో గాని సంబంధం లేకపోయినా; మనిషి సంఘంతో దేశంతో, ప్రపంచంతో సంబంధమున్నపుడు వీటి ప్రయోజనముంటుంది. అందుకే వీటిని మతానికి, ఆధ్యాత్మవిద్యకు సంబంధించిన 14 ధర్మశాస్త్రాలతో కలుపకుండా 18 విద్యాస్థానాలలో కలిపారు. ఇవి మనిషికి నీతి నియమాలను శాసించే ధర్మశాస్త్రాల వంటివి కావు. మొత్తం, సంఘానికి ఉపయోగించేవనే కారణంచే విద్యాస్థానాలుగా పరిగణించారు.

వీటిని ఉపాంగాలని అనకుండా వీటికి ఉన్నతస్థానమిచ్చి ఉపవేదాలుగా పరిగణించారు. ధర్మానికి కట్టుబడి ఈ నాల్గింటిని వ్యవహార జీవితంలో ఉపయోగించగలిగితే మనిషి ఆదర్శవంతుడౌతున్నాడు. మహోన్నత గుణాలు

వీటివల్ల సంప్రాప్తిస్తాయి. దానివల్ల పరలోక సౌఖ్యమూ, ఇహలోక సౌఖ్యమూ సంప్రాప్తిస్తాయి. పరమాత్మ సాన్నిధ్యానికి పరోక్షంగా దోహదం చేస్తాయి.

ఇవి ఎందుకు ఉపయోగిస్తాయో మీకందరికీ తెలుసు. ఆయుర్వేదం వైద్యానికి చెందింది, ధనుర్వేదం భౌతిక శాస్త్రానికి చెందింది. గాంధర్వ వేదం, సంగీత, నృత్య, నాటకాలైన లలిత కళలకు చెందింది. అర్థశాస్త్రం రాజనీతికి, ఆర్థిక విషయాలకు చెందింది.

వీటిని సరిగా ఉపయోగించుకోలేక పోవడం వల్ల మనకెట్టి హాని కల్గుతుందో గమనించండి. వైద్యంవల్ల శరీరాన్ని రోగాలు లేకుండా కాపాడుకోవచ్చు. అంతటితో ఆగిపోతే శరీరమే ఆత్మయనే భావనను దాటలేకపోతాం. ఇక ధనుర్వేదం యుద్ధవిద్య గురించి. అణుబాంబులు, హైడ్రోజన్ బాంబులు వేయడం వల్ల వచ్చే నష్టం అంతా ఇంతా కాదు కదా! అంతకంటె ప్రజలలో భయోత్పాతాన్ని కలిగించి పరస్పర కలహాలను, శత్రుత్వాలకు దారి చూపిస్తోంది. గాంధర్వం – సంగీత, నృత్యాలు, సంతోషం కల్గించినా, అవి చవకబారు ప్రదర్శనలైతే మనిషిలో పశుప్రవృత్తిని రెచ్చగొడుతున్నాయి. ఇక అర్థశాస్త్రం. రాజకీయాల గురించి చెప్పేదేముంది? వాటి వికారాలను కళ్ళార చూస్తున్నాం, చెవులార వింటున్నాం.

ఆధ్యాత్మిక ప్రగతికి అడ్డువచ్చే పై వాటిని పూర్తిగా విసర్జించమని పూర్వులు చెప్పలేదు. వీటిని ఆధ్యాత్మిక మార్గానికి సాధనాలుగా వాడుకోండని అన్నారు. మురికి పట్టిన పాత్రను పారవేస్తున్నామా? చింతపండు మొదలైనవాటితో తోమి వాడుకొంటున్నాం కదా! అట్లాగే వీటిని ధర్మంలో ముంచి, తళతళలాడేట్లు చేసి వాడుకోండని అన్నారు. ఒక చిత్రపటంపై దుమ్ము పేరుకొనిపోయియుంది. అద్దంమీద పేరుకొన్న దుమ్మును తుడిస్తే లోనున్న బొమ్మ బాగా కనిపిస్తోంది. ఆ అద్దాన్ని పారవేయడం లేదు. దానిపై నున్న దుమ్మునే తుడుస్తున్నాం. అట్లాగే శరీరానికి వచ్చిన రోగాన్ని వైద్యం ద్వారా పోగొడుతున్నాం. అట్లాగే వినోదంగాని, రాజకీయం గాని, మురికి మాదిరిగా

పేరుకొని పోయి లోనున్న ఆత్మను కనబడకుండా చేస్తాయి. కనుక విద్యగాని కళగాని ఏదైనా లోనున్న ఆత్మతత్త్వం తెలుసుకోడానికే వినియోగ పడాలి.

హిందూమతం, అద్వైతం, మాయను బోధిస్తూ భౌతిక జీవనంపై దృష్టి పెట్టదని, పలాయన వాదాన్ని ప్రోత్సహిస్తోందని, మిగతా మతస్థులు మనలను గేలిచేస్తూ ఉంటారు. మనలను సరిగా అర్థం చేసుకోకుండా అంటున్న మాటలవి. మన మతంలోనే భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలకు చక్కని సమన్వయం కన్పిస్తుంది. వారు ఎట్లా విజయవంతంగా సాగవచ్చో నిరూపించింది. మనం కొలిచే రామకృష్ణుల గాథలు, విమర్శించేవారికి తెలియవా? వారు ఎట్లా ఆదర్శవంతంగా జీవించారో, నిత్యజీవితంలో ఎట్లా రాణించారో కూడా మీకు తెలుసు. యుద్ధరంగంలో ప్రవేశించి యుద్ధం చేయనని అర్జునుడంటే కృష్ణుడు చేసిన బోధనలు వారికి తెలియవా? గీతోపదేశం జగత్ ప్రసిద్ధమైనదే కదా! ఇట్టి ప్రసిద్ధ కథలు తెలిసి కూడా మనలను విమర్శిస్తారు.

ధర్మరక్షణ కోసం నేర్చుకొన్న ధనుర్వేదాన్ని ఉపయోగించమని కృష్ణుడనలేదా? నపుంసకత్వం విడిచి పెట్టని గట్టిగా మందలించలేదా? ఇది జీవిత సమస్యల నుండి పారిపోవడమా? ప్రతి ఉపవేదము యొక్క లక్ష్యమూ ధర్మానికి ఉపయోగపడడానికే.

మిగతా మతాలు, భగవత్ సంబంధమైన వాటిని గురించే చెప్పి, రాజ్యం, సైన్యం, వైద్యం మొదలైన విషయాలను విస్మరించాయి. అందువల్ల నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారమార్గం అందులో కనబడదు. వృత్తి, ఆహారం, నివాసం, వివాహం, విద్య, వైద్యం, పరిపాలన, యుద్ధం మొదలైనవి ధర్మంపై నిలబడ్డాయని వారు కంఠోక్తిగా చెప్పకపోవడం వల్ల వాళ్ళు అపమార్గాలను త్రొక్కినట్లు చరిత్ర చెబుతోంది. వారిలో కొంతమంది ఆధ్యాత్మిక మార్గంలో మాత్రమే ఉండగా చాలామంది భౌతిక జీవన విధానంతో తృప్తిని పొందారు. ఈ భౌతిక జీవన విధానంలోనూ శాస్త్రాధారము కనబడదు. నిగ్రహానికి తావు లేకుండా పోయింది.

సరిగ్గా పరిశీలిస్తే మన జీవనవిధానంలో ఒక కట్టుబాటు, క్రమపద్ధతి గోచరిస్తాయి. ఆయుర్వేదమే చూడండి, ఉదాహరణకు

ఉపవేదాలకు మూలం

ఒక్కొక్క వేదం, ఒక్కొక్క ఉపవేదానికి మూలమని అంటారు. ఆయుర్వేదం ఋగ్వేదానికి చెందింది (ఇది అథర్వవేదానికి చెందినదని సుశ్రుతుడన్నట్లుగా ఉంది - ఆంగ్లానువాదకుడు).

ఋగ్వేదాన్ని పౌష్టికమని అంటారు. అనగా బలాన్ని, పోషణను ఇచ్చేది. ధనుర్వేదం, యజుర్వేదానికి చెందింది. గాంధర్వం, సామవేదానికి చెందింది. అర్థశాస్త్రం అథర్వవేదానికి చెందింది.

ధనుర్వేదంలో అస్త్రశస్త్ర ప్రయోగ విశేషాలుంటాయి. వరుణాస్త్రం, ఆగ్నేయాస్త్రం, బ్రహ్మాస్త్రం మొదలైనవి. మంత్రాలతో కూడి యుంటాయి. వీటికి ఒక్కొక్క దేవత, అధిదేవతగా ఉంటుంది. శస్త్రాలకంటె ఈ అస్త్రాలు అధికశక్తిమంతమైనవి. మంత్రప్రయోగం, అథర్వవేదంలో ఉంది. కనుక ధనుర్వేదం కూడా అథర్వవేదానికి చెందింది

వాస్తుశాస్త్రం

సంగీతానికి, సామవేదం మూలమున్నట్లుగా వాస్తుశాస్త్రం, శిల్పం అథర్వవేదానికి సంబంధించినదని పంజాబ్‌కి చెందిన శ్రీ శుక్లాగారు, ఇలయత్తాంగుడిలో జరిగిన శిల్పాగమ సదస్సులో అన్నారు. ఇంకా ఏమన్నారంటే వాస్తుశాస్త్రం, ఋషి ప్రోక్తమైనదని, భృగువు వ్రాసాదని, ఇక ఏ ఉపవేదం, ఋషులు వ్రాయలేదని అన్నారు.

కొందరి అభిప్రాయాన్ని బట్టి స్థాపత్యశాస్త్రం అనే శాస్త్రం అథర్వవేదానికి బదులుగా ఉపవేదము. ఇది అథర్వవేదమునుండి విడివడినది.

స్థాపత్యశాస్త్రంలో స్థపతి వాడే పనిముట్లు, భవన నిర్మాణం, శిల్పకళ, యంత్రగతిశాస్త్రము ఉంటాయని అర్థమౌతుంది.

వాస్తు శాస్త్రం, పట్టణ నిర్మాణం, దేవాలయ, భవన, గృహనిర్మాణాలకు సంబంధించి యుంటుంది. గృహం కట్టేటపుడు వాస్తు పూజ, దానికి ప్రత్యేక ముహూర్తం ఉంటాయి. దేనిని కట్టినా అది వాస్తు పురుషుడిగా భావించి, అతని అంగాలు మాదిరిగా, నిర్మాణంలో ఫలానా ప్రాంతం శిరస్సని, ఫలానా ప్రాంతం పాదాలని లెక్కబెడతారు. దేవాలయం, ఇల్లు మొదలైనవి ఏవి నిర్మించినా శాస్త్రప్రకారం కట్టకపోతే రోగాలు, అరిష్టాలు, మానసిక బాధలు ప్రాప్తిస్తాయని వాస్తుశాస్త్రం చెబుతుంది. ఈనాడు వాస్తుశాస్త్రాన్ని తు.చ. తప్పక పాటించడం లేదు. పట్టణ నిర్మాణాలు, జననివాస కేంద్రాలు, గృహనిర్మాణాదులన్నీ విదేశీ పద్ధతిలో కడుతున్నారు. దానికి తగ్గట్లు బాధలూ పడుతున్నారు.

శిల్పము, శిల్పశాస్త్రము వాస్తు శాస్త్రంలో అంతర్భాగాలే. అర్థశాస్త్రము నాల్గవ ఉపవేదమని సాధారణంగా భావిస్తూ ఉంటాం.

ఎందుకు శరీరాన్ని పోషించాలి?

ఆయుర్దాయాన్ని పెంచుకోవడం కోసం తగిన సాధనాలందించేదే ఆయుర్వేదం. రోగాలవల్ల ఆయుర్దాయం దెబ్బతినదా? కనుక రోగాలు రాకుండా చేసేది, వచ్చినా నివారించేది ఆయుర్వేదం.

ఎందుకీ శరీరాన్ని పోషించాలి? ఎంత పోషించినా ఒకనాడు పోయేది కదా! నశించడాన్ని ఆపలేరు కదా! నశించడం దాని ధర్మం కదా! ఈ శరీరం పోతే నష్టమేమిటని జ్ఞానులనడం లేదా? ఎంతకాలం ఇది ఉన్నా ఇంద్రియాల, విషయాల వెంటబడుతూ కర్మలకు దారిచూపిస్తోంది కాబట్టి సాధ్యమైనంత త్వరలో దేహాన్ని విడిచి పెట్టడానికి జ్ఞానులు ప్రయత్నిస్తూ ఉంటారు అని సందేహాలు కొందరు లేవనెత్తుతూ ఉంటారు.

జ్ఞానుల మాట అట్లా ఉంచుదాం. మన తర్కాన్ని ప్రక్కన పెడదాం. చావు సత్యమని అందరికీ తెలుసు. వీటికేమిగాని మన ఆచరణ ఎట్టిదో ఆలోచించండి. పెద్దల సుద్దులు, మన తర్కం, ప్రస్తుతం మనకేమైనా ఉపయోగిస్తున్నాయా? మన భావాలకనుగుణంగా మనం ప్రవర్తిస్తున్నాం కదా! శరీరానికి, ఏ కొద్దిపాటి నలత ఏర్పడినా ఎంతో అల్లరి చేస్తున్నాం. ఏదైనా లాటరీ తగిలితే వచ్చే ఆనందం, ఒక్క కడుపు నొప్పితో మటుమాయమైపోతోంది కదా! డబ్బు మీదకంటె బాధపై దృష్టి పెట్టడం లేదా? ముదిరిపోయిన కుష్ఠరోగం వచ్చి జీవితం గడపడం కష్టమైన దశలో ప్రాణం పోతే బాగుండునని ఆ రోగి తలంచడం లేదా? అయితే ఏదైనా వాహనం గుద్దినదశలో, మంచిదే, దీనిక్రింద నలిగిపోతే బావుంటుంది అని ఎవడైనా అంటున్నాడా? ఎట్లాగో అట్లా ప్రాణాన్ని రక్షించుకొంటున్నాడా? 90 ఏళ్ళ ముసలివగ్గు కూడా మరణాన్ని వాయిదా వేయాలని భావిస్తున్నాడు.

మరొక విషయం ఉంది. భార్య, పిల్లలున్నవాడు, తాను చనిపోతున్నా, వారు మాత్రం సుదీర్ఘకాలం జీవించాలని భావిస్తాడు. తాను బ్రతికి యుండగా తన కళ్ళముందు వారు చనిపోకూడదని భావిస్తాడు. వారికేదైనా రోగం వస్తే అహర్నిశలూ వారిని అంటిపెట్టుకొని ఉంటాడు. వైద్యానికి ఎంత ఖర్చైనా భరిస్తాడు. తన కొడుకైన హుమయాన్ బ్రతకాలని, తన ప్రాణాన్ని ధారపోస్తానని, అల్లాను ప్రార్థించినట్లున్న బాబర్ కథ ప్రసిద్ధమైనదే!

కనుక తనను తాను రక్షించుకొనడం, తనకిష్టులైనవారు సుదీర్ఘకాలం బ్రతకాలని కోరుకోవడం సహజం. ఒక చిన్న పురుగు కూడా బ్రతకడానికి తంటాలు పడుతూ ఉంటుంది.

మన పూర్వులు ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించకుండా ఆ నియమాలకు కట్టుబడి, క్రమక్రమంగా ఆత్మోన్నతికై పాటుపడ్డారు. వివాహం, సంతానం కనడం, ఉద్యోగం, వృత్తి మొదలైనవాటిని ఆచరిస్తూ శాస్త్రప్రకారం నడుచుకోవాలనే మార్గాలను చూపించారు. అందువల్లనే వచ్చిన రోగాలను

పోగొట్టుకోవడం కోసం, సుదీర్ఘకాలం జీవించడం కోసం, ఆయుర్వేదాన్ని అందించారు.

వైద్యంలోనూ ఆత్మయే లక్ష్యంగా

ఆరోగ్యం రక్షించుకోవడమే ఆయుర్వేద లక్ష్యంగా పైపైన కనబడినా అంతిమలక్ష్యం ఆత్మను చేరుకోవడానికే.

ఎన్నో పాపాలు చేయడం వల్ల ఈ జన్మనెత్తాం. ఏది శాశ్వత సుఖమో దానిని తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఈ జన్మ నెత్తినపుడైనా పుణ్యకర్మలను చేసి పాపక్షయం చేసుకోవడానికి ప్రయత్నం చేయవద్దా? పుణ్య సంపాదనకై అనేక ధార్మిక కార్యాలను నిర్వహించవచ్చు. పుణ్యం సంపాదించాలంటే శరీరం ఉండవలసిందే కదా! శ్రమదానం వల్లనే పాపక్షయమౌతుంది. ఇతరులకు సేవ చేయాలంటే బలమైన శరీరం ఉండాల్సిందే కదా! యజ్ఞయాగాదులు చేయాలన్నా, నడకతో తిరుపతి కొండ ఎక్కాలన్నా, 108 ప్రదక్షిణాలు చేయాలన్నా, గిరి ప్రదక్షిణం చేయాలన్నా అట్లాగే ఏ పుణ్యకార్యం చేయాలన్నా శరీరం ఆరోగ్యకరంగా ఉన్నపుడు మాత్రమే. మనం మంచానబడితే మనదగ్గరి వారికే ఇబ్బంది కల్గుతుంది కదా! ప్రాణాయామం, ధ్యానం, యోగాభ్యాసం, శరీరం ఆరోగ్యవంత మవడానికి దోహదపడతాయి.

ఆరోగ్యం బాగాలేనపుడు ధ్యానం కుదురుతుందా? జ్వరంగాని, పంటినొప్పిగాని వస్తే పూజలు చేయగలమా? తీర్థయాత్రలు చేయగలమా? ఎన్నో నదీనదాలు, తీర్థాలు, పవిత్ర ఆలయాలెన్నో ఈ భారత భూమిలో ఉన్నాయి. ఎట్లా దర్శించడం? ధ్యానంలో నిష్ఠ కుదరాలన్నా ఆరోగ్యం కావాలి.

కనుక రోగాలు పోవడానికి, రోగం రాకుండా ఉండడానికి మందులవసరం. పథ్య పానాలు చెప్పే శాస్త్రం కావాలి. భగవచ్చింతనకూ

ఇది ఉపయోగిస్తుంది. అందుకే ఆయుర్వేదం. (ధర్మశాస్త్రం ప్రకారం పవిత్ర జీవనం చేసేవారికి రోగాలే దరిచేరవు. అయినా వైద్యశాస్త్రం దోహదం చేస్తుంది)

రోగాలనుండి విముక్తి ఒక్కటే సరిపోదు. ఆరోగ్యంతో దీర్ఘ జీవనముండాలి. అందువల్లనే వైద్యశాస్త్రం యొక్క ఆవశక్యత. ఎప్పుడైనా పోయే దేహానికి దీర్ఘాయుర్దాయం కోరడంలో అర్థమేముందనే వారికి సమాధానం చెప్పాను. శరీరముంటేనే పుణ్యకార్యాలు చేయవచ్చని, పాపక్షయం చేసుకోవచ్చని, తద్వారా కర్మక్షయ మౌతుందని, ధార్మికంగా జీవించినపుడది సాధ్యమని వివరించాను. శరీర పతనానికి ముందే మనలోని మూడు మలాలు పోవాలి. వాటినే శైవసిద్ధాంతం ఆణవ, కార్మిక, మాయీయమలాలని అంటుంది. అనగా అహంకారం, కర్మ, మాయలు.

అయితే మరొక ప్రశ్న వేయవచ్చు. శరీరం పోకుండానే అనడం ఎందుకు? మరొక జన్మ, మరొక శరీరం వస్తోంది కదా! అపుడు పోగొట్టుకోవచ్చు కదా అని అంటారేమో! పోయిన తరువాత మరల మానవ శరీరమే వస్తుందనే నియమం లేదు కదా! ఏ జంతు శరీరమైనా రావచ్చు. అపుడు కుదురుతుందా? మానవ జన్మనెత్తినపుడే పుణ్యకార్యాలు చేయడానికి వీలు పడుతుంది. ఒకవేళ మరల మానవజన్మ వచ్చినా సరియైన బుద్ధి, బలం, అవకాశం, అనుకూల వాతావరణ పరిస్థితులూ ఉంటాయని నమ్మకం ఉందా! నేడీ కర్మ భూమిలో అనేక శాస్త్రాలు, క్షేత్రాలు, స్తోత్రాలు, ఆధ్యాత్మిక సాధనలు, ఆచార్య పురుషుల సాంగత్యం ఇట్లా ఎంతో అవకాశం ఉంది. మరల ఈ కర్మభూమిలో పుడతాడని నమ్మకం ఉందా! కనుక ఈ జన్మలోనే ఈ శరీరం ఉండగా పవిత్రమైన మనస్సును సంపాదించు కోవాలి. జీవన్ముక్తిని సాధించుకోవాలి. అందుకే గీతలో భగవానుడిట్లా అన్నాడు:

శక్నోతీహైవ యః సోఢుంప్రాక్ శరీర విమోక్షణాత్

కామక్రోధోద్భవం వేగం సంయుక్తః ససుఖీనరః (5-23)

శక్నోతి - ఇహైవ. ఇహ+ఏవ=ఇహైవ. ఇహ యనగా ఇక్కడ మనం ఉండగా అని; ప్రాక్ శరీర విమోక్షణాత్ అన్నాడు. అనగా ఈ శరీరం పోవడానికి ముందే. అనగా ఏ మనుష్యుడు ఈ శరీరాన్ని విడవడానికి ముందే ఈ జన్మమందే కామక్రోధాలవల్ల పుట్టిన వేగాన్ని, ఉద్రేకాన్ని లేక సంక్షోభాన్ని సహించడానికి లేదా జయించడానికి సమర్థుడవుతున్నాడో వాడే యుక్తుడు, అనగా యోగి. వాడే సుఖవంతుడౌతున్నాడని తాత్పర్యం. అదే యోగసిద్ధి.

పుణ్యకర్మలు, మతానుష్ఠానాలెందుకు? లోనున్న కామక్రోధాలను పోగొట్టుకోవడానికే కదా! తద్వారా మనస్సు పవిత్రమవడానికే కదా! కనుక శరీరం పడిపోవడానికి ముందే వీటిని పోగొట్టుకొని మనస్సును నిర్మలం చేసుకొని పరమాత్మలో లీనం కావాలి. అప్పుడు మరల పుట్టుక ఉండదు. ఇట్టి ప్రయత్నమేమీ లేకుండా మరల మానవజన్మ వస్తుందని ఎట్లా చెప్పగలం? పశుజన్మ రావచ్చు కదా! కామక్రోధాలు నిర్మూలింపబడ్డాయని తెలుసుకొన్నంతవరకు; చిత్తశుద్ధి ఏర్పడిందని దృఢంగా భావించునంతవరకు ఈ శరీరాన్ని కాపాడుకోవలసిందే. మనం ప్రయత్నం చేస్తున్నా, అనుకోకుండా మరణం ప్రాప్తిస్తే అది వేరే విషయం. అట్టి అకాల మరణం మన కర్మవల్ల ప్రాప్తించవచ్చు. లేదా పై వాడి లీలయందాం అట్లాగే కానీయండి. అనుకోకుండా మీదపడే వాటిని మనం అడ్డుకోలేం కదా!

అయితే మన మరణం పైవాడిచేతిలో ఉండగా మనం దీర్ఘజీవనానికి ప్రయత్నం చేయడం ఏమిటని కొందరు ప్రశ్నించవచ్చు. ఒక్క మరణమే భగవానుని ఆధీనంలో ఉందంటారా? వివాహాలు, వివిధ కార్యక్రమాలు, వృత్తులు, మంచిచెడులు అన్నీ పైవాడి చేతిలోనే ఉన్నాయి కదా! చక్రం త్రిప్పేవాడు త్రిప్పుతున్నట్లు మన జీవనం సాగుతోంది. అయినా మనకేదో స్వాతంత్ర్యమున్నట్లు, మనమేదో ప్రయత్నం చేస్తున్నట్లు, సఫలమౌతున్నట్లు

పైపైన కన్పిస్తూ ఉంటుంది. అన్నీ పైవాడి చేతిలో ఉన్నా జనన మరణ చక్రభ్రమణం నుండి తప్పుకోవడానికి మనం ప్రయత్నం చేయవలసిందే. కనుక లక్ష్యాన్ని నిరంతరం గుర్తు పెట్టుకొని దానిని చేరుకోవడానికి శరీరాన్ని జాగరూకతతో రక్షించుకోవలసిందే. అందుకే మహర్షులు ఆయుర్వేద శాస్త్రాన్ని లోకోపకారబుద్ధితో అందించారు.

ఆయుర్వేదంలో ఒక మాట స్పష్టంగా ఉంది. అది నాస్తికునకు వైద్యంచేయవద్దనే ఘాటైన మాట. వింటే ఇది చాలా క్రూరంగా అనిపిస్తుంది. దయ అణుమాత్రం వారిలో లేదా అని ప్రశ్నిస్తారు. కాని నిజమాలోచిస్తే ఇది దయతో కూడిన మాటయే. నాస్తికుడు రోగం వల్ల బాధపడుతున్నాడు. బాధనుండి విముక్తికై ఆరాటపడుతున్నాడు. అసలు భగవంతుడనేవాడుంటే, వేదశాస్త్రాలు నిజమైతే అతడు నన్ను రక్షించాలి, అపుడు శాస్త్రప్రకారం నడుస్తానని అనుకొంటాడు కదా. అట్టివానికి వైద్యుడు మందీయకపోతే నాస్తికుడు భగవంతునివైపు మళ్ళుతాడు. విశ్వాసం బాగా కుదిరినపుడు అట్టి నాస్తికుడ్ని భగవానుడే రక్షించవచ్చు.అప్పర్ వంటివారి జీవిత చరిత్ర చదివితే ఈ విషయం తెలుస్తుంది. వారు ముందు నాస్తికులుగా ఉండడం, ఈశ్వర సంకల్పానుగుణంగా వారికి రోగాలు రావడం, తర్వాత ఆస్తికులుగా మారడం, ఈశ్వరశక్తి వల్ల రోగవిముక్తులు కావడం జరిగింది. ఇట్టివి పూర్వకాలంలోనే కాదు, ఈనాటికీ కొందరు నాస్తికులు, వెంకటాచలపతినో, గురువయ్యూరప్పనో లేదా ఒక మహాత్ముని అనుగ్రహం వల్లనో బాధలనుండి విముక్తులై పరమ ఆస్తికులైన సంఘటనలెన్నో ఉన్నాయి. ఇట్లా మారినట్లు వారు వ్రాసిన వ్రాతలున్నాయి. కనుక అట్టివారికి వైద్య సదుపాయం అందించకపోతే వారు భగవంతునివైపు సులభంగా మళ్ళుతారు. అట్టి నాస్తికుడ్ని మార్చడం వల్ల చాలామంది నాస్తికులను భగవానుడు మార్చినట్లౌతుంది. ఒకవేళ అట్టివారిని భగవానుడీ జన్మలో మార్చకపోతే వచ్చే జన్మలో ఆ నాస్తికులే తీవ్ర ఆస్తికులౌతారు కూడా.

రోగానికి వైద్యం చేయనపుడు నాస్తికుడింకా బాధపడతాడు కదా! ఆ బాధలే పాప బాధల్ని తగ్గిస్తున్నాయి. అది ఒకరకంగా సాయమే. ఏ అనుష్ఠానం లేకుండా కేవలం బాధలను అనుభవించడం వల్లనే అతనికి పాపక్షయం కావడం లేదా?

నాస్తికునికి వైద్యం చేసి అతనికి ఆయుర్దాయం పెంచడం వల్ల అతని పాపం వృద్ధి పొందుతుంది కూడా. అతణ్ణి చూసి ఇతరులూ నాస్తికులవడానికి అవకాశం ఇచ్చినట్లౌతుంది. కనుక అతనికున్న నాస్తికత అనే దోషాన్ని వృద్ధి పొందకుండా ఉండడం కోసం దయతో మహర్షులే కట్టడి చేసారని గుర్తించండి. (ఈ వాదనను స్తిమితమైన బుద్ధితో విచారించవలసినదిగా మనవి. తొందర పడకండి) సరే! ఈ విషయాన్ని అట్లా ఉంచుదాం.

పైన చెప్పిన సంగతులను బట్టి మతపరంగా వేదాంతపరంగా ఆలోచించినా శరీర రక్షణ అవసరమని తేలింది. శరీర మాంద్యం ఖలు ధర్మసాధనం అనే సూక్తిని కాళిదాసు అందించాడు కదా! అదే భావాన్ని ఆంగ్లంలో "The wall has to be taken care of it if the drawing on it is to be all right" అని ఉంది. అంటే బొమ్మ సరిగా చిత్రింపబడాలంటే గోడను శుభ్రంగా ఉంచాలని అర్థం. దర్భలను, సమిధలను, నేతిని సాధనాలుగా వాడి యజ్ఞంలో ఎట్లా ఆహుతి నిస్తామో శరీరం కూడా అట్టిదే. అట్టి శరీరం లేకపోతే జగత్కల్యాణం కోసం యజ్ఞాన్ని నిర్వహించడం ఎట్లా కుదురుతుంది? జీవితం ఒక హోమమైతే శరీరం ఒక పనిముట్టు! ఇది కూడా పవిత్ర కార్యానికై ఆహుతి కావాలి. .

వేదాంతంలో బియ్యపుగింజ ప్రధానమని దానిపై ఊకను త్యజించాలనే మాట వినబడుతూ ఉంటుంది. అట్లాగే ఆత్మ, బియ్యపు గింజవంటిది. ఊక వంటిది శరీరం. కాని హోమంలో ఊక కూడా కావాలి. అగ్నిలో ధాన్యాన్ని ఆహుతిగా వేసినపుడు అది ఊకతోనే ఉంది కదా! (బియ్యాన్ని నేలలో నాటడం లేదు. ఊకతో నున్న గింజనే నాటుతున్నాం కదా) అట్లాగే శరీరారోగ్యం యొక్క ఆవశ్యకత కూడా ఉంది.

మొత్తం సారాంశం చెబితా. పరిపక్వ స్థితి రానంతవరకు, కేవల ఆత్మనిష్ఠ కుదరనంతవరకు, శరీర పరిరక్షణ తప్పదు. కేవల ఆత్మనిష్ఠునకు మాత్రమే దేహదృష్టి ఉండదు. మిగిలిన వారందరూ దేహాన్ని రోగాల బారినుండి తప్పించుకోవలసిందే.

మీమాంస అనే శాస్త్రం ఉంది. అది పూర్వమీమాంస, ఉత్తరమీమాంసగా ఉంటుంది. పూర్వమీమాంసలో ధర్మానుష్ఠానాలు, కర్మమార్గం చెప్పబడి యుంటుంది. ఉత్తర మీమాంస కేవల జ్ఞానాన్ని బోధిస్తుంది. రెండు మార్గాలను అనుసరించాలన్నా శరీర పరిరక్షణ తప్పనిసరి. జ్ఞాన మార్గంలో ఉన్నవాడు పవిత్రగ్రంథాలు చదవాలన్నా శరీరారోగ్యం ఉంటేనే కుదురుతుంది. అతనికి కలిగే సమాధి, యోగాభ్యాసం వల్లనే సమకూరుతుంది.

రాజయోగ మార్గంలో ఆసనాలు, ప్రాణాయామం మొదలైనవి ఆరోగ్యం నిమిత్తం ఉంటాయి. ఇక హఠయోగాభ్యాసికి అనేక సిద్ధులు సంప్రాప్తిస్తాయి కూడా.

మణి - మంత్ర - ఔషధములు

శరీరారోగ్యానికి మూడు మార్గాలనందించారు పూర్వులు. అందులో మణులు ఒక మార్గం. నవరత్నాలూ ఒక్కొక్క రోగాన్ని కుదురుస్తాయి. ఒక్కొక్క మణి ఒక్కొక్క గ్రహానికి ప్రీతిపాత్రం కూడా. కర్మవల్ల రోగం ప్రాప్తించినా, ఆ కర్మ గ్రహదోషం వల్ల చేస్తూ ఉంటాం. కనుక గ్రహశాంతి నిమిత్తం ఒక్కొక్క రోగం పోవాలంటే ఒక్కొక్క మణిని ధరించవలసి వస్తుంది. అది ఉంగరంలో పొదిగి ధరిస్తాము, లేదా గ్రహాకారమూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తూ ఉంటాం. నవరత్నాలనే నవమణులని అంటారు. మణుల భస్మాన్ని రోగాలు కుదర్చడానికి వాడుతారు కూడా. అట్లాగే వెండి, రాగి, పాదరసం మొదలైన భస్మాలతో చికిత్స లుంటాయి.

రెండవ మార్గం మంత్రం. మంత్ర జపాలవల్ల జ్వరహరేశ్వరుడు, కంప హరేశ్వరుడు మొదలైన దేవతా మూర్తులు రోగాలను కుదురుస్తారని నమ్మకం. సూర్య నమస్కారాలు చేయడం మనకు తెలిసిందే. అట్లాగే స్కందానుభూతిని చదవడం వల్ల రోగవిముక్తిని పొందిన వారవుతున్నారు. ఇక మూడవ మార్గం ఔషధం గురించి – ఓషధి యనగా మూలిక. ఔషధం దీనినుండి వచ్చింది. ఆయుర్వేదంలో మూలికలను ఆధారంగా చేసుకొని మందులను తయారు చేస్తారు. పగడ భస్మం, స్వర్ణ భస్మం, రజత భస్మం మొదలైనవాటిని వైద్యంలో ఉపయోగించినా, ఓషధులతోనే వైద్యం చేయడం ఆయుర్వేదంలో ఉంటుంది.

ఇక సిద్ధవైద్యం, ప్రత్యేకంగా మణులు, లోహాలతోనే ఉంటుంది. ఇదీ శాస్త్రీయమైన వైద్యమే. పైవాటిని శుద్ధి చేయకుండా వాడితే ఉపకారానికి బదులు, అపకారం ఎక్కువ జరుగుతుంది. అందుచేత జాగరూకతతో వాడాలి. అగస్త్యుడు థేరయార్ మొదలైన సిద్ధవైద్యులు ఈ మార్గానికి మూలపురుషులు. వారందించిన భాష కూడా మనకు సాధారణంగా అర్థం కాదు. గూఢార్థాలతో ఉంటుంది. అనర్హుల చేతిలో పడకుండా ఉండడం కోసం రహస్యార్థాలతో వ్రాసారు.

ఆయుర్వేదంలో, సిద్ధవైద్యంలో తంత్రవైద్యంలో మంత్రాలను కూడా మందు బాగా పని చేయడానికి కలిపి వాడతారు. సంప్రదాయ వేత్తలు మంత్ర జపం చేస్తూ మందులను తయారు చేస్తారు. మంత్రాలనుచ్చరిస్తూ మందులనిస్తారు, రోగి కూడా కొన్ని మంత్రాలను పఠిస్తూ సేవించాలి కూడా

త్ర్యంబకమంత్రం, అచ్యుత, అనంత, గోవిందనామాలు, ఇంకా అనేక మంత్రాలు ధన్వంతరి, అశ్వినీ దేవతలను, సూర్యుణ్ణి మొదలైనవారి నుద్దేశించి యుంటాయి. అగస్త్యుడు, రామునకు ఆదిత్య హృదయాన్ని ఉపదేశించినట్లు మనకు తెలిసిందే. పాముపంటి విషజంతువుల చికిత్సకు మందుతో బాటు మంత్రాలనుచ్చరిస్తూ ఉంటారు కదా. మందు ఓషధిరూపంలో గాని, చూర్ణం రూపంలో గాని యుంటుంది. గరుడునకు సంబంధించిన మంత్రాలను పఠిస్తే పాము కాటునుండి విముక్తులవడం ప్రసిద్ధం.

ఆదిశంకరులు తమ సౌందర్య లహరిలో (20 శ్లో.) అమ్మవారిని చంద్రకాంత శిలా వర్ణమూర్తిగా, అమృతరసం ఆమె అన్ని అవయవాల నుండి ప్రవహిస్తున్నట్లుగా, ఏ భక్తుడు అమ్మవారిని ధ్యానిస్తాడో వానికి గరుత్మంతుడు, పాము విషాన్ని పోగొట్టునట్లు చేయగలడని వ్రాసారు. అట్టి భక్తునకు అమృతనాడి ఉద్భవిస్తుందని, అట్టివాడు జ్వరగ్రస్తుణ్ణి చూసినా ఆరోగ్య వంతునిగా తీర్చిదిద్దగలడు అని వ్రాసారు. ఈ శ్లోకాన్ని చదివినా కూడా జ్వరాన్ని పోగొట్టవచ్చు. సౌందర్య లహరిలో ఒక్కొక్క శ్లోకాన్ని ఒక్కొక్క రోగానికై పఠించవచ్చు. కేరళలో నారాయణ భట్టాద్రి, నారాయణీయం వ్రాసి తన ఉదరబాధను పోగొట్టుకొన్నట్లు ఉన్నది. తిరుప్పుగళ్‌లో కూడా రోగాలను పోగొట్టే పద్యం ఉంది. సంబంధ స్వామి, పాండ్యరాజు రోగాన్ని త్రునీర్‌ట్రుప్పదిగం పఠించి విభూతితో మంత్రించి పోగొట్టినట్లు అంటారు. మంత్రాన్ని పఠిస్తూ విభూతి ధరించాలి, జలాన్ని గాని, తేనె గాని గ్రహించాలి. రోగి పఠించలేక పోతే అతని బదులు మరొకడు మంత్రాన్ని పఠించి ఆ మంత్రజలాన్ని రోగికి ఈయాలి. మంత్రరాజమైన గాయత్రి మంత్రాన్ని కూడా రోగనివారణార్థం పఠించవచ్చు.

విభూతికి ప్రత్యేక శక్తి ఉంది. కొంచెం విభూతినిమ్మని పామరులు కూడా అడుగుతారు. దీనిని ధరించడం, కొద్దిగా నోట్లో వేసుకోవడమనే ఆచారం ఉంది. పంచాక్షరిని, లేదా త్ర్యంబక మంత్రాన్ని గాని జపించి విభూతిని ధరిస్తారు కదా! తిరుచెందూర్ క్షేత్రంలోని పవిత్ర విభూతిని సర్వరోగహరణంగా శంకరులు కీర్తించారు. అపస్మార అనే పదాలతో ఆరంభమైన సుబ్రహ్మణ్య భుజంగస్తోత్రంలోని శ్లోకంలో ఇలా అన్నారు. విభూతిని కేవలం ధరించకపోయినా నోట్లో వేసుకోకపోయినా ఫరవాలేదు. కేవలం క్షణకాలం చూస్తేనే చాలు (విలోక్యక్షణాత్). కుష్ఠ, జ్వరం, ఉన్మాదం గ్రహబాధలు పోతాయని శంకరులన్నారు. పళని క్షేత్రంలోని సుబ్రహ్మణ్య విగ్రహాన్ని మూలికలతో తయారు చేసారని అంటారు. అనేక క్షేత్రాలలో ప్రత్యేకమైన

ప్రసాదాలుంటాయి. అవీ రోగాలను పోగొడతాయి. త్రిచూర్‌లో నేయి, గురువయ్యూర్‌లో తైలం అట్టివి. అంతేకాదు కాలినడకతో తిరుపతి కొండ నెక్కినా, అక్కడ అంగ ప్రదక్షిణాలు చేసినా, మంగళ సూత్రాలను అర్పించినా వేంకటేశ్వరుడు, అనేక రోగాలను పోగొడతాడని అనేక లక్షల భక్తుల అనుభవాలే చెబుతున్నాయి. పరమేశ్వరుడు సంసారమనే రోగాన్ని పోగొట్టడమే కాదు, వైద్యనాథస్వామిగా అనేక రోగాలను కుదురుస్తాడని తమిళదేశంలో ఒక క్షేత్రం ప్రసిద్ధి పొందింది. దానిని వైదీశ్వరన్ కోయిల్ అని అంటారు. ఉప్పు, బెల్లం ఎట్లా నీళ్ళల్లో కలిసిపోతాయో అట్లా రోగాలు పోవాలని వాటిని క్షేత్రాలలో అర్పిస్తూ ఉంటారు కూడా.

శివునకు ఇష్టమైన మారేదు దళాలను, విష్ణు ప్రీతికరమైన తులసిని, అమ్మవారికి ప్రీతికరమైన వేపను సమపాళ్ళలో గ్రహించి రోజూ సేవిస్తూ ఉంటే అనేక రోగాలు పోతాయని ఒక దేశీయమైన గ్రంథంలో ఉంది.

వేపగాలి, ఒంటికి తగిలినా రక్తదోషాలు పోతాయని, గర్భిణులకు మంచిదని, రావిచెట్టు గాలి స్త్రీ గర్భాశయ రోగాలకు మంచిదని, రావిచుట్టూ ప్రదక్షిణాలు చేయడం వల్ల సంతానం కల్గుతుందని, రావి, వేపచెట్లుకు పెళ్ళి కూడా చేయాలని ఇట్టి ప్రక్రియ సంతానకరమే అని ఆ గ్రంథంలో ఉంది.

పూజలో వాడే ధూపం, కర్పూరం కూడా రోగాలను నివారిస్తుందని దాంట్లో చెప్పబడింది.

అచంచలమైన భక్తివిశ్వాసాల వల్లనే అనేక రోగాలనుండి విముక్తిని పొందగలరు. అది ముక్తికి మార్గమై రోగాలను పట్టించుకోని స్థితిని ప్రసాదిస్తుంది. వైద్య శాస్త్రానికి అతీతమైన మంత్రపఠనంతో ఓషధులిచ్చినా, పై తులసి వంటి వాటిని సేవించినా రోగబాధల నుండి సులభంగా విముక్తిని పొందవచ్చు.

ఆయుర్వేదం - మతవిధులు

ఆయుర్వేదాన్ని భౌతికశాస్త్రంగా భావిస్తే ఆధ్యాత్మిక శాస్త్రంలో సంబంధం లేదనుకుంటాం. కానీ అల్లోపతి, యునానీ వైద్యాలవంటిది కాదు. ఆధ్యాత్మిక శాస్త్రంతో బొత్తిగా సంబంధం లేదనీ భావించదు. కారణమేమంటే నాస్తికుడికి వైద్యమే చేయరాదనీ అంది కదా!

ఆయుర్వేదం ఈశ్వరారాధనతో ఆరంభింప బడుతుంది. ప్రత్యేకంగా ధన్వంతరిని పూజిస్తారు. క్షీరసాగరమథనంలో మహావిష్ణువు ధన్వంతరి అవతారమెత్తి అమృతకలశాన్ని అందించినట్లుంది.

అంతేకాకుండా మతసంబంధమైన విషయాలతో ఆయుర్వేదం సంఘర్షణ పడదు. అల్లోపతి వైద్యం మొదలైన పాశ్చాత్య వైద్యాలలోని కొన్ని నియమాలు మన శాస్త్ర విధులకు విరుద్ధంగా ఉంటాయి. ఆయుర్వేదంలో వెల్లుల్లి వంటివాటిని వాడవచ్చునే నియమం తప్ప మిగిలినవన్నీ ఆచారానికి విరుద్ధంగా ఉండవు. అటువంటి వాటిని, తీసుకొన్నా పుణ్యాహ వాచనం, ప్రాయశ్చిత్త విధులను చేసుకోవచ్చు కూడా. కనుక సాధ్యమైనంతవరకు ఆస్తికులు పాశ్చాత్య వైద్య విధానానికి దూరంగా ఉండడం మంచిది. ఆయుర్వేదంలో మందులు ఆలస్యంగా పని చేస్తాయని, అల్లోపతిలో వెంటనే ఫలం కనిపిస్తుందని అంటారు. ఆలస్యంగా పనిచేసినా రోగం యొక్క మూలాన్ని నిర్మూలించే గుణం ఆయుర్వేదంలో ఉంది. అటువంటిది అల్లోపతిలో లేదని, తాత్కాలిక ఉపశమనం కల్గిస్తుందని అంటారు. ఆపైన వీటిని తీసుకొంటే కొత్త కొత్త రోగాలు వస్తాయని అంటారు. ఇట్టి లక్షణం ఆయుర్వేదంలో లేదు. ఆయుర్వేదంలో మొదట కొన్ని ఇబ్బందులు కలిగినా అవి క్రమక్రమంగా కనుమరుగౌతాయి.

వేద శాస్త్రానుగుణంగానే ఆయుర్వేదం ఉంటుంది. మనం శరీరాన్ని ఎట్లా రక్షించుకోవాలో అట్లాగే వేదశాస్త్ర నియమాలను దాటడం పనికిరాదు. ఆస్తికుడనే మాటకు వేద శాస్త్రాలపట్ల విశ్వాసం కలవాడనేది అసలైన అర్థం.

అట్లాగే పంచగవ్యాన్ని గూర్చి ధర్మశాస్త్రం చెప్పినట్లు వైద్యశాస్త్రము చెప్పింది. పాప పరిహారం కోసం పంచగవ్యాలను సేవించాలని ధర్మశాస్త్రాలన్నాయి. పంచగవ్యం అంటే ఆవుపాలు, పెరుగు, నేయి, గోమయం, గోమూత్రం కలిసినది. ఏదైనా ఒక రోగం నుండి విముక్తుడై నీరసంగా ఉన్నపుడు, మరల రోగం బారిన పడకుండా ఉండాలంటే వీటిని సేవించాలని వైద్యశాస్త్రము చెప్పింది.

వైదిక శాస్త్రం, ఏది పుణ్యమని, ఏది పాపమని చెప్పిందో అదే ఆయుర్వేదం హితమని, అహితమని చెప్పింది. అనగా శరీరానికి మేలు చేసేదని, కీడు చేసేదని. ఆచారం వల్ల పుణ్యం, అనాచారం వల్ల పాపం రాదా? అనాచారాన్నే అహితమని వైద్యమన్నది. అందుకే తప్పనిసరి పరిస్థితులలో అల్లోపతి వైద్యాన్ని పాటించినా సాధ్యమైనంతవరకు ధర్మశాస్త్రాలపట్ల విశ్వాస మున్నవారు ఆయుర్వేదాన్ని పాటించండి. ప్రతి రోగానికి కాడ్‌లివర్‌కి, లివర్ ఎక్స్ట్రాక్టుకి పరుగెత్తకండి.

శస్త్రచికిత్స

శస్త్రచికిత్స యనగా ఇది అల్లోపతి వైద్యానికి సంబంధించినదని గుర్తిస్తాం. ప్రస్తుత పరిస్థితులలో ఒకొక్కసారి ఇది తప్పనిసరి అవుతుంది.ఆచార వ్యవహారాలను సరిగా పాటించేవారైనా కంటిలో పొరలు ఏర్పడితే ఈ వైద్యాన్ని అవలంబించక తప్పడం లేదు. ఇప్పుడు మనమేమీ చేయలేకపోయినా పూర్వమే మన నిర్లక్ష్యం వల్ల అస్తవ్యస్త పరిస్థితులేర్పడ్డాయి.

అసలు శస్త్రచికిత్స మన వైద్య విధానంలో లేదనే అభిప్రాయానికి వచ్చేసాం. ఆయుర్వేదం దేశంలో ప్రవేశపెట్టబడినపుడే ఈ శస్త్రచికిత్స ఉంది. చరకుడు, సుశ్రుతుడు అనే మహానుభావులు చరకసంహితను, సుశ్రుత సంహితను అందించారు. చరక ఋషినే పతంజలి యని అంటారు. అగ్నివేశుడు చెప్పిన దానిని చరకుడు విశదీకరించి చెప్పాడు. వాగ్భటుడు

వ్రాసిన అష్టాంగ హృదయమనే గ్రంథము ఆయుర్వేదంలో ప్రసిద్ధిని పొందింది. పరంపరగా తమిళనాడులో అనేక వైద్యగ్రంథాలు చెలామణిలో ఉన్నాయి. చరకుడు వైద్యుడు. సుశ్రుతుడు శస్త్రచికిత్సా నిపుణుడు. ఈ నాటి వైద్యంలో ఇచ్చే M.B.B.S. పట్టాలో ఈ రెండూ ఉన్నాయి ఆయుర్వేదాన్ని పూర్తిగా పరిరక్షించుకొనగలిగితే మన ఆయుర్వేద వైద్యులు, శస్త్రచికిత్స లోనూ గణనకెక్కి యుండేవారు. మామూలు వైద్యంతోబాటు చరక సంహితకున్న ప్రాచుర్యం, సుశ్రుత సంహితకు దక్కలేదు. కారణమేదైతేనేమి మనం నష్టపోయాం.

ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా అనే విజ్ఞాన సర్వస్వం ఉంది కదా! అందులో ప్రతి కళను, శాస్త్రాన్ని వివరిస్తారు. ప్రతి 20,30 సంవత్సరాలకు క్రొత్త క్రొత్త విషయాలను చేర్చి ప్రచురిస్తూ ఉంటారు. ప్రతిశాస్త్రం యొక్క పూర్వోత్తరాలు చర్చింపబడతాయి. ఎక్కడ, ఏ కాలంలో ఎవరిమీదుగా ఇవి చెలామణిలోకి వచ్చాయో వివరంగా ఉంటుంది. ఆ గ్రంథంలో శస్త్రచికిత్సకు మూలం భారత దేశమని ఉగ్గడింపబడింది. అక్కడినుండి అరేబియాకు. అక్కడినుండి గ్రీసు దేశానికి, తరువాత ఇటలీ – ఆపైన మొత్తం యూరప్ దేశాలలో వ్యాపించిందని వ్రాయబడింది.

ఈనాడు వైద్యశాలలో ఉపయోగింపబడే సాధనాలన్నీ ఇంచుమించుగా సుశ్రుతంలో ఉన్నాయి. వేద పురాణాలలో ఈ చికిత్స మూలాలున్నట్లు పరిశోధకులు వెల్లడించారు.

ఋగ్వేదంలో ఒక రాణి, యుద్ధంలో పాల్గొన్నప్పుడు ఆమె కాలు విరిగిపోగా దేశ వైద్యులైన అశ్వినీ దేవతలు అతికినట్లుంది. రామాయణంలోని కథలో అహల్యను ఇంద్రుడనుభవించినప్పుడు ఋషి గౌతముడు అతని వృషణాలు పోవాలని శపించగా గొఱ్ఱెయొక్క వృషణాలను అతికినట్లుంది. (యజుర్వేదానికి చెందిన అరుణ మంత్రాలలోని 'అహల్యాయై జార' అనే మంత్రంలో ఇంద్రుడి గురించి ఉంది). మహాభారతంలో చ్యవనుడు, యయాతి

వంటివారు ముసలి తనాన్ని పోగొట్టుకొన్నట్లుంది. ఇవన్నీ కట్టుకథలు కావని, ఇట్టి వైద్య ప్రక్రియలు వైద్యశాస్త్రంలో ఉన్నాయని, కృత్రిమావయవాలను అమర్చుట, ప్లాస్టిక్ సర్జరీ వంటి వున్నాయని తేల్చారు.

శస్త్రచికిత్సలో అవయవాలు క్రుళ్ళిపోకుండా మందులు పూస్తారు. శస్త్రచికిత్స చేస్తున్నపుడు రోగికి బాధ తెలియకుండా మత్తుమందు ఇస్తారు. ఈ రెండూ పూర్వవైద్యంలో ఉన్నాయి. శస్త్రంతో ఛేదించినా, కాల్చినా వైద్యుణ్ణి రోగి ప్రేమించునట్లుగా నన్ను భగవంతుడే విధంగా పరీక్షించినా అతని పట్ల నా ప్రేమ, అచంచలంగా ఉండుగాక అని కులశేఖర ఆళ్వార్ అంటాడు. ఇక్కడ ఛేదించుట శస్త్రచికిత్సకు చెందినది, కాల్చుట, అవయవం క్రుళ్ళిపోకుండా చేసేది.

ఇంత విజ్ఞానమూ కాలక్రమంలో క్షీణించిపోయింది. దీనికి రెండు కారణాలున్నట్లనిపిస్తోంది. ఎంత జాగరూకతతో చికిత్స చేసినా కొన్ని ఇబ్బందులు తప్పవు. చికిత్సానంతరం వచ్చే రోగాలు కొన్ని యుంటాయి. కనుక చాలా నిపుణుడైతేనే గాని దీని జోలికి పోరు. వారి అనుభవాన్ని ఆకళింపు చేసుకొన్నవారు తక్కువగా ఉండడం వల్ల ఇది కొంతమంది చేతులలో ఉండి పోవలసి వచ్చింది. మరొక కారణమేమంటే ఆనాటి వైద్యులు తపోనిష్ఠా గరిష్ఠులవడం వల్ల ఎక్కడ సరియైన ఓషధి దొరుకుతోందో తెలియడం వల్ల, ఓషధులతోటే ఎంత తీవ్ర రోగాన్నైనా కూర్చగల శక్తి యుండేది. సైన్యం అంతా మూర్ఛపోతే ఆంజనేయస్వామి సంజీవని పర్వతాన్ని పెకలించుకొని తీసుకొని వచ్చినట్లు వారందరూ కోలుకున్నట్లు చదివాం కదా! ఓషధుల గాలి సోకితేనే మూర్ఛనుండి కోలుకొన్నారు. అందువల్ల శస్త్రచికిత్స పట్ల పూర్వులు శ్రద్ధ వహించలేదేమో (వైద్య విద్యలో చేరడానికి ముందు జంతు శాస్త్రాన్ని బోధిస్తారు కదా! అందనేక సజీవ ప్రాణులపై పరిశోధనలుంటాయి. జంతుహింసను ప్రోత్సహించని బౌద్ధమత ప్రభావం వల్ల ఇది అంతరించిందని కొందరంటారు. శరీర శాస్త్రం తెలియాలంటే ఏ అవయవం, శరీరంలో ఎక్కడ ఉందో తెలియాలి కదా)

ఇవే కాకుండా, ఇంకా కొన్ని వైద్య ప్రక్రియలున్నాయి. లేపం అనేది, తైలములు పూయుట, వంటివి. కేరళలో ఈ వైద్యవిధానం ఇప్పటికీ ఉంది. మరొకటి, రోగి చేత క్రక్కించుట (వమనం). దీనివల్ల కొన్నిరోగాలు తగ్గుతాయి. విరేచనం మరొకటి. రోగికి చెమట పుట్టించి దుష్టమైన నీటిని వెడలగ్రక్కునట్లు చేయుట స్వేదం, అట్లాగే స్నేహనం తైలాదులచే మర్దనం. ఇదీ కేరళలో ప్రచారంలో ఉంది. నశ్యం నాసికద్వారా చికిత్స. అనువాసనం, నిరూహమనేవి ఎనీమాలో రెండు పద్ధతులు.

పైపై అవయవాలకు చికిత్సలతో కాకుండా మెదడు, ప్రేగులు, ఎముకలు, నరాలు, రక్తపుపోటు, మధుమేహం వంటి రోగాలకూ చికిత్సలున్నాయి. వీటిని గుర్తు పట్టే ప్రక్రియలున్నాయి. ఆయుర్వేదం అంటే ఓషధులు, ధాతువులను వాడడం (రసవర్గం). చెట్లు మొక్కలు, లతలు, మొదలైనవి అన్నీ ఓషధుల పరిధిలోకి వస్తాయి. గంధకం, గరళం మొదలైన ధాతువులన్నీ రసవర్గంలోకి వస్తాయి.

కాయకల్పచికిత్సయని వినే ఉంటారు. అంటే శరీరాన్ని క్షీణించకుండా చేసే చికిత్స. ఎవ్వరూ చిరంజీవిగా ఉండలేదు కదా! కాని శరీర ఆరోగ్య రక్షణలో అన్ని నియమాలను పాటించేవారు, వారికున్న అంతశ్శక్తిని వృథా చేయకుండా ఉన్నవారు శాంతితో, దీర్ఘజీవనంతో ఉన్నవారు నేటికీ ఉన్నారు. ఈ శరీరాన్ని విందు వినోదాలకు కాకుండా యోగానికి, జ్ఞానానికి, తపస్సునకు ఉపయోగించే సాధనంగా ఉపయోగించుకోవాలి. కాయకల్ప చికిత్సలో రసాయనశాస్త్రం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆవుల మధ్యలో నుండుట, ఉసిరిక చెట్టు నీడలో నుండుట, మొదలైన ప్రక్రియలున్నాయి. (పండిట్ మదన మోహన మాలవ్యా ఈ చికిత్స చేసికొన్నట్లు విన్నాం). ఎందుకింత చెప్పవలసి వచ్చిందంటే వేదశాస్త్రాలు ఏవి పాపమని, పుణ్యమని అన్నాయో వాటినే ఆయుర్వేద గ్రంథాలు అహితమని, హితమని అంటాయి. ఆవుగిట్టల నుండి రేగిన దుమ్ము ఒంటిమీద పడితే పాపహరమని; ఉసిరిక

చెట్టు నీడలో తపస్సు చేస్తే ఫలప్రదమని ధర్మశాస్త్రాలలో చెప్పిన మాటలే వైద్యశాస్త్రంలో రసాయనిక ప్రక్రియ ద్వారా ప్రవేశపెట్టబడ్డాయి. ఇట్టివే కాయకల్ప చికిత్సలో ఉంటాయి. దీనివల్ల క్రొత్తరక్తం పట్టుట, కండరాలు సడలకుండా ఉండుట జరుగుతుంది.

ఆయుర్వేదంలో మిగతా శాస్త్రాలు

రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం ఎట్లా ఆయుర్వేదంలో మిళితమై యున్నాయో వివరించాను. అంతేకాదు, ఏడెనిమిది శాస్త్రాలకు సంబంధించినవీ ఇందులో ఉన్నాయి.

వైద్యంలో ముందుగా ఓషధులు వాడుతారు కదా! అంటే వృక్ష శాస్త్ర పరిజ్ఞాన మున్నట్లే. అట్లాగే ధాతువులను వాడేటపుడు రసాయన శాస్త్ర పరిజ్ఞానమున్నట్లే కదా. ఏ మందులు దేనికి పనిచేస్తాయో తెలిస్తే చాలా! రోగియొక్క శరీరతత్వం కూడా తెలిసియుండాలి. కనుక దేహధర్మ శాస్త్రమూ తెలియాలి. ఇక ఇళ్ళల్లో ఉండే ఆవులకు, పొలం దున్నే ఎద్దులకు, సైన్యంలో ఉపయోగించే జంతువులకు రోగాలు వస్తే వాటికీ చికిత్స చేయాలి కనుక జంతుశాస్త్రమూ తెలియాలి. ఈ విషయాలన్నీ అతీంద్రియజ్ఞానంతో ఋషులు గ్రహించి ఆయుర్వేదాన్ని లోకానికి అందించారు. మనుష్యులు, జంతువుల పట్ల మాత్రమే ఋషులు దయచూపించి ఊరుకోలేదు. చెట్లకు, మొక్కలకు, లతలకు వచ్చే రోగాలకు కూడా నివారణా పద్ధతులను వివరించారు. అదే వృక్షాయుర్వేదం. ఒక భౌతిక శాస్త్రాన్ని మినహాయిస్తే అనేక శాస్త్రాలు ఇందులో మేళవింపబడి యుంటాయి. కొంత భౌతిక శాస్త్రాన్ని కూడా కొన్ని శాస్త్రాల ద్వారా అందించారు. సర్.పి.సి.రే ఆధునిక శాస్త్రాల మూలాలు మన ప్రాచీన గ్రంథాలలో ఉన్నాయని హైందవ రసాయన శాస్త్రం అనే పుస్తకంలో

వివరించారు. కాని పాశ్చాత్యులు మాత్రం గడచిన రెండు మూడు వందల సంవత్సరాలలో వారు కనుగొన్నది మన ప్రాచీన గ్రంథాలలో లేవని బుకాయిస్తూ ఉంటారు. కాని చరకం, సుశ్రుతం కనీసం రెండువేల సంవత్సరాల వెనుక రచింపబడినవే కదా! వాటిని చూసి పైవారి అభిప్రాయాలను మార్చుకొంటారా?

మందు తీసుకొనేటపుడు పథ్యం

ఆయుర్వేదం, ఏ మందులు వాడాలో చెప్పడమే కాకుండా ఏ రోగానికి ఏ పథ్యం వాడాలో చెప్పిందని ఆధునికులు కూడా ప్రశంసిస్తారు. పథ్యం అనగా ఒక మార్గమునవలబించుట. తమిళంలోని పాత్తై, ఆంగ్లంలోని Path సంస్కృతంలోని పథి నుండి వచ్చినవే. పథ్యం అనగా ఆరోగ్యకరమైన మార్గమని. కేవలం మందులు వాడడం వల్లనే రోగం తగ్గదు. ప్రత్యేకమైన మితమైన ఆహారమూ తీసుకోవాలి. అందువల్లనే ఇది పథ్యమైనది. అన్ని పథ్యాలలో అప్పుడప్పుడు ఆహారం మానాలని, కనీసం పక్షానికి ఒక్కరోజైనా ఉపవాసం ఉండాలనడం గమనింపదగింది. ధర్మశాస్త్రము, వైద్యశాస్త్రమూ పక్షోపవాసాన్ని పేర్కొన్నాయి. మనం ఏకాదశినాడు ఉపవాసం ఉంటాం కదా!

ఆయుర్వేదాన్నే ఎందుకు వాడాలి?

ఎంతవరకూ ఈ ఆయుర్వేదాన్ని పాటిస్తామో అంతవరకూ అనారోగ్యం దరిచేరదు. మరొక కారణం కూడా ఉంది. ప్రకృతికి సంబంధించినది అది. ఆ ప్రకృతిని ప్రసాదించిన పరమాత్మయే ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క శీతోష్ణ పరిస్థితి ఏర్పాటు చేసాడు. ఏ దేశంలో ఏవి మొలకెత్తుతాయో అవే అక్కడి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి. అట్లాగే వైద్యం కూడా.

ఏయే ప్రాంతాలలోని ఓషధులు, ఆయా ప్రజలకు ఉపయోగిస్తాయి. ఈశ్వరుడు మనం సాత్త్వికులుగా ఉండాలని మనకు తగ్గట్లు, ఓషధులను, ధాతువులను ఏర్పాటు చేసాడు. ఋషులకు ఆయుర్వేద విజ్ఞానాన్ని అందించాడు. ఈ కర్మభూమి, వైదిక కర్మలకు అనుకూలమని, కర్మానుష్ఠానానికి తగ్గట్లు తగిన ఓషధులను, దీర్ఘ జీవనానికి తగ్గ సాధనాలను అందించాడు. భిన్న భిన్న దేశాలలో భిన్న భిన్న ఆచారాలుంటాయి. మతానుష్ఠాన పద్ధతులుంటాయి. వారికి తగ్గ వైద్య పద్ధతులుంటాయి.

వైద్యంలోనే కాదు, ఇంటినిర్మాణంలోనూ కృషి, కర్మ విషయంలోనూ పద్ధతులు దేశాలకు తగ్గట్లుంటాయి. పాశ్చాత్య పద్ధతులలో ఇళ్ళను కట్టుకొంటే కర్మానుష్ఠానానికి వీలుండదు. అధికమైన దిగుబడుల కోసం జపాన్ వ్యవసాయ పద్ధతులవలంబించినా అతివృష్టి, అనావృష్టులతో బాధపడేవారికి ఉపయోగపడకపోవచ్చు. ప్రకృతిని అల్లకల్లోలం చేయకూడదని పెద్దలంటారు కదా! ఈ నియమం అన్ని రంగాలలోనూ, వైద్యంలోనూ పాటించాలి. చరక సంహితలో ఈ మాట స్పష్టంగా ఉంది:

యస్మిన్ దేశేహి యో జాతః

తస్మై త జ్జౌషధం హితం

అనగా ఏ దేశంలో ఎవడు పుట్టాడో వాడికి అక్కడ మొలకెత్తిన ఓషధులతో వైద్యం మంచిదని.

దేశంలో ఎందరో ఉంటారు. అట్లాగే ఓషధులూ ఉంటాయి. ఈశ్వర సృష్టి నియమరహితంగా ఉండదు. ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. దీనిని అర్థం చేసుకోవాలి.

అందరికీ దీర్ఘజీవనం

నేను చెప్పినట్లు మీరందరూ. ఆయుర్వేదాన్ని అనుసరిస్తే తగినంత ఆయుర్వేద వైద్యులూ లేరు సుమా! కారణమేమంటే చాలాకాలం నుండి వైద్యపట్టా అంటే ఆంగ్లంలో పట్టా అని భావించడం వల్ల ఆయుర్వేదానికి హోటు లేకుండా పోయింది.

స్వాతంత్ర్యం రాకముందు జస్టిస్ పార్టీ వారు మద్రాసు ప్రాంతాన్ని పాలిస్తున్నప్పుడు పానగల్ రాజా కాలంలో కొన్ని బాధ్యతలు మనవాళ్ళకు తెల్లదొరలు అప్పజెప్పడం వల్ల కొంత స్వదేశీ భావన ఏర్పడింది. అతడు సంస్కృతం చదువుకోవడం వల్ల ఆయుర్వేదాన్ని ప్రోత్సహించాడు. ఆయుర్వేద విద్యాశాలను స్థాపించాడు. GCIM డిగ్రీని ప్రవేశపెట్టాడు. కాని దానికీ తగిన ప్రాచుర్యం ఏర్పడలేదు. ప్రజలలో స్వదేశీ భావన గట్టిగా నాటుకోకపోవడం వల్ల అతడాశించినంత అభివృద్ధిని పొందలేదు. ఇటీవల కాలంలో ఆయుర్వేదానికి కొంత ప్రోత్సాహం లభిస్తున్నందులకు సంతోషించాలి.

ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడానికి మూడు కారణాలున్నాయి. ఇందులో అనాచారపు పాలు తక్కువ. ఇది మన వాతావరణ పరిస్థితులకు అనుకూలం. మన శరీరానికి పడుతుంది, తక్కువ ఖర్చుతో వైద్యం సాగుతుంది. ఆపైన రుచి కూడా బాగుంటుంది. లేహ్యాములు వగైరా చాలా ఓషధులు సుగంధ భరితంగా ఉంటాయి. ఆముదంతో చేసిన మందులు కూడా చేదువాసన వేయవు.

చాలా కాలం వెనుకనే మన దేశంనుండి శస్త్రచికిత్స మిగతా దేశాలకు ప్రాకినా, కాలక్రమంలో క్షీణించడం వల్ల అసలు ఆయుర్వేదంలో శస్త్రచికిత్స ఉందా అనే సందేహానికి తావిచ్చింది. ఇట్లా ప్రాచీన శాస్త్రాలను ఒక్కొక్కటీ